MB PUBLICATIONS

# బంజారయ



మధుబాబు

# బంజాయ్

"తొందర పడకపోతే ప్రయోజనం లేదు గురూ! ఇటువంటి అవకాశం మరొకటి మన జన్మలో రాదు!!" అని అరుస్తూ లోపలికి పరిగెత్తుకు వచ్చాడు గంగారాం.

పది అడుగుల దూరంలో నిలబెట్టివున్న పెద్ద బండరాయి మీద దృష్టిని కేంద్రీకరించి వున్నాడు షాడో. గుండెల నిండా గాలి పీల్చుకొని, ఆ గది గోడలు దద్దరిల్లి పోయేటట్లు షౌట్ చేస్తూ అమాంతం గాలిలోకి ఎగిరాడు.

"అందమైన అనుభవాలు అవతల మన కోసం ఎదురుచూస్తుంటే, ఇలా కుప్పిగంతులతో టైం వేస్ట్ చేయడం దేనికి గురూ ?" అనబోతూ, చటుక్కున ఆ మాటల్ని మ్రింగేశాడు గంగారాం. ఎంత హడావుడిగా లోపలికి వచ్చాడో, అంతే హడావుడిగా బయటికి వెళ్ళి పోవటానికి ప్రయత్నించాడు.

అప్పటికే జరగవలసిన డామేజి జరిగిపోయింది.

కండరాలన్నిటినీ కంట్రోల్ చేసుకొని, చంచలమైన నేత్రాలను చలనంలేని ఏకాగ్రతలో బంధించి, నాభి కమలంలో నిక్షిప్తమై వుండే శక్తిని తన కుడి పాదంలోకి కేంద్రీకరించుకుంటూ గాలిలోకి లేచిన షాడో – తన కర్ణేంద్రియాలను కాచుకోవటం మరిచి పోయాడు.

కన్ను మూసి– కన్ను తెరిచే లోగా బండరాయిని సమీపించి ఒకే ఒక దెబ్బతో తునాతునకలు చేయవలసిన అతను, గంగారాం మాటలకు కాన్సన్ట్రేషన్ దెబ్బతిని, ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు నేలమీద పడిపోయాడు.

అది చూసి ఖంగారు పడిపోయాడు గంగారాం.

"హాయిగా తిని, మరింత హాయిగా తిరగాల్సిన నీకు ఎన్ని కష్టాలు వచ్చాయి గురూ! వద్దు వద్దని ఎంత చెప్పినా ఈ దరిద్రపు కుంగ్ఫూని వదిలి పెట్టవు కదా!!" అంటూ గబగబా ఆ గది మూలన వున్న మంచినీళ్ళ కుండను తీసుకువచ్చి షాడో తలమీద కుమ్మరించాడు.

ఊపిరి ఆగి పోయినట్లు బాధ పడుతున్న షాడో, మెల్లిగా లేచి కూర్చున్నాడు తల విదిలిస్తూ.

"అబాషిరీ పట్టణంలో బ్రహ్మాండమైన కొరియన్ డాన్స్ ప్రోగ్రాం అరేంజి చేయబడిందట... ఆ ప్రోగ్రాంని చూడకపోతే అసలు బ్రతకటమే అనవసరంట– మనం కూడా పోయి చూసొద్దాం గురూ ...." అతని ప్రక్కనే చతికిల పడుతూ, మెల్లిగా తను వచ్చిన పనిని బయటపెట్టాడు గంగారాం.

టెంప్ట్ అయ్యాడు షాడో, అప్పుడప్పుడూ జపాన్ థియేటర్స్‌లో ప్రదర్శించబడే ఆ డాన్స్ ప్రోగ్రాముల గురించి అతను కూడా విని వున్నాడు.

"ఆల్‌రైట్ గంగూ. నువ్వు ముందుగా పోయి టిక్కెట్లు రిజర్వ్ చేయించు. సాయంత్రం అయిదు గంటల కల్లా థియేటర్ దగ్గిరికి వచ్చేస్తాను." అంటూ గంగారాం భుజం తట్టి, గది బయటవున్న మైదానంలోకి పరుగుతీశాడు.

మైదానం మధ్యలో పెద్ద రావి చెట్టు ఒకటి వుంది. రకరకాల గోనె సంచులు ఒకదాని మీద ఒకటిగా పేర్చి వున్నాయి దాని క్రింద. వాటి నిండా బరువైన గులకరాళ్ళు నింపి వున్నాయి.

ఒక సంచిని తల మీదికి ఎత్తుకున్నాడు షాడో. మరో రెండింటిని రెండు భుజాల మీదా పెట్టుకొని, తూర్పు దిశగా అడుగులు వేశాడు.

అంతవరకూ అతని మనస్సులో మెదులుతున్న కొరియన్ డాన్స్ ప్రోగ్రాం మాట మాటుమాయం అయిపోయింది. క్షణాలు గడుస్తున్న కొద్దీ భరించరానిదిగా అనిపించసాగింది అతను మోస్తున్న బరువు. క్రిందవున్న రాళ్ళమీదా, ముళ్ళమీదా పడి విపరీతమైన బాధను కలిగిస్తున్నాయి పాదాలు. అయినా సరే పట్టిన పట్టు వదలకుండా, సూర్యుడు నడి మింటిని చేరుకునే సమయంలో తోషి పర్వత శిఖరాన్ని చేరుకున్నాడు.

సెగలు వెలువరుస్తున్న ఒక పెద్ద బండరాయి మీద పద్మాసనం వేసుకొని ధ్యానముద్రలో వున్నాడు కుంగ్‌ఫూ విద్యాపీఠానికి అధిపతి అయిన శతవృద్ధుడు బాజూ అకరక్ బింగ్‌లీ.

అలసట ఆయాసాలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ వచ్చిన షాడోని చూడగానే చిరునవ్వులు చిందిస్తూ బండరాయి మీద నిలబడ్డాడు.

మోసుకు వచ్చిన బరువును క్రిందికి దించి, అవనత వదనంతో ఆయనకు అభివాదం చేశాడు షాడో.

"సృష్టిలో వున్న ప్రతి వస్తువుకు, ప్రతి బరువుకు ఒక కేంద్ర స్థానం వుంటుంది రాజూ ... మామూలు కనులకు కనిపించని ఆ కేంద్ర స్థానాన్ని కనిపెట్టగలిగితే, ఎత్త రాని బరువుల్ని సైతం అవలీలగా ఎత్త వచ్చు. మీ భారతీయ పురాణ గాథల్లో శ్రీకృష్ణ భగవానుడు పాలుకారే పసితనంలోనే మహోన్నతమైన గోవర్ధన గిరిని చిటికెన వ్రేలిమీద నిలబెట్టాడని వుంది. ఇటు చూడు...." అంటూ చటుక్కున బండరాయి మీదినుంచి దిగాడు చింగ్ లీ.

ఆయన కదలికలు షాడో కనులకు కనిపించలేదు. కన్ను మూసి కన్ను తెరిచేసరికి, అంతవరకూ ఆయన్ను భరించిన ఆ బండరాయి, దూది మూట మాదిరి గాలిలోకి లేచి ఆయన చేతులమీద నిలబడింది.

పాతికమంది బలాఢ్యులు కూడా కదిలించలేని ఆ బండరాయిని, అంత సులభంగా ఎత్త గలిగిన ఆయన శక్తికి ఆశ్చర్యపోతూ, అప్రయత్నంగా మోకాళ్లమీద నేలకు వాలి అభివాదం చేశాడు షాడో.

"సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదు రాజూ... ఈ రోజు నీకు ఒక ప్రత్యేకమైన పోరాట పద్ధతిని నేర్పుతాను..." అంటూ బండరాయిని యథాస్థానంలో పెట్టి, దానిమీద కూర్చున్నాడు చింగ్ లీ.

నడినెత్తి మీదికి వచ్చిన సూర్యుడు నిర్దాక్షిణ్యంగా వెలువరుస్తున్న వేడిమిని మరిచిపోయాడు షాడో. గంగారాంకి యిచ్చిన మాట కూడా అతని మనస్సులోనుండి

తుడిచిపెట్టుకు పోయింది. వేడెక్కిన ఆ బండరాళ్ళమధ్య అలాగే బాసిపట్టు వేసుకొని చింగ్‌లీ పలుకుల్ని శ్రద్ధగా ఆలకించసాగాడు.

## 2

"నాకు తెలుసు.... పడుతూ లేస్తూ యింత దూరం రావటం శుద్ధ దండగ. రావాల్సిన పెద్దమనిషి రాకముందే టిక్కట్లు తీసుకోవటం వట్టి దండగేకాదు... బుద్ధితక్కువ కూడా..." అనుకుంటూ కసిగా నేలను తన్ని, చేతిలోవున్న టిక్కట్లను చించి ముక్కలు చేసేశాడు గంగారాం.

టిక్కట్లు దొరక్క ఆడిటోరియం ముందు తచ్చట్లాడుతున్న ఒక పౌరుడు అది చూసి నివ్వెరపోయాడు.

"అదేమిటి బ్రదర్! అలా చించేయటం ఏమైనా బాగుందా ?" అని అడిగాడు ఉండబట్టలేక.

"నా టిక్కట్లు నా యిష్టం వచ్చినట్లు చేసుకుంటాను. నీ కెందుకు బే ?" కళ్ళు పెద్దవిచేసి గఁయ్‌మంటూ అతని మీదికి పోయాడు గంగారాం.

కంగుతిని, గబగబా వెనక్కి జరిగాడు ఆ పౌరుడు. అదేదో మెంటల్ హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చిన సరుకేమో అని అనుమానం కలిగింది కాబోలు, అర్జంటు పని గుర్తుకు వచ్చినట్లు హడావుడిగా అవతలకు వెళ్ళిపోయాడు.

కనిపించిన వాళ్లందర్నీ కరిచి పారేయాలన్నంత కసితో మండిపోతున్నాడు గంగారాం. మరో రెండు నిముషాలు ఆడిటోరియం ముందే నిలబడి, విసురుగా ఒక వీధిలోకి దారితీశాడు.

అప్పటికి ఆరుగంటలు అయింది. ఆడిటోరియంలోనుంచి కొట్టొచ్చినట్లు వినవస్తోంది. వళ్ళు జలదరించే కొరియన్ మ్యూజిక్. అది చెవులబడిన కొద్దీ అవధులు దాటుతోంది గంగారాం కడుపుమంట.

"నేను ఏమని అడిగాను ? మడులు అడిగానా ? మాన్యాలడిగానా ? ? అమెరికా తీసుకుపోయి హాలీవుడ్ తారల్ని చూపించమన్నానా ? ? ? అడక్క అడక్క ఒక్క డాన్స్ ప్రోగ్రాం చూపించమని అడిగితే అయిపు అంతు లేకుండా పోయిన ఆ పెద్దమనిషిని అసలు ఏం చేయాలి ?" అనుకుంటూ అడుగులు వేయసాగాడతను అబాషిరీ పట్టణం మధ్యలో వున్న బస్ స్టాండ్ వైపు.

వంద గజాల దూరంకూడా పోకముందే అతనికి ఎదురు పడ్డారు అరడజను మంది ఆగంతకులు. పరుగులాంటి నడకతో వస్తున్నారు వాళ్ళు.... రోడ్డుమీది ఎత్తుపల్లాల్ని కూడా లెక్క చేయటంలేదు.

సామాన్యంగా అటువంటి శాల్తీలను చూడగానే ప్రక్కకు తొలిగి దారి యిచ్చేస్తాడు గంగారాం. కాని అతనిలో రగులుతున్న ఆవేదన అలా చేయనీయలేదు యిప్పుడు. నిర్లక్ష్యంగా అలాగే నిలబడిపోయాడు వారి దారికి అడ్డంగా.

పెద్దపులులు వెటపడి తరుముతున్నట్లు హడావుడిగా వస్తున్నారు ఆ వ్యక్తులు. అడ్డంవచ్చిన గంగారాంని రఫ్‌గా ప్రక్కకు నెట్టారు.

టాప్ పిచ్‌కి వెళ్ళిపోయింది గంగారాం కడుపుమంట.

"రేయ్ దొంగనాయాళ్ళ లారా ... కళ్ళు నెత్తి మీదికివచ్చి తన్నుకుంటున్నారా ? నేనెవరినో తెలుసా ?" అని రంకెవేసి ముందుకు జంప్ చేశాడు.

ఫెడీ మని కొట్టాడు ఒక వ్యక్తి .

కరెంట్ షాక్ కొట్టినట్లు జలదరించింది గంగారాం శరీరం. చేతుల్ని ముఖానికి అడ్డం పెట్టుకుంటూ అప్రయత్నంగా వెనక్కి జరిగాడు. తిమ్మిరెక్కిన గడ్డాన్ని సవరించుకుంటూ అతను ముందుకు చూసేసరికి, పదిగజాల దూరం వెళ్ళి పోయారు వాళ్ళు.

షాడో మీద కసిని మరిచిపోయాడతను. లాగిపెట్టి తంతే లేచి నిలబడటం చేతకాని నలుగురు కోన్‌కిస్కాగాళ్ళు తనని కొట్టి అవతలికి వెళ్ళిపోవటమా!!

"రేయ్ .... ఆగండిరా దొంగనాయాళ్ళలారా! దమ్ముంటే యింకోసారి కొట్టిచూడండిరా.... దెబ్బకు దెబ్బ తీయందే ఈ గంగారాంకి నిద్రపట్టదురా.... ఆగండి." అని అరుస్తూ వారి వెనుక పరిగెత్తాడు.

అతని అరుపుల్ని లక్ష్యపెట్టలేదు ఆ వ్యక్తులు. మరింత వేగంగా అడుగులువేసి ఆడిటోరియం ప్రక్కనే వున్న ఒక సందులోకి పోయారు.

సందు మధ్యలో ఆగివుంది చెవర్లెట్ కారొకటి. గబగబా వస్తున్న దృఢకాయులను చూడగానే దాన్ని ముందుకు కదిలించాడు డ్రయివర్.

"ఆగండి! మూతి మీద మీసం వున్న వాళ్ళయితే ఆగి, నా దెబ్బను కాచుకోండి!!" అని అరుస్తూ ఆ సందు ముందుకు చేరుకున్నాడు గంగారాం.

అతను చూస్తుండగానే కదులుతున్న కారులోకి జంప్ చేశారు దృఢకాయులు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో సందు చివరికి పోయి మాయం అయింది కారు.

తీవ్రస్థాయికి చేరుకుంది గంగారాం తపన. దెబ్బకు దెబ్బ తీసే అవకాశం దొరక్కుండా పోయిందన్న ఉక్రోషంతో కాలగాలిన పిల్లిలా ఆ సందులో చక్కర్లు కొట్టాడు. కొట్టి కొట్టి నీరసం ముంచుకు వచ్చింది.

"ఎక్కడికి పోతార్రా ? ఇవాళ కాకపోతే రేపయినా మిమ్మల్ని వెతికి పట్టుకోకుండా వూరుకుంటానా ? పట్టుకున్న తర్వాత చూపిస్తాను నా తడాఖా!!" అనుకుంటూ వెనుతిరిగి, సందు మొగదలకు అడుగులు వేశాడు.

"ఆగు బ్రదర్ .... మనల్ని యిక్కడే వెయిట్ చేయమని నాన్‌టాంగ్ కబురుపంపించాడు. నువ్వు ఎటయినా వెళితే మళ్ళీ నీ కోసం వెతకటం చాలా కష్టం!" మొరటుగా అతని వెనుక నుంచి వినవచ్చిందొక కంఠం.

ఎత్తిన పాదాన్ని ఎత్తినట్లే వెనక్కి తీసుకుంటూ వెనుతిరిగి చూశాడు గంగారాం. సందు ప్రక్కనే వున్న టీ బంక్ ముందు నిలబడి వున్నాడు అతని మాదిరిగానే పొట్టిగా లావుగా రఫ్‌గా కనిపిస్తున్న వ్యక్తి ఒకతను.

నాన్‌టాంగ్ ఎవరో గంగారాంకి తెలియదు. అతనికి తనకు వున్న సంబంధం ఏమిటో అంతకన్నా తెలియదు.

అసలు విషయం ఏమిటో తెలుసుకుందామని అనుకుంటుండగానే మ్రోతలు చేస్తూ అక్కడికి వచ్చిందొక పెద్ద లారీ.

"ఎక్కండి .... అందరూ త్వరగా ఎక్కండి .... నాన్‌టాంగ్ మీ కోసం నది వడ్డున ఎదురుచూస్తున్నాడు" విండోలో నుంచి తల బయటికి పెడుతూ హెచ్చరించాడు డ్రయివర్.

లారీని చూడగానే, మంత్రం వేసినట్లు అక్కడ ప్రత్యక్షం అయినారు మరో పాతికమంది దృఢకాయులు.

"ఇందాక వున్న హడావుడి ఏమయి పోయింది ? లారీ ఎక్కమంటే అలా బొమ్మలా నిలబడి పోతావేం ?" గంగారాం భుజం పట్టుకొని కుదుపుతూ అన్నాడు అతన్ని ఆపిన దృఢకాయుడు.

తనేమన్నా నిద్రపోయి, ఆ నిద్రలో కల కంటున్నాడేమోనని అనుమానం వచ్చి, కళ్ళు నులుముకున్నాడు గంగారాం. చేతిని గట్టిగా గిల్లుకున్నాడు.

"ఓరి నీ సోమరితనం సుజుకూ నదిలో కలవ! లారీ ఎక్కమంటుంటే విలబడటంలేదా ? చెవుడేమైనా వచ్చిందా ? ?" ఖంగుమంటున్న కంఠంతో రైలింజన్‌లా అరిచాడు లారీ డ్రయివర్.

నోరు తెరిచి ప్రశ్నలు వేసే అవకాశం గంగారాంకి లభించలేదు. కలిసి కట్టుగా ముందుకు వంగి, అతన్ని బలవంతంగా లారీలోకి లాగారు పదిమంది ధృఢకాయులు. వెంటనే కదిలింది లారీ. వేగంగా ప్రయాణంచేసి అరగంట తరువాత సుజుకూ నది వడ్డున ఆగింది.

వెంటనే క్రిందికి దూకి, వడ్డునే పెరిగివున్న మల్బరీ చెట్ల క్రిందికి పోయారు ధృఢకాయులు అందరూ.

ఒక చెట్టు క్రింద నిలబడి అసహనంగా అటూ యిటూ చూస్తున్నాడు సన్నగా పొడుగ్గా వున్న వ్యక్తి ఒకతను. నీలం రంగు దుస్తుల్ని ధరించి వున్నాడతను. బుగ్గలమీద కాటుకతో గీసినట్లు గుండ్రటి గీతలు రెండు కనిపిస్తున్నాయి.

ధృఢకాయుల వెనుకగా నిద్రలో నడిచినట్లు అడుగులు వేస్తూ వచ్చిన గంగారాం అతన్ని చూడగానే అదిరి పడి, ఆగిపోయాడు.

జపాన్ దేశంలో వుండే రౌడీ గాంగ్‌లన్నిటిలోను అమితమైన బలం కలిగినటువంటిది టోంగా గాంగ్. ఆ గాంగ్ వస్తాదులు ఎదురు పడితే, పెద్ద పెద్ద పోలీస్ అధికారులు సైతం తలలు వంచుకొని దూరంగా తొలిగిపోతారని వినికిడి.

తను చేసిన పొరపాటు ఏమిటో అర్థం అయ్యేసరికి చలిగాలి వీచినట్లు జలదరించింది గంగారాం శరీరం.

తాము చేసే లఫూట్ పనులకి అల్లరి చిల్లరగా తిరిగే మామూలు రౌడీలను వుపయోగించుకోవటం టోంగా వస్తాదులకు అలవాటు. తనను కొట్టి పారి పోయిన

రాస్కెల్స్ కోసం వెతుకుతూ పెద్ద రౌడీ మూకలో కలిసి పోయాడు తను. అదృష్టం బాగుండి ఇంత వరకూ బట్టబయలు కాలేదు తన బండారం. జారిన కాలు మరింత లోతుకు దిగజారక ముందే తెలివిగా తప్పించుకోవటం చాలా మంచిది ....

గంగారాం ఆలోచనలు పూర్తి కాక ముందే చిన్నగా దగ్గి గొంతు సవరించుకున్నాడు టోంగావస్తాదు.

"అర్జంటు పని ఒకటి జ్ఞాపకం వచ్చింది సార్ .... మీరు మాట్లాడుతూ వుండండి ... ఇప్పుడే వచ్చేస్తాను!" అంటూ చల్లగా రెండు అడుగులు వెనక్కి వేశాడు గంగారాం.

చివ్వున తల తిప్పి ఉరిమి చూశాడు టోంగావస్తాదు.

"ఏమన్నావ్ బే! ఏమిటి సనుగుతున్నావ్ ?" ఇనుప గొలుసులు రాచుకున్నట్లు కరకరలాడింది అతని కంఠం.

తడి ఆరి పోయింది గంగారాం గొంతు.

"అబ్బెబ్బే! ఏమీ నసగలేదు సార్ .... మిమ్మల్ని కలుసుకొని, మీ క్రింద పనిచేయ గలగటం నా అదృష్టం అన్నాను. మీ దర్శన భాగ్యంతో నా జన్మ తరించి పోయిందని కూడా అన్నాను...." అంటూ వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడకండా నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మా గాంగ్‌కి విరోధి అయిన ఒక మనిషి, మా వాళ్ళ కళ్ళు గప్పి యిటుగా పారి పోయి వస్తున్నట్లు వార్త అందింది మీరందరూ నది అవతల వున్న పొదల్లో కాపు కాయాలి.

ఎట్టి పరిస్థితిలోను, మా విరోధి నదిని దాటి ఇవతలకు రాకూడదు." అంటూ దుస్తుల్లో నుంచి రెండు కరెన్సీ కట్టల్ని బయటికి తీశాడు టోంగా వస్తాదు.

విప్పారిత ముఖాలతో అతని చుట్టూ చేరారు గంగారాంతో వచ్చిన ధృఢకాయులు అందరూ.

క్షణక్షణానికి తను బురదలో దిగబడి పోతున్నట్లు గంగారాంకి అర్థం అవుతూనే వుంది. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే తెలివి తేటలు కలవారు ఆ వస్తాదులు. ఏ మాత్రం అనుమానం వచ్చినా తను ప్రాణాలతో యింటికి పోవటం జరగదు.

మనస్సులో మెదులుతున్న ఆలోచనలు ముఖంలో కనిపించకుండా జాగ్రత్త పడుతూ, అందరితో పాటు తను కూడా కొసిని కరెన్సీ నోట్లను అందుకున్నాడు. అందరి మాదిరిగానే పళ్ళన్నీ కనపడేటట్లు వెకిలిగా నవ్వుతూ, మల్బరి చెట్ల ప్రక్కనే వున్న వంతెన మీదుగా సుజుకూ నది అవతలి ప్రక్కకు పోయాడు.

దట్టమైన చెట్లతో, వత్తయిన పొదలతో నిండి వుంది ఆ ప్రదేశమంతా. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి అప్పుడప్పుడే అక్కడికి అడుగు పెడుతోంది.

వంతెన దాటగానే ఒకరొకరుగా పొదల మధ్యకు పోసాగారు ధృఢకాయులు. కను చివరలనుంచి వారి కదలికల్ని జాగ్రత్తగా గమనిస్తూ మరికొంచెం ముందుకు పోయి, ఎత్తుగా వున్న ఒక ఫిలోసా వృక్షం మీదికి ఎగబ్రాకాడు గంగారాం. చడీ

చప్పుడు కాకుండా ఆ చెట్టుమీదే మరి కొంచెంసేపు కాలక్షేపం చేసి, ఎవరికీ కనిపించకుండా తోక ఝాడిద్దామని అతని ఆలోచన.

మరో అరగంట వరకూ అతనికి అనుకూలంగానే కనిపించాయి పరిస్థితులు. ఖచ్చితంగా అరగంట తరువాత ఒక్కసారిగా అడ్డం తిరిగింది కథ.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశబ్దంతో నిండివున్న ఆ ప్రదేశం వున్నట్లుండి అరుపులతో అల్లకల్లోలమై పోయింది.

"వస్తున్నాడు .... మనకు కావలసిన మనిషి యిటే వస్తున్నాడు .... రెడీగా వుండండి.... అందరూ సిద్ధంగా నిలబడండి.... " అని వార్నింగ్స్ యిస్తూ, శక్తివంతమైన మోటార్ సైకిళ్ళ మీద వేగంగా వంతెన మీదికి దూసుకు పోయారు యిద్దరు టోంగా వస్తాదులు.

వారి వెన్నంటి పరిగెత్తుకు వచ్చాయి మరో రెండు జీప్ కార్లు.

"పారిపోయి వస్తున్న మన విరోధిని జాగ్రత్తగా ప్రాణాలతో పట్టుకోవాలి.... అతని ప్రాణాలకు ఎటువంటి అపాయమూ సంభవించ కూడదు --- జాగ్రత్త ... జాగ్రత్త ..." అని హెచ్చరిస్తూ, నది వడ్డునే వున్న ఒక చిన్న మట్టిరోడ్డు మీదుగా దూసుకు వెళ్లిపోయింది వాటిలో ఒకటి.

గంగారాం దాక్కుని వున్న ఫిలోసా వృక్షానికి వంద అడుగుల దూరంలో ఆగింది రెండవది.

నీలం రంగు దుస్తులు ధరించిన టోంగా వస్తాదులు పది మంది, పొడుగాటి టార్చిలైట్లను పట్టుకొని పొదల్లోకి పరుగు తీశారు.

గుబగుబలాడుతున్న గుండెలతో, చెట్టు కొమ్మల్లో నుంచి ఆ గందరగోళాన్నంతా పరికించి చూశాడు గంగారాం. ముందు అనుకున్న ప్రకారం చడీ చప్పుడు లేకుండా అక్కడి నుంచి జారుకోవటం అసంభవమేమో అనిపించ సాగిందతనికి.

పది నిముషాల తరువాత సద్దుమణిగిందా సందడి. భయంకరమైన నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది మరోసారి.

"తల్లీ కలకత్తా కాళీ! బుద్ధి గడ్డి తిని ఈ బురదలో చిక్కుపడ్డాను. ఈ ఒక్కసారికి బయట పడే మార్గం చూపించావంటే - నీ మేలు యీ జన్మలో మరిచి పోలేను" అనుకుంటూ మెల్లిగా కుడి పాదాన్ని క్రింద వున్న కొమ్మ మీదికి పోనిచ్చాడు.

చల్లగా తగిలింది ఏదో పదార్థం. మెత్త మెత్తగా ఆనుకుంది అతని పాదానికి.

ఝల్లుమంది అతని శరీరం. నిఠారుగా లేచి నిలబడ్డాయి తల మీది వెంట్రుకలు.

"కొంపలు అంటుకున్నాయి దేవుడో! టోంగా నాయాళ్ళ గొడవకి భయపడి నాతోపాటే చెట్టెక్కేసినట్టుంది ఏదో జంతువు. ఇప్పుడు నేనేం చెయ్యాలిరో భగవంతుడో..." అనుకుంటూ పాదాన్ని వేగంగా పైకి లాక్కోబోయాడు.

పాదంతో పాటు పైకి వచ్చేశాడు ఒక వ్యక్తి. అతను కూర్చుని వున్న కొమ్మని గట్టిగా పట్టుకొని పట్టిపట్టి చూశాడు ముఖంలోకి.

"పారిపోవటానికి దారి చూపించమని ప్రార్థిస్తే ఇలా నా పీక నొక్కుతావా - ఇది నీకేమైనా బాగుందా కలకత్తా కాళీ..." అనుకుంటూ పిడికిలి బిగించి చిరుతపులిలా ఆ వ్యక్తి మీద కలబడ్డాడు గంగారాం.

చటుక్కున చేతులు ఎత్తి నమస్కారం చేశాడు ఆ వ్యక్తి.

పళ్ళు బిగువున తనను తను కంట్రోల్ చేసుకున్నాడు గంగారాం.

"ఎవరు నువ్వు! దెబ్బ కొట్టడానికి చేయి ఎత్తగానే చేతులు జోడించి కాకా పట్టేస్తున్నావ్! ఏమిటి నీ కథ ??" అని అడిగాడు అనుమానంగా చూస్తూ.

"నాలుగు.... నాలుగు రోజులనుంచీ.... టోంగా - టోంగా వస్తాదులు నన్ను - తరుముతున్నారు. నేను - నేను..." అంటూ బాధగా నొసలు విరిచి ముందుకు వాలి పోయాడతను. టోంగా వస్తాదులు వెతుకుతున్న మనిషి అతనే అని తెలియగానే అదిరి పడి అతని భుజాల్ని గట్టిగా పట్టుకున్నాడు గంగారాం.

"అయ్యా బాబోయ్... నా కొంప ముంచకు దేవుడో.... ఇప్పుడు నువ్వు గనక క్రింద పడ్డావంటే, నిన్ను వదిలి నన్ను తరుముతారు ఆ దొంగ నాయాళ్ళు..." అంటూ గడ్డం పట్టుకొని బ్రతిమాలాడు.

అలా బ్రతిమిలాడుతుండగా అతని చేతికి తగిలాయవి!

వెన్ను లో, కుడి భుజానికి, ఎడమ భుజానికి ఆరంగుళాల క్రిందుగా పిడి కంటా దిగబడి వున్నా యి - ఎనిమిది అంగుళాల పిడిబాకులు రెండు.

"అయ్యబాబోయ్!" అనబోయి చటుక్కున చేత్తో నోటిని అదుముకున్నా డు గంగారాం.

చెట్టు క్రింద వున్న పొదల చాటునుంచి యివతలికి వస్తున్నా రు పదిమంది టోంగా వస్తాదులు. ఉన్న ట్లుండి వెలిగాయి వారి దగ్గర వున్న టార్చిలై ట్లు. కనులు మిరుమిట్లు గొలిపే ఆ వెలుగులో నేలను వాసన చూస్తూ ముందుకు వస్తున్న వేటకుక్కలు రెండు గంగారాం కళ్ళ పడ్డాయి.

దాహం వేస్తున్న ట్లు ఎండుకు పోయింది అతని గొంతు.

మనుష్యులనై నా ఏమార్చవచ్చుగాని వేటకుక్కల్ని ఏమార్చటం కష్టం. అటు తిరిగి, యిటు తిరిగి అవి చెట్టు క్రిందికి రావటం తథ్యం. చెట్టు క్రిందికి వచ్చిన మరుక్షణం వాటికి సోకుతుంది రక్త పు వాసన! గాయపడిన ఆ వ్యక్తి వెన్ను మీదినుంచి ధారలు ధారలుగా కొమ్మ మీదికి కారుతోంది వెచ్చటి రక్తం!!

ఆ పరిస్థితి వచ్చేవరకూ అక్కడే కూర్చోవటం గంగారాంకి యిష్టం లేకపోయింది.

"సుజుకూ నది మీది నుంచి వచ్చే గాలి నాకు సరిపడటం లేదు బ్రదర్ - జలుబు చేసి తుమ్ములు వచ్చేటట్లున్నా యి. అవతలికి పోయి మాట్లాడుకుందాం పద -"

అంటూ అతని భుజాల్ని మరింత గట్టిగా పట్టుకొని క్రింద వున్న కొమ్మ మీదికి జారబోయాడు.

అతి ప్రయత్నం మీద కనులు తెరిచాడా వ్యక్తి. తల అడ్డం త్రిప్పుతూ ఆగమని సైగ చేశాడు.

చీమలు జెర్రులు పాకినట్లు కంపరం ఎత్తుతోంది గంగారాం శరీరం. చెట్టుకు పాతిక అడుగుల దూరంలోకి వచ్చేశాయి వేటకుక్కలు... ఒకదాని మెడ వెంట్రుకలు కత్తుల్లా లేచి నిలబడుతున్నాయి...

"అల్ రైట్ బ్రదర్.... సస్పెన్సులంటే నాకు పరమ అసహ్యం. తొందరగా చెప్పేయ్ నీ బాధ ఏమిటో" అన్నాడతను ఖంగారును కప్పిపెట్టుకొనేందుకు విఫల ప్రయత్నం చేస్తూ.

"టోంగా రాక్షసుల్ని ఎదిరించి పారిపోయే శక్తి నాలో లేదు. సకాయ్ పట్టణంలో లిన్‌ఫాంగ్ అనే వృద్ధుడికి దీన్ని అందించగలవా ?" అంటూ వణుకుతున్న చేతులతో, పాంటు జేబులోనుంచి చిన్న మెటల్ ట్యూబ్‌ని తీసి అతనికి అందించాడు ఆ వ్యక్తి.

రాగి రేకుతో తయారు కాబడిన చిన్న సైజు తాయత్తులా వుందది. గాలి వీస్తే ఎగిరి పోయేటంత తేలికగా కనిపిస్తోంది.

చెట్టు క్రిందికి వచ్చేశాయి వేటకుక్కలు. ఉన్నట్లుండి తల పైకి ఎత్తింది వాటిలో ఒకటి. ఎత్తిన మరుక్షణం కోరలు కనపడేటట్లు నోరు తెరిచి భయంకరంగా అరిచింది.

అదిరిపడి, క్రింది కొమ్మ మీద వున్న పాదాల్ని పైకి లాక్కున్నాడు గంగారాం.

"జపాన్ దేశం యొక్క భవిష్యత్తు ఆ మెటల్ ట్యూబ్ సకాయ్ పట్టణం చేరటం మీద ఆధారపడి వుంది. జాగ్రత్తగా వ్యవహరించి కార్యాన్ని సానుకూల పరచాలి బ్రదర్.... గుడ్‌బై....!" అంటూ ఒక్కసారిగా ప్రక్కకు తిరిగి క్రిందికి దూకేశాడు ఆ వ్యక్తి.

ఖంగారుగా చేతులు జాచి అతన్ని పట్టుకోవటానికి ప్రయత్నించాడు గంగారాం. అప్పటికే ఆలస్యం అయిపోయింది. పల్టీలు కొడుతూ పోయి సరిగ్గా వేటకుక్కల ముందు పడ్డాడతను.

భయంతో కంపించి పోతూ, కీచుగా అరిచి పొదల్లోకి పారి పోయాయవి. టార్చి లైట్లు పట్టుకున్న టోంగా వస్తాదులు ఒక్కక్షణం పాటు నివ్వెరబడి నిలిచిపోయారు.

ఆ పైన ఏం జరిగిందో గంగారాం చూడలేదు. మెటల్ ట్యూబ్‌ని పాంటు జేబులోకి నెట్టి జర్రున జారాడు చెట్టుమీది నుంచి. టోంగా వస్తాదులు తనను గమనించే లోపుగానే పొదలకు అడ్డంపడి పిక్కబలం చూపించాడు.

పది నిముషాల తరువాత అతని ముందు ప్రత్యక్షం అయింది సుజుకూ నది. పొడుగాటి రైఫిల్‌ని పట్టుకొని వడ్డుమీద కాపలా నిలబడిన ఒక రౌడీ కూడా కనిపించాడు.

"నాన్‌టాంగ్ ఎక్కడ వున్నాడు ? అతన్ని అర్జంటుగా పిలుచుకు రమ్మన్నారు.... ఆలస్యం అయితే కొంపలు అంటుకుంటాయి...." అంటూ అతని ప్రక్కనుంచి దూసుకుపోయాడు గంగారాం.

ఒక్క క్షణంపాటు నోరు వెళ్ళబెట్టి చూశాడు రౌడీ. రెండో క్షణంలో తేరుకుని గంగారాం వెంటపడ్డాడు, "ఆగు... ఆగు -" అంటూ.

ఆగలేదు గంగారాం.... తల్లక్రిందులుగా పల్టీకొట్టి నీటిలోకి దూకేశాడు. బలంగా బారలు వేస్తూ కన్ను మూసి కన్ను తెరిచేటంతలో ప్రవాహం మధ్యలోకి వెళ్ళిపోయాడు.

గొంతు చినిగి పోయేటట్లు కేకలు మొదలు పెట్టాడు ఆ రౌడీ.... రైఫిల్‌ని ఎత్తి రెండుసార్లు ప్రేల్చాడు.

వెనక్కి తిరిగి చూడకుండా సూటిగా పోయి రెండు నిముషాల్లో అవతలి వడ్డును చేరుకొన్నాడు గంగారాం. నీళ్ళు కారుతున్న బట్టలతో వేగంగా సిటీలోకి పరుగుతీశాడు.

అరగంట తరువాత ఆరి పోయాయి బట్టలు. మరో అరగంట తరువాత ఎదురుపడింది ఒక చిన్న టీ బంక్.

"నీ మెటల్ ట్యూబ్ సురక్షితంగా సకాయ్ పట్టణం చేరినట్లే బ్రదర్ - కాస్త వేడివేడి టీ తాగి శరవేగంతో మా రాజు దగ్గరకి పోతాను - అతన్ని తోడు తీసుకొని రేపు వుదయమే సకాయ్ సిటీకి ప్రయాణం అవుతాను" అనుకుంటూ బంక్ లోకి

పోయాడు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు కప్పులు టీ తాగి, తాపీగా రోడ్డుమీదికి వచ్చాడు.

"ఒక్క క్షణం ఆగు బ్రదర్.... నీతో చిన్న పని వుంది." అంటూ వెంటనే విన వచ్చింది ఒక కంఠం. ఇనుప స్తంభాల్లాంటి రెండు చేతులు బరువుగా పడ్డాయి అతని భుజాల మీద.

ఉలిక్కిపడి వెనుతిరిగి చూశాడు గంగారాం.

నిశ్శబ్దంగా వచ్చి అతని చుట్టూ నిలబడ్డారు అనేక మంది టోంగా వస్తాదులు.

"ఏమిటిది ? ఎందుకు నన్ను నిలవేశారు ? నేనేం చేశాను ?" ఆశ్చర్యంగా అనబోయి మాటల్ని మధ్యలోనే మ్రింగేశాడు గంగారాం.

దబ్‌మని శబ్దం చేస్తూ అతని పాదాలముందు పడింది ఒక శరీరం. నెత్తురు మరకలతో అసహ్యకరంగా వుంది అది. మెడ విరిగిపోయినట్లు తల అడ్డం తిరిగి వుంది. దాని వెన్నులోనుంచి వెక్కిరిస్తున్నట్లు తొంగి చూస్తున్నాయి రెండు పిడిబాకులు.

"మా కళ్లు కప్పి, మమ్మల్ని మోసం చేసి పారిపోగలిగినవాడు ఇంత వరకూ పుట్టలేదు బే.... ఈ మనిషి దగ్గిర ఒక వస్తువు ఉండాలి - అది ఏమైంది ? ?" కరుకుగా అడుగుతూ లాగిపెట్టి గుద్దాడు ఒక వస్తాదు.

గింగిరాలు తిరుగుతూ పోయి, రోడ్డు ప్రక్కనే వున్న ఒక కరెంట్ పోల్‌కి గుద్దుకొన్నాడు గంగారాం.

ఖంగుమని శబ్దం చేసింది తల. కనుల ముందు ప్రత్యక్షం అయ్యాయి టెక్నికలర్ నక్షత్రాలు.

"సమాధానం కావాలి బే - నా ప్రశ్నకు సమాధానం కావాలి -" అంటూ ముందుకు వచ్చి లాగిపెట్టి తన్నాడు ఆ వస్తాదు.

రెండు అడుగుల ఎత్తుకు లేచి కరెంటు పోల్ ప్రక్కనే వున్న డస్ట్‌బిన్ మీద పడ్డాడు గంగారాం.

అప్రయత్నంగా పాంటు జేబులోకి పోయింది అతని చేయి. మెటల్ ట్యూబ్‌ని బయటికి తీసి, టోంగా వస్తాదులు గమనించే లోపుగానే నోటిలో వేసుకుంది.

"సమాధానం చెప్పు బే.... చనిపోయిన మనిషి దగ్గిర వస్తువు ఏమయింది ? ఎక్కడ దాచబడింది ?" మరింత కర్కశంగా అడుగుతూ అతని జుట్టు పట్టుకొని పైకి లేపాడు టోంగా వస్తాదు.

"నాకు.... నాకు తెలియదు. మీ మాటలు నాకు అర్థం కావటం లేదు" మెటల్ ట్యూబ్‌ని నాలుక క్రింద భద్రపరుస్తూ అన్నాడు గంగారాం.

ఆ మాట అతని నోటి నుంచి వెలువడిన మరుక్షణం వర్షం పడినట్లు పడ్డాయి పిడి గుద్దులు.

బాధతో మెలికలు తిరుగుతూ రోడ్డుమీద పడిపోయాడు గంగారాం. వెంటనే లాగి లాగి తన్నటం ప్రారంభించారు టోంగా వస్తాదులు అందరూ.

"నీకు చెప్పకుండా ఈ గొడవలో తల దూర్చటం తప్పయి పోయింది. ఈ ఒక్కసారి నన్ను క్షమించేయ్ గురూ.... ఈ దొంగ నాయాళ్ళ బారి నుంచి రక్షించు - " షాడోని తలుచుకొని ఆక్రోశించింది గంగారాం అంతరంగం. తగులుతున్న దెబ్బల్ని తట్టుకోలేక స్పృహ తప్పి వ్రేలాడ బడిపోయింది అతని శరీరం.

"వీడి సంగతి యిక్కడ కాదు తేల్చుకోవాల్సింది.... తీసుకు పదండి" అని ఆర్డర్ యిస్తూ టీబంక్ పక్కనే వున్న సందులోకి దారి తీశాడు మొదటి వస్తాదు.

గంగారాంని భుజం మీద వేసుకొని అతన్ని అనుసరించారు మిగిలిన వారందరూ.

## 3

"... ఇక్కడ కాదు ఈ విద్యను నేర్చుకోవలసింది.... నాతో వస్తే వివరంగా తెలియచేస్తాను" అంటూ ముందుకు అడుగు వేశాడు చింగ్ లీ.

చేతిలో వున్న కత్తి ని క్రిందపెట్టి ఆయన్ను అనుసరించాడు షాడో.

కుంగ్ఫూ విద్యాపీఠం వెనుక భాగంలోకి పోయి ఆగాడాయన. శెగలు వెలువరుస్తూ అక్కడ అగుపిస్తోంది పెద్ద అగ్ని గుండం.

"ఖడ్గ విద్యలో ఆరి తేరాలంటే, ముందు నీ పాదాల కదలికను క్రమ బద్ధం చేసుకోవాలి.... నువ్వు కొట్టే దెబ్బ కంటే, నీ శత్రువు కొట్టే దెబ్బను కాచుకోవటం చాలా ముఖ్యం. అందుకు వేగవంతమైన పాదాలు కలిగి వుండాలి... యిటు చూడు" అంటూ ఎగిరి అగ్ని గుండంలోకి దూకాడు చింగ్ లీ.

కణకణలాడుతున్న నిప్పులతో నిండి వుందా గుండం.... అడుగుపెట్టిన మరుక్షణం అంట కాల్చేస్తుంది.

అసలు తన పాదాల క్రింద నిప్పులే లేనట్లు అడుగులు వేస్తూ కత్తి ని తిప్పటం మొదలుపెట్టాడు చింగ్‌లీ. రెండు నిముషాల తరువాత చటుక్కున ఎగిరి నేలమీదికి వచ్చాడు.

"ఏ మాత్రం అజాగ్రత్త గా వున్నా నిన్ను నీ పాదాల్ని నిలబెట్టి కబళిస్తాయి నిప్పులు. వాటి కోరలకు అందకుండా వేగంగా కదల గలిగిన రోజున నీకు ఖడ్గ విద్య అవగతమౌతుంది." అంటూ ప్రక్కకు తిరిగి సైగ చేశాడు.

అంత వరకూ దూర దూరంగా నిలబడి వున్నాడు ఫ్యుజీశాన్. వెంటనే ముందుకు వచ్చి నమస్కరించాడు.

"అగ్ని గుండంలో అడుగిడటం ఎలాగో రాజుకు అర్థం అయ్యేటట్లు విశదీకరించు. నాకు ప్రార్థనా సమయం అయింది." అంటూ షాడోని అతనికి అప్పగించి ప్రార్థనామందిరం వైపు వెళ్ళిపోయాడు చింగ్‌లీ.

పాదాలు రెండింటినీ దగ్గరకు చేర్చి వినయంగా నిలబడి వున్న షాడోని చూసి పెద్దగా నవ్వాడు ఫ్యుజీశాన్.

విద్యాపీఠంలో కుంగ్‌ఫూని అభ్యసిస్తున్న విద్యార్థులందరిలోకి పెద్దవాడు ఫ్యుజీశాన్. మూడొంతుల శిక్షణ అతని చేతుల మీదుగానే జరిపించటం చింగ్‌లీకి అలవాటు.

ఫ్యుజీశాన్ నవ్వు వంటికి కారం రాచినట్లు అనిపించినా; పెదవి కూడా కదిలించకుండా మౌనంగా నిలబడి పోయాడు షాడో.

"పాలు త్రాగవల్సిన పసిపాపకు పెద్దవాళ్ళు తినే ఆహారం యిచ్చినట్లు కత్తి పట్టుకోవటమే సరిగా తెలియని నీకు ఈ అగ్నిగుండపు రహస్యం బోధింపవలసి వచ్చింది. గురువుగారి ఆజ్ఞను అతిక్రమించటం నాకు చేతకాదు. అగ్నిగుండంలోకి అడుగుపెట్టు...." అంటూ భుజం మీద చేయివేసి బలంగా ముందుకు నెట్టాడు ఫ్యుజీశాన్.

అదిరిపడి ప్రక్కకు దూకేశాడు షాడో. ఆ ఖంగారులో పాదం మెలికపడి తల్లక్రిందులుగా పల్టీ కొట్టాడు.

ఫక్కుమని వినవచ్చాయి పెద్ద పెద్ద నవ్వులు.

ముఖానికి అంటిన మట్టిని దులుపుకుంటూ లేచి నిలబడిన షాడో కనులకు వినోదంగా చూస్తూ, వెక్కిరింపుగా నవ్వుతున్న కుంగ్‌ఫూ విద్యార్థులు అనేక మంది అగుపించారు.

"ఎక్కడో నాగరికత తెలియని దేశంలో జేబు దొంగతనాలు చేస్తూ బ్రతకవలసిన మనిషి, కుంగ్‌ఫూ నేర్చుకోవటం మొదలు పెడితే ఎలా వుంటుందో చూడటానికి వచ్చారు వీళ్ళు.... లేచి నిలబడి అభివాదం చేయి...." కనుబొమ్మల మధ్యనుంచి క్రూరంగా చూస్తూ అన్నాడు ఫ్యుజీశాన్.

మౌనంగా లేచి, వారందరికీ తలవంచి నమస్కరించాడు షాడో.

"అగ్ని గుండం దగ్గర నిలువబడి ఆ వేడిమిని భరించటం ఎలాగో సాధన చేస్తూ వుండు.... నేను కొద్దిసేపట్లో వస్తాను." అంటూ అక్కడికి వచ్చిన విద్యార్థులను వెంట బెట్టుకొని అవతలికి వెళ్ళిపోయాడు ఫ్యుజీశాన్.

బట్టలకు అంటిన దుమ్మును వదిలించుకొని అగ్ని గుండం దగ్గర నిలబడ్డాడు షాడో. గంట.... రెండు గంటలు గడిచిపోయాయి. కొద్దిసేపట్లో వస్తానని చెప్పిన ఫ్యుజీశాన్ మాత్రం అయిపు అంతు లేడు.

మూడవ గంట గడుస్తుండగా పరుగులాంటి నడకతో అతన్ని సమీపించాడు ఒక విద్యార్థి. షాడోతో పాటు ఒకే గదిలో వుంటున్నాడతను.

"రాజూ.... గంగారాం నిన్న మధ్యాహ్నం అబాషిరీ పట్టణం వెళ్ళాడు. ఇంత వరకూ తిరిగి రాలేదు...." అని చెప్పి హడావుడిగా ఏదో పని మీద అవతలికి వెళ్ళిపోయాడు.

అంత వరకూ ప్రశాంతంగా వున్న షాడో మనస్సు ఒక్కసారిగా వికలమైపోయింది ఆ మాట వినగానే....

తనను వదిలి ఒక్క గంటకూడా వుండలేడు గంగారాం.... నిన్ననగా వెళ్ళిన మనిషి యింకా తిరిగి రాకపోవటం ఏమిటి ? కొంపతీసి ఏదైనా గొడవలో చిక్కుపడలేదు కదా!

ఆ మాట మనసులో ప్రవేశించిన మరుక్షణం విపరీతమైన ఆందోళన అతన్ని పీడించటం మొదలు పెట్టింది. వెంటనే అక్కడినుంచి కదిలి విద్యాపీఠం ముందు భాగంలోకి వెళ్ళాడు.

పాతిక మంది విద్యార్థులను చుట్టూ కూర్చోబెట్టుకొని ఏవో కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాడు ఫ్యుజీశాన్. షాడోని చూడగానే నొసలు ముడివేశాడు.

"అత్యవసరమైన పని మీద నేను అబాషిరీ పట్టణం వెళ్ళాలి. దయచేసి అనుమతి యిప్పించండి." వినయంగా తలవంచి విన్నవించాడు షాడో.

పళ్ళు కొరుకుతూ లేచి నిలబడ్డాడు ఫ్యుజీశాన్.

"బుద్ధిహీనుడా.... కుంగ్‌ఫూ విద్యాపీఠం యొక్క నియమాలను మరిచిపోయావా ? పది లెక్కబెట్టేలోగా అగ్నిగుండం దగ్గిరికి పోకపోతే, తగిన శిక్షను అనుభవించాల్సి వుంటుంది." అంటూ హుంకరించాడు.

తల వంచుకొని వెనుతిరిగాడు షాడో. పరుగులాంటి నడకతో అగ్నిగుండం దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు.

అరగంట తరువాత విద్యార్థుల నందర్నీ వెంట బెట్టుకొని అక్కడికి వచ్చాడు ఫ్యుజీశాన్.

అక్కడ వున్న ఖడ్గాలలో ఒకటి షాడో మీదికి విసిరి అగ్నిగుండం వైపు చూపించాడు.

"అబాషిరీ పట్టణంలో అత్యవసరమైన పని వుంది. ఈ రోజుకు నన్ను సాధననుంచి విముక్తి చేయండి.... ప్లీజ్!...." మీదికి వచ్చిన ఖడ్గాన్ని అందుకొని మళ్ళీ నేల మీద పెడుతూ వేడుకున్నాడు షాడో.

"పది లెక్కబెట్టేలోగా ఖడ్గాన్ని పట్టుకొని సిద్ధంగా నిలబడకపోతే నిన్ను అగ్ని గుండంలోకి నెట్టవలసివస్తుంది...." మూడు మూరల పొడుగున్న ఖడ్గాన్నొకదాన్ని అందుకుంటూ కరుకుగా హెచ్చరించాడు ఫ్యుజీశాన్.

కదల లేదు షాడో.... క్రింద పెట్టిన ఖడ్గాన్ని అందుకోలేదు.

"దుర్మార్గుడా.... నీ కంటే అధికులు చెప్పిన మాటను నిర్లక్ష్యం చేస్తావా ? పవిత్రమైన ఈ నేలను నీ మొండిపట్టుతో కలుషితం చేస్తావా ? చూడు నిన్నేం చేస్తానో...." మైదానం దద్దరిల్లి పోయేటట్లు రంకెవేసి అతని మీదికి లంఘించాడు ఫ్యుజీశాన్.

తనను తాను మరిచిపోయాడు షాడో. అంత వరకూ అణిచి పెట్టుకున్న ఆగ్రహం ఒక్కసారిగా అతన్ని నిలువెల్లా ఆవరించుకుంది.

కాలితో నేలను తన్ని గుండెలు చెదిరిపోయేటట్లు షౌట్ చేశాడు. పళ్ళు కొరుకుతూ గాలిలోకి ఎగిరి ఫెడీమని తన్నాడు ఫ్యుజీశాన్ గుండెలమీద.

అదిరి పోయి నోళ్లు తెరిచారు అక్కడ వున్న విద్యార్థులు అందరూ. తమకంటె అధికుడి మాటకు ఎదురు చెప్పటమే క్షమించరాని నేరం. అందుకు శిక్ష

చాలా దారుణంగా వుంటుంది. అటువంటిది - యాకంగా ఎదురు తిరిగి చేయి చేసుకుంటే ఏమౌతుంది!!!

విద్యాపీఠపు చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ఆ సంఘటన వారిని నిశ్చేష్టులను చేసేసింది.

షాడో కొట్టిన దెబ్బకు మరొక మనిషి అయితే అక్కడికక్కడే విరుచుకు పడి పోయి వుండేవాడు. చీమ కుట్టినట్లు కూడా చలించలేదు ఫ్యుజీశాన్. ఒక అడుగు వెనక్కి వేసి విచిత్రంగా నవ్వాడు.

"నిన్న కాక మొన్న వచ్చిన అర్భకుడివి నువ్వు! నీ విద్యల్ని నా ముందే ప్రదర్శిస్తావా ? చూడు నీకు ఏ గతి పట్టబోతున్నదో!" అంటూ చేతిలోని కత్తిని గుండ్రంగా తిప్పి, బలంగా వేశాడు షాడో తలమీద.

హాహాకారాలు చేశారు అక్కడికి వచ్చిన విద్యార్థులు అందరూ. షాడో చనిపోయాడనే అనుకున్నారు వారందరూ.

చనిపోయే ఉద్దేశ్యం షాడోకి లేదు. ఫ్యుజీశాన్ కంటె వేగంగా కదిలి వెనక్కి దూకాడు. అయినప్పటికీ కత్తి వాదర తగిలి సన్నగా చీరుకు పోయింది అతని ఎడమ చేయి.

"శహభాష్.... కత్తి తిప్పటం రాకపోయినా, దెబ్బను కాచుకోవటం బాగానే అబ్బిందే! శహభాష్!!" అంటూ కత్తిని అడ్డం తిప్పి ఫెడీమని కొట్టాడు ఫ్యుజీశాన్.

ఎంత వేగంగా కదిలినా ఆ దెబ్బ నుంచి మాత్రం తప్పించుకోలేక పోయాడు షాడో. తాటిమట్ట పెట్టి కొట్టినట్లు అతని తొడలకు తగిలింది దెబ్బ. బాలెన్స్ తప్పి నేలమీద పడి పోయాడు.

"నా గుండెలను తాకిన నీ పాదాన్ని రెండు ఖండాలు చేస్తాను. నీ కంటె అధికుల మీద చేయి ఎత్తితే ఫలితం ఎలా ఉంటుందో బాగా అర్థం అయ్యేలా చేసి చూపిస్తాను." అంటూ షాడో తొడలమీద కాలువేసి అదిమి పట్టాడు ఫ్యుజీశాన్. కత్తి ని రెండు చేతులతోను పట్టుకొని గాలిలోకి ఎత్తాడు.

భయంతో కంపించి పోయారు అక్కడ వున్న విద్యార్థులు. ప్రార్థనా మందిరంలో వున్న గురువుగారికి ఆ విషయాన్ని రిపోర్టు చేసేందుకు పరుగు తీశారు వారిలో కొందరు.

గురువుగారు వచ్చేలోగా ఫ్యుజీశాన్ అన్నంత పనీ చేస్తాడని షాడోకి తెలుస్తూనే ఉంది. అసాధారణమైన శక్తియుక్తులు కలవాడు ఫ్యుజీశాన్. పది సంవత్సరాల నుంచీ క్రమం తప్పకుండా కుంగ్‌ఫూ సాధన చేస్తున్నాడు. అతన్ని ఎదిరించి నిలబడటం అసంభవం.... అతన్ని అడ్డుకోవటం కూడా అసంభవమే....

అయితే గంగారాం ఏమై పోయాడో నన్న ఆందోళన షాడో పట్టుదలను సడలనీయ లేదు. తను అక్కడినుంచి వెంటనే బయట పడాలి! అందుకు ఎవరు అడ్డు పడినా ఆగకూడదు!!

ఉన్న చోటి నుంచి ఒక్క అంగుళం కూడ జరగకుండా కాంక్రీట్ దిమ్మ మాదిరి అతని పాదాల్ని తొక్కి పట్టివుంచాడు ఫ్యుజీశాన్.

"అనుభవించు రాజూశాన్.... నీ అవివేకానికి శిక్షను అనుభవించు -" అంటూ కత్తి ని బలంగా అతని పాదాల మీదికి దించాడు.

శరవేగంతో ఆలోచించాడు షాడో. ఏదో ఒక విధంగా అతన్ని ట్రిప్ చెయ్యాలి.... ఎలా ? ఎలా ? ?

నిస్సహాయంగా కదులుతున్న అతని చేతులకు మెత్త గా తగిలింది మైదానంలో వున్న మట్టి. రెండో ఆలోచన లేకుండా గుప్పిళ్ళ నిండా పట్టి విరచిమ్మాడు అతని ముఖం మీదికి.

ఆ ప్రదేశం దద్దరిల్లి పోయేటట్లు అరిచి వెనక్కి జంప్ చేశాడు ఫ్యుజీశాన్. కత్తి ని వదిలి కనులు నలుము కోవటం ప్రారంభించాడు.

నేలకు కొట్టిన రబ్బరు బంతిలా ఛెంగున లేచి నిలబడ్డాడు షాడో. అంతటితో ఆ విషయాన్ని మరిచిపోయినా బాగుండేది. అక్కడి నుంచి పారిపోయినా ఎటువంటి గొడవా వుండేది కాదు.

దెబ్బ తిని నిస్సహాయంగా పడిపోయాననే కచ్చ మనస్సును మండిస్తుండగా, రెండు అడుగులు ప్రక్కకు వేసి డెలివర్ చేశాడు అత్యంత బలమైన సైడ్ కిక్ని.

కనులు నులుముకుంటూ నిలబడి పోయిన ఫ్యుజీశాన్ ఆ దెబ్బను కాచుకోలేక పోయాడు. సుడిగాలిలో చిక్కుకున్న మర్రిచెట్టులా వూగి, సూటిగా పోయి అగ్ని గుండంలో పడ్డాడు.

గొల్లున అరిచారు విద్యార్థులు అందరూ. ఒకేసారి ముందుకు వచ్చి అగ్ని గుండం చుట్టూ గుమికూడారు.

కణకణలాడుతున్నాయి అందులోని నిప్పులు. అడుగు పెట్టిన మరుక్షణం ఆరగించటానికి సిద్ధంగా వున్న మృత్యుగుండం మాదిరి కనిపిస్తోంది.

అందులో అడుగుపెట్టే ధైర్యం లేక ఆ విషయాన్ని కూడా గురువుగారికి చేరవేయటానికి గాలి కంటె వేగంగా పరుగు తీశారు కొందరు విద్యార్థులు.

వారిని చూడగానే శరవేగంతో దిగి పోయింది షాడోని ఆవరించుకొని వున్న ఆగ్రహం. అగ్ని గుండం ముందు గుమిగూడిన వారిని అవతలికి నెట్టి, ఒక్క గంతులో అందులోకి ప్రవేశించాడు.

“ఆగు రాజూశాన్.... ఆ విద్య నీకు రాదు.... అన్యాయంగా మంటలకు ఆహుతి అయి పోతావ్ - ఆగు....” అంటూ అతన్ని ఆపటానికి ప్రయత్నించారు వాళ్ళు.

వారి మాటలు పూర్తి కాక ముందే అడుగులు ఎత్తి ఎత్తి వేస్తూ గుండం మధ్యకు వెళ్ళిపోయాడు షాడో.

బాధతో మెలికలు తిరిగి పోతున్నాడు ఫ్యుజీశాన్ - దుస్తులు అంటుకొని మంటలు లేవబోతున్నాయి. చటుక్కున ముందుకు వంగి అతి ప్రయత్నం మీద ఆ మహాకాయుడిని పైకి ఎత్తాడు షాడో. బలమంతా వుపయోగించి అతన్ని వడ్డు మీదికి విసిరేశాడు. అదే వూపులో ప్రక్కకు తిరిగి అవతలి వైపుకు పరుగు తీశాడు.

నేల మీద పడిన ఫ్యుజీశాన్‌ని కమ్ముకొని, అతని దుస్తుల్ని ఆరగిస్తున్న మంటల్ని క్షణంలో చల్లార్చేశారు విద్యార్థులు.

"దుర్మార్గుడా.... నీ అంతు చూడక పోతే నాకు మారు పేరు పెట్టు. నిన్ను కత్తికో కండగా నరికి కాకులకు గద్దలకు వేయకపోతే నేను కుంగ్‌ఫూ విద్యార్థినే కాదు." అని అరుస్తూ, మితిమీరిన ఆగ్రహంతో ఆపాదమస్తకం వణికిపోతూ శరీర బాధల్ని మరిచిపోయి, క్రింద వున్న తన ఖడ్గాన్ని అందుకున్నాడు ఫ్యుజీశాన్.

"తొందర పడకు ఫ్యుజీశాన్.... ముందు నీ ఆరోగ్యం సంగతి చూసుకో.... పగ సంగతి తర్వాత ఆలోచించుకోవచ్చు...." అంటూ అతని భుజం పట్టుకొని ఆపాడు అప్పుడే అక్కడికి వచ్చిన చింగ్‌లీ.

శరీర బాధల్ని గురించి పట్టించు కోవటం లేదు ఫ్యుజీశాన్.

"గురుదేవా.... ఆ దుర్మార్గుడి ఆగడాన్ని చూశారా ? వాడి రాక్షసత్వాన్ని గమనించారా ?" ఆవేశంగా అన్నాడు.

అతని తల నిమురుతూ చిరునవ్వు నవ్వాడు చింగ్‌లీ.

“.... నీ ముందు అగ్ని గుండంలో అడుగు పెట్టటానికి భయపడిన రాజూశాన్, నిన్ను కాపాడటం కోసం తోటి విద్యార్థులు వారిస్తున్నా వినకుండా గుండంలోకి దుమికాడు. మరి దీనికి సమాధానం ఏమి చెప్తావ్ ?” అన్నాడు అనునయస్వరంతో.

ఆ మాటలతో మరింత అధికం అయింది ఫ్యుజీశాన్ క్రోధం.

“అయితే అతని ఆగడాన్ని సహిస్తారా ? అతని దుర్నడతను క్షమిస్తారా ?” ఎర్రబడిన ముఖంతో వేడిగా అడిగాడు.

గాఢంగా నిట్టూర్చి తల అడ్డం తిప్పాడు లింగ్ చీ.

“రాజు చేసిన తప్పుకు తగిన దండన అనుభవించి తీరాలి. వెంటనే అతన్ని నా ముందుకు తీసుకురండి!” అని ఆజ్ఞ యిచ్చాడు గంభీర స్వరంతో.

శిలా విగ్రహాల్లా నిలబడిన విద్యార్థుల్లో చలనం వచ్చింది. గుంపులు గుంపులుగా బయలుదేరి మైదానమంతా కలియ తిరిగారు.

ఎక్కడ వెతికినా, ఎన్ని ప్రదేశాలు గాలించినా షాడో మాత్రం కనిపించలేదు వారికి. అగ్ని గుండంలో నుంచి యివతలికి వచ్చిన మరుక్షణం, బొబ్బలు ఎక్కిన పాదాలు విపరీతమైన బాధ పెడుతున్నా లెక్క చేయకుండా వేగంగా వెళ్ళిపోయాడతను అబాషిరీ పట్టణం వైపు.

“చేసిన తప్పుకు శిక్షను అనుభవించకుండా పారి పోయి మన విద్యాపీఠపు నియమాలనే అవమాన పరిచాడు. ఇక అతన్ని క్షమించటం అనేది జరుగదు. దేశంలో వున్న కుంగ్ఫూ వస్తాదులందరికీ కబురు పంపించండి. రాజూశాన్ ఎక్కడ

కనిపించినా బంధించి యిక్కడికి తీసుకు రావలసిందిగా ఆదేశాలు యివ్వండి" ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేశాడు చింగ్ లీ.

అరగంట తరువాత అందమైన తాళపత్రాల మీద గంటాలతో చెక్కబడ్డాయి ఆదేశాలు. తెల్లవారగానే దేశం నలుమూలలకు పంపే ఏర్పాట్లు చేయబడ్డాయి.

అయితే - అడవిలో చెలరేగిన దావానలాన్ని ఆపటం ఎంత కష్టమో, గంగారాం కోసం వేగంగా ప్రయాణిస్తున్న షాడోని ఆపటం కూడా అంతేనని ఆ ఆదేశాలను తయారు చేసిన వారెవరికీ ఆ సమయంలో తెలియదు.

## 4

చల్లటి గాలి తెర ముఖానికి తగిలేసరికి స్పృహ తెలిసి కనులు విప్పాడు గంగారాం.

"ఈ మధ్య మనకి వళ్ళు తెలియకుండా నిద్రపోవటం ఎక్కువైంది. ఆ పాడు అలవాటు ఎప్పుడో కొంపలు ముంచేస్తుంది. అసలు యింతకీ మనం ఎక్కడున్నాం?" అనుకుంటూ లేచి కూర్చోబోయాడు.

బలమైన త్రాటితో బంధింపబడి వున్నాయి కాళ్ళు. వెనక్కి విరిచి కట్టేయబడి వున్నాయి చేతులు. ఉన్న చోటి నుంచి ఒక్క అంగుళం కూడా కదలటం అతనికి చేత కాలేదు.

అప్పుడుగాని గుర్తుకు రాలేదతనికి జరిగిన సంఘటనలన్నీ. గుర్తుకు వచ్చేసరికి వేపాకు నమిలినట్లు చేదుగా మారిపోయింది నోరు.

ఎత్తుగా వున్న చెట్ల క్రింద కాంప్ వేశారు అతన్ని బంధించిన దొంగా వస్తాదులు. ఎండు కొమ్మల్ని ఏరుకువచ్చి పెద్ద చితుకుల మంటవేశారు. దాని చుట్టూ పడుకొని నిద్రలు పోతున్నారు.

గంగారాం మెడకు కూడా ఒక తాడు కట్టి వుంది. దాన్ని పిడికిటిలో బిగించి పట్టుకొని అందరితో పాటు తను కూడా హాయిగా గురకలు తీస్తున్నాడు ఒక వస్తాదు.

"పారి పోవటానికి యింత కంటె మంచి ఛాన్సు మరొకటి దొరకదు బ్రదర్.... ఒక ప్రయత్నం చేసి చూడటంలో తప్పేమీ లేదు." తనకు తనే ధైర్యం చెప్పుకుంటూ మెల్లిగా అవతలికి దొర్లాడు గంగారాం.

నిద్రపోతున్న వస్తాదు పిడికిటి లోనుంచి చల్లగా జారి యివతలకు వచ్చేసింది అతని గొంతుకు కట్టిన తాడు.

"వెల్‌డన్ మైడియర్ గంగారాం.... నడిచి నడిచి అలిసిపోయినట్లున్నారు దొంగనాయాళ్ళు. నువ్వు కొంచెం చప్పుడు చేసినా మరేం పరవాలేదు." అనుకుంటూ అతి కష్టం మీద సిట్టింగ్ పొజిషన్‌కి చేరుకున్నాడతను.

చప్పుడు చేయకుండా లేచి నిలబడాలనీ, కాళ్ళకున్న బంధాలతోనే చేపపిల్ల నేలమీద పడి గంతులు వేసినట్లు గెంతుతూ అవతలికి పారిపోవాలనీ అతని వుద్దేశ్యం.

లేచి కూర్చోవటం వరకూ అంతా సవ్యంగానే జరిగింది. లేచి కూర్చున్న మరుక్షణం అతనికి కనిపించింది అప్పుడే పాదాల మీదికి ఎక్కుతున్న జోరో జాతికి చెందిన కాళ్ళ జెర్రి.

"వచ్చి పోయానురోయ్ దేవుడో." అని అరవబోయి ఆఖరి క్షణంలో తమాయించుకున్నాడతను.

ఆరంగుళాల పొడవున, ఎరుపు నలుపు రంగులతో మిలమిల మెరిసిపోతూ వుంటుంది ఆ కాళ్ళ జెర్రి. సామాన్యంగా మానవుల జోలికి రాదు. వచ్చిందంటే నూకలు చెల్లిపోయినట్లే.

ముఖం మీద వున్న పొడవాటి మీసాలను అటూ యిటూ కదిలిస్తూ గంగారాం పాదాల మీదినుంచి పాంటు మీదికి ప్రాకే ప్రయత్నం చేస్తున్నదది.

చలి జ్వరం వచ్చినట్లు వేడెక్కి పోయింది అతని శరీరం. ఊపిరి బిగపట్టి వంట్లో వున్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకున్నాడు. ఉన్నట్లుండి వెనక్కు వంగి పాదాలను బలంగా విసిరాడు చితుకుల మంటవైపు.

ఎదురు చూడని ఆ కదలికకు బాలెన్స్ తప్పి గాలిలోకి లేచింది కాళ్ళజెర్రి. గింగిరాలు తిరుగుతూ పోయి మంట ప్రక్కనే పడుకొని వున్న ఒక వస్తాదు మెడ మీద పడింది.

నిద్రాభంగమైంది అతనికి. కనులు తెరవకుండానే అరిచేత్తో దాన్ని ఠపీమని చరిచి ప్రక్కకు వత్తి గిల్లాడు.

అతను కదిలిన మరుక్షణం తన ప్రతాపాన్ని ప్రదర్శించింది కాళ్ళజెర్రి. గొంతు చినిగి పోయేటట్లు అరుస్తూ లేచి నిలబడ్డాడు టోంగా వస్తాదు. అది కుట్టిన ప్రదేశాన్ని చేతులతో అదుముకుంటూ, రెండుసార్లు చితుకుల మంటకు ప్రదక్షిణాలు చేశాడు. మూడోసారి మొదలు పెట్టబోతూ, ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు క్రింద పడిపోయాడు.

చూస్తుండగానే నీలం రంగుకు తిరిగింది అతని శరీరం. నోటివెంట తెల్లటి నురుగులు రాసాగాయి.

అతని అరుపులకు నిద్రాభంగమైన వస్తాదులందరూ ఖంగారుగా గుమికూడారు మంట చుట్టూ.

అంతకంటె మంచి సమయం మరోసారి లభించదని గ్రహించి చివ్వున లేచి నిలబడ్డాడు గంగారాం. పది గంతులతో చెట్లను దాటి మరో పది గంతులతో ఒక పెద్ద ముళ్ళ పొదను చేరుకున్నాడు.

పిడిబాకుల వంటి ముళ్ళతో, పెద్ద పెద్ద ఆకులతో దట్టంగా కనిపిస్తోంది అది. ఏదో ఒక విధంగా బాధను ఓర్చుకొని అందులో దూరితే.... ఎవరూ కనిపెట్టలేరు.

గంగారాం ఆలోచనలు పూర్తికాక ముందే ఆ పొద ప్రక్కన ప్రత్యక్షం అయ్యాడు టోంగా వస్తాదుల నాయకుడు.

"నువ్వు ఇటువంటి పనులు చేస్తావని నాకు తెలుసు బే.... అందుకే నిన్ను ఒక కంట కనిపెడుతూనే వున్నాను." అన్నాడతను క్రూరంగా నవ్వుతూ.

ఉలికిపాటును కప్పిపెట్టుకొని తనుకూడా ఒక నవ్వు నవ్వేశాడు గంగారాం.

"మీరు పొరపాటు పడుతున్నారు వస్తాదు గారూ.... పారిపోయే వుద్దేశ్యం నాకు ఎంత మాత్రమూ లేదు. చెట్ల క్రింద మీ వాడొకడు చావు బ్రతుకులమధ్య తన్నుకుంటున్నాడు. ఆ విషయం మీతో చెపుదామని వచ్చాను." అంటూ తల వంచుకొని, మళ్ళీ ఎగురుకుంటూ చితుకుల మంట దగ్గిరికి తిరిగి వచ్చాడు.

జరిగిందేమిటో ఎవరికీ తెలియకుండానే కాళ్ళజెర్రి కుట్టిన టోంగా వస్తాదు ప్రాణాల్ని వదిలేశాడు. నల్లరాయిలో చెక్కిన రాతిబొమ్మల్లా అతని శరీరం చుట్టూ నిలబడివున్నారు మిగిలిన వస్తాదులందరూ. ఆ ప్రదేశాన్ని వదిలి వెంటనే వెళ్ళిపోవాలన్న కోరిక వారందరి కళ్ళల్లోను కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

"ఆల్‌రైట్ మై ఫ్రండ్స్.... అలాగే వెళ్ళిపోదాం. వెళ్ళి పోయేముందు మన పని పూర్తిచేసుకొని మరీ పోదాం." అంటూ గంగారాం మెడకు కట్టిన త్రాటిని బలంగా గుంజాడు వారి నాయకుడు.

ఎంత ప్రయత్నించినా నిలదొక్కుకోలేక చితుకుల మంట ముందు పడిపోయాడు గంగారాం.

"ఇప్పటికయినా నిజం చెప్పు బే.... మా సహనాన్ని పరీక్షించకు...." కరకరలాడుతున్న కంఠంతో అన్నాడు నాయకుడు.

"అడిగిన ప్రశ్ననే మళ్ళీ మళ్ళీ అడగటం బాగోలేదు బ్రదరూ.... ఇంకేదైనా అడుగు చెబుతాను." అంటూ ఎందుకైనా మంచిదని నాలుకతో నోటిని తడుముకున్నాడు గంగారాం.

సురక్షితంగానే వుంది మెటల్ ట్యూబ్! గొంతులోకి జారిపోలేదు.

"ముఖం పగలగొట్టి వుప్పుకారం అద్దితేగాని నీకు బుద్ధిరాదు. వేళాకోళాలు ఆడుతున్నావా.... వేళాకోళాలు...." అంటూ చటుక్కున వంగి లావాటి నిప్పుమొద్దును అందుకున్నాడు టోంగా నాయకుడు.

దెబ్బ పడకముందే కేకలు పెట్టడం మొదలుపెట్టాడు గంగారాం.

"ఈ టోంగా నాయాళ్ళు నన్ను చంపేస్తున్నారు... రక్షించు గురో..." అనికూడా అరిచాడు.

నిప్పుముద్దుతో అతని ముఖం మీద కొట్టాలని అనుకుంటున్న టోంగా నాయకుడు, తక్కున ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

"ఆల్‌రైట్ బ్రదర్... ఎవరా గురువు ? ఎక్కడ వుంటాడు ? ? అతనికి నీకు ఏమిటి సంబంధం ? ? ?" ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

నాలుక కొరుక్కుని నెత్తిమీద చరుచుకున్నాడు గంగారాం. ఖంగారు పడుతున్నట్లు అటూ యిటూ రెండుసార్లు చూశాడు.

"మా గురువు సంగతి చెప్పాలంటే మాటలు చాలవు.... ఇలా నిలబడి నారేట్ చేయటం అస్సలు పనికిరాదు.... అంతగా వినాలని వుంటే ఈ బంధాలను వూడతీయండి. కథ పూర్తి అయిన తర్వాత తిరిగి కట్టేద్దురు గాని..." అన్నాడు లోగొంతుకతో.

"పారి పోవటానికి ప్లాను వేస్తున్నావా ?" ఉరిమి చూస్తూ అడిగాడు టోంగా నాయకుడు.

"మిమ్మల్ని తప్పించుకొని పారి పోవటం నాలాంటి అర్భకుడికి సాధ్యపడుతుందా ? ? అనవసరమైన అనుమానాలతో హైరాన పడి పోతున్నారు మీరు...." నమ్మకంగా అన్నాడు గంగారాం.

"వాడిమాట కాదని ఎందుకనాలి ? వదిలేయ్ బాస్.... పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే మక్కెలు విరగ్గొట్టేద్దాం...." మీసాలను మెలివేస్తూ, భరోసా యిచ్చాడు ఒక వస్తాదు.

"వీడి వాలకం చూస్తుంటే నాకు అనుమానంగా వుంది. వీడి మాటలు వట్టి బూటకాలు అనిపిస్తోంది...." అంటూనే గంగారాం బంధనాలు వూడతీశాడు టోంగా నాయకుడు.

మెడలో వున్న తాడును తనే వూడ తీసి చేతిలో పట్టుకున్నాడు గంగారాం.

"మీరు యింత మంచివాళ్ళని తెలిస్తే ఇప్పుడు చెప్పబోయే కథను ఆ టీ బంక్ దగ్గరే చెప్పేసి వుండేవాడిని. ఇంత దూరం నన్ను మోసుకు రావాల్సిన అవసరం మీకు వుండేదే కాదు...." అంటూ వున్నట్టుండి ప్రక్కకు దూకి పరుగు అందుకున్నాడు.

అదిరి పోయి గొల్లున అరిచారు టోంగా వస్తాదులు అందరూ.

"పట్టుకో.... దుర్మార్గుడిని పట్టుకో...." అని అరుస్తూ రెండు అంగల్లో గంగారాం దారికి అడ్డువచ్చాడు ఒకతను.

"రెండోసారి మీకు దొరికేందుకు నేనేమీ చెవుల్లో పువ్వులు పెట్టుకొని లేను...." అంటూ చేతిలోని తాడుతో అతని ముఖంమీద చరిచాడు గంగారాం.

బాధగా అరిచి ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు ఆ వస్తాదు. ఆ కాస్త వ్యవధిలోను అతన్ని దాటి చెట్ల చాటుకు వెళ్ళిపోయాడు గంగారాం.

“పట్టుకోండి. అతన్ని పట్టుకోకపోతే మన పీకలు ఎగిరిపోతాయి. పట్టుకోండి” అని అందర్నీ హెచ్చరిస్తూ పరుగు ప్రారంభించాడు టోంగా నాయకుడు.

పాంటు జేబుల్లో వున్న పేష్కస్‌లను బయటికి లాగుతూ అతన్ని అనుసరించారు టోంగా వస్తాదులు.

## 5

నాలుగు అడుగుల ఎత్తు పెరిగి, నీలం రంగు పూవులు పూస్తున్న ఒక పొద ముందు ఆగాడు షాడో. నిగనిగలాడుతున్న ఆ పువ్వుల్ని నలిపి బొబ్బలెక్కి వున్న పాదాలకు అంటించుకున్నాడు.

అడుగు తీసి అడుగు వేసినప్పుడల్లా కత్తులు పెట్టి పొడిచినంత నొప్పిని కలిగిస్తున్న పాదాలు.... ఒక్కసారిగా చల్లబడి పోయాయి. క్షణాల మీద ఉపశమించ సాగింది బాధ.

ఒక్క అరగంట సేపు అక్కడే కూర్చుని విశ్రాంతి తీసుకోవటం బాగుంటుందనే ఆలోచన మెల్లిగా అడుగు పెట్టింది అతని హృదయంలో. పువ్వులు కోసిన పొద దగ్గిరే కూర్చోబోతుండగా వినవచ్చింది ఆ సవ్వడి.

విశ్రాంతి తీసుకోవాలనే కోరిక మటుమాయం అయిపోగా, ఛెంగున ముందుకు దూకి దగ్గిర్లో వున్న చెట్టు మీదికి ఎక్కాడు. కొమ్మలను చాటు చేసుకొని కనులు చిట్లించుకొని చూశాడు.

రెండు నిముషాల తరువాత అతని దృష్టి పథంలోకి వచ్చాడు ఒక వ్యక్తి. పొట్టిగా లావుగా వున్నాడు. ఎంతో దూరం నుంచి పరిగెత్తుకు వస్తున్నట్లు ఆయాసంతో ఉక్కిరి బిక్కిరి అయి పోతున్నాడు.

అడవి జంతువులేవయినా అటుకేసి వస్తున్నాయేమోనన్న అనుమానంతో చెట్టు ఎక్కిన షాడో - ఆనందంతో అరిచి కేకలు పెట్టాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకున్నాడు.

"బ్లడీ యిడియట్.... కొరియన్ డాన్స్ చూడటానికి వచ్చి, యిలా అడవిలో చక్కర్లు కొడుతున్నావా... పిచ్చి ఏమైనా ఎక్కిందా ?" ఆ మనిషి చెట్టు క్రిందికి రాగానే నవ్వుతూ అన్నాడు.

రెండు అడుగుల ఎత్తుకు ఎగిరి, ఫెడీమని వీపు మీద చరుచుకున్నాడు గంగారాం.

"పలకరించేవాడివి, కాస్త ఎదుట పడి పలకరిస్తే నీ సొమ్ము ఏం పోయింది ? ఇంకా నయం... నోట్లో వున్న మెటల్ ట్యూబ్‌ని మింగేశాను కాదు." అంటూ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా చెట్టు మీదికి ప్రాకాడు.

లాగిపెట్టి అతని భుజం మీద గుద్దాలని చేతిని ఎత్తి వుంచాడు షాడో. ఎత్తిన చేతిని ఎత్తినట్లే క్రిందికి దించి ప్రశ్నార్థకంగా చూశాడు.

“ముందు నన్ను తరుముకు వస్తున్న దొంగనాయాళ్ళ సంగతి చూడు గురూ.... మెటల్ ట్యూబ్ సంగతి తరువాత చెప్తాను.” నోటిలో దాచివుంచిన మెటల్ ట్యూబ్‌ని తీసి అతనికి చూపిస్తూ అన్నాడు గంగారాం.

ఆ మాట అంటుండగానే అక్కడ ప్రత్యక్షం అయినారు టోంగా వస్తాదులు. చెట్టుకు పది అడుగుల దూరంలో ఆగి, చెవి నేలకు ఆనించి శబ్దాలు విన్నాడు వారి నాయకుడు. సడన్‌గా ముడి పడ్డాయి అతని కనుబొమ్మలు.

“ఏమయింది బాస్ ? ఏం జరిగింది ? ?” అతని ముఖంలోకే చూస్తున్న వస్తాదు ఒకతను వెంటనే అడిగాడు.

“ఇందాకటి దాకా వినిపించిన అడుగుల శబ్దం ఇప్పుడు వినిపించటం లేదు. ఆ దుర్మార్గుడు ఇక్కడే ఎక్కడో దాక్కుని వుంటాడు. పొదలన్నిటిని గాలించండి. చెట్టు కొమ్మల్ని జాగ్రత్తగా పరిశీలించండి.” ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్స్ యిచ్చాడతను.

రెండు అంగుళాల లావు, ఆరు మూరల పొడుగు వున్న చెట్టుకొమ్మను చటుక్కున విరిచి చేత పట్టుకున్నాడు షాడో.

“నువ్వు యిక్కడి నుంచి కదలకు గంగూ.... క్రిందికి రాకు.” అని హెచ్చరిస్తూ ఎగిరి దూకాడు నాయకుడి భుజాల మీదికి.

చెట్టు కొమ్మ విరిచిన శబ్దాన్ని విని తల ఎత్తి చూస్తున్నాడతను. నిశబ్దంగా దూకుతున్న ఆకారాన్ని గమనించగానే వెర్రిగా అరిచి ప్రక్కకు తప్పుకున్నాడు.

పాదాలు నేలను తాకిన మరుక్షణం, ఆ ప్రదేశం దద్దరిల్లి పోయేటట్లు షౌట్ చేశాడు షాడో. చెట్టుకొమ్మను రెండు చేతులతో పట్టుకొని నాయకుడి మీదికి లంఘించాడు.

"పట్టుకోండి.... పట్టుకోండి...." అని అరుస్తూ పరుగెత్తుకు వచ్చారు పొదల దగ్గిరికి పోయిన వస్తాదులు అందరూ.

చెట్టుకొమ్మను తల మీది నుంచి తిప్పి నాయకుడి భుజాల మీద బాదాడు షాడో. అదే వూపులో ప్రక్కకు తిరిగి ఒక వస్తాదు గుండెల మీద పొడిచాడు.

బాధతో బిగ్గిరిగా అరిచి నేల మీద చతికిల పడ్డారు వారిద్దరూ. అక్కడితో ఇండివిడ్యువల్ ఎటాక్ మానుకున్నాడు షాడో. చెట్టు కొమ్మను చేతి క్రింది నుంచి తిప్పి బొంగరం తిరిగినట్లు గిర్రున తిరగటం ప్రారంభించాడు.

వెదురు పొదల మధ్య నుంచి ఈదురుగాలి వీచినప్పుడు విన వస్తుంది ఒక భయంకరమైన శబ్దం.... గుండెల్ని మెలిపెట్టి ఎంతటి బలశాలినైనా నీరస పరిచేస్తుంది అది -

అటు వంటి శబ్దాన్ని వెలువరచ సాగింది అతని చేతిలోని చెట్టు కొమ్మ.... అడ్డు వచ్చిన టోంగా వస్తాదుల, ముఖాలు టపాకాయలు పగిలినట్లు పగలసాగాయి.

మొదటి దెబ్బకే క్రింద పడిన టోంగా నాయకుడు తేరుకున్నాడు. బొడ్డులో వున్న పిడిబాకును బయటికి లాగి మోకాళ్ళ మీద పాకుతూ షాడో పాదాల వైపు జరిగాడు.

గిర్రున తిరుగుతున్న చెట్టు కొమ్మకు అందకుండా క్రింది నుంచి పోయి, పాదాల మీద దెబ్బ తీయాలని అతని ఆలోచన. చెట్టు కొమ్మల్లో నుంచి చిట్లించుకు చూస్తున్న గంగారాం కనిపెట్టేశాడు అతని కదలికను.

"దొంగనాయాలు దేక్కుంటూ వస్తున్నాడు. జాగ్రత్త గురో...." అని అరిచి హెచ్చరించాడు వెంటనే.

చెట్టు కొమ్మ చేస్తున్న దారుణమైన శబ్దంలో, షాడోకి వినిపించలేదు ఆ హెచ్చరిక. అయితే కనుచివరల నుంచి నాయకుడి కదలికను గమనించాడు. ఉన్నట్లుండి కుడి మోకాలిని క్రిందికి వంచి చెట్టు కొమ్మ చుడుతున్న వృత్తాలను ఏటవాలుగా పైకి ఎత్తాడు.

పేష్కన్‌లు పట్టుకొని అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఇద్దరు వస్తాదుల ముఖాలు ముక్కలై పోయాయి. ఆ మార్పు మూలకంగా, చెట్ల మీద నిద్రలు పోతున్న పక్షులన్నీ ఎగిరి పోయేటంత వికృతంగా అరిచి వెల్లికిలా పడిపోయారు వారిద్దరూ.

ఆ అరుపుల్ని వినే సరికి గుండె చెదిరి వేగంగా వెనక్కి జరగబోయాడు నాయకుడు. సూటిగా పోయి అతని ఎడమ చెవికి తగిలింది చెట్టుకొమ్మ. గింగిరాలు తిరుగుతూ లేచి పది అడుగుల దూరం పారి పోయాడతను. చెవిని రెండు చేతులతోను అదుముకుంటూ బాధగా మూలిగాడు.

"మా గురువు గారు ఎవరో తెలుసు కోవాలని అన్నావుగా.... ఇప్పుడు తెలిసిందా ?" చెట్టు కొమ్మ మీది నుంచి తల క్రిందికి పెట్టి అతన్ని పరామర్శించాడు గంగారాం.

బాధతోను, విపరీతమైన కోపంతోను మతి పోయింది టోంగా నాయకుడికి.

"అరేయ్ దుర్మార్గుడా.... చూడు నిన్నేం చేస్తానో...." అని రంకె వేసి వేగంగా చెట్టు ఎక్కటం మొదలు పెట్టాడు.

"దొంగ నాయాలు చెట్టు ఎక్కుతున్నాడు గురో.... నన్ను ఏదో చేసేస్తానని అంటున్నాడు.... నాకు భయం వేసి జ్వరం వచ్చేస్తోంది...." అని అరిచి గబగబా చిటారు కొమ్మలకు వెళ్ళిపోయాడు గంగారాం.

మరోసారి చెట్టు కొమ్మ చుట్టే వృత్తాన్ని స్లయిట్‌గా ఛేంజి చేశాడు షాడో.

మోకాళ్ళ మీదికి వంగి ముందుకు దూకే అవకాశం కోసం చూస్తున్న మరో ముగ్గురు వస్తాదుల భుజాలు ఫట్ మని శబ్దం చేస్తూ విరిగిపోయాయి. చెట్టు ఎక్కుతున్న టోంగా నాయకుడి నడుము మీద కాంక్రీట్ దిమ్మ పడినట్లు పడింది బలమైన దెబ్బ.

కత్తి పెట్టి నడుము తెగవేసినంత బాధ అతన్ని ఆవరించింది. పట్టు తప్పి ఇసుక మూట పడినట్లు పడిపోయాడు నేల మీద. నోటి వెంట మాట కూడా రాకుండా పోయింది.

అది చూసే సరికి దిగజారి పోయింది మిగిలిన వస్తాదుల ధైర్యం. చిమ్మ చీకటిలో సైతం గురిగా కర్ర తిప్పగల వారిని అంత వరకూ వాళ్ళు చూడలేదు.... అక్కడే వుంటే పరిస్థితి మరింత విషమిస్తుందనే భయంతో వెను తిరిగి పిక్కబలం చూపించారు.

వంద అడుగుల దూరం వారిని తరుముతూ పోయాడు షాడో. చెట్టు కొమ్మను క్రిందికి దించి మెల్లిగా వెనక్కి తిరిగి వచ్చాడు.

"పారిపోయాడు గురూ.... నన్ను కొట్టాలని వచ్చిన దొంగనాయాలు కూడా పారిపోయాడు...." అంటూ చెట్టు మీది నుంచి క్రిందికి దూకాడు గంగారాం. వెంటనే అతనికి కనిపించింది టోంగా నాయకుడు పోతూ, పోతూ వదిలేసిన పిడిబాకు.

ఎడమ చేతి చూపుడు వేలితో దాని అంచును మీటి పదును చూడబోయాడు గంగారాం. ఛట్‌మని కొట్టాడు షాడో అతని చేతి మీద.

"బ్లడీ రాస్కెల్.... టోంగా వస్తాదుల బాకులు చాలా ప్రమాదం కలిగిస్తాయి. వాటి అంచులకు విషం పూస్తారు.... వంటికి తగిలిన మరుక్షణం ఒక విధమైన మత్తును కలిగిస్తాయి." అని ఎక్స్‌ప్లెయిన్ చేశాడు.

"ఆ మాట మెల్లిగా చెప్పచ్చుగదా! చెయ్యి విరిగి పోయేటంత దెబ్బ కొట్టటం దేనికీ ?" అని దీర్ఘం తీస్తూ బాకును భద్రంగా పాంటు బెల్టులో దాచాడు గంగారాం.

"ముందు మనం యిక్కడి నుంచి అవతలికి వెళ్ళిపోవాలి.... పారిపోయిన టోంగాలు మరోసారి ఎటాక్ చేసే అవకాశం లేక పోలేదు." అంటూ పొదల మధ్యగా దారి తీశాడు షాడో.

అతని చేతిలోని చెట్టు కొమ్మను తీసుకొని భుజం మీద వేసుకుంటూ అనుసరించాడు గంగారాం. అంతకు ముందు వరకూ అతన్ని పీడిస్తున్న ఆందోళన

మటుమాయం అయిపోయింది. అతనికి తెలియకుండానే నోటి నుంచి వెలువడ సాగాయి కూనిరాగాలు.

మూడు మూరలా కత్తి ని పట్టీ
ముందుకు వచ్చెను ఫ్యు జీశాన్!
ముక్కు ముగమూ ఏకం అవగా
మట్టి కరిచెనూ ఫ్యు జీశాన్!!
అగ్ని గుండపు అంచుల మీదా
ఆడెను పాడెను రాజూశాన్!
అడుగో ఇడుగో అంటూ వుండగ
మాయం అయ్యెను రాజూశాన్!!
వెదురు కర్ర వంకీ కత్తీ
ఎందుకు ఎందుకు గంగూశాన్!
ఈగలు దోమలు వెంట తరిమితే
పార ద్రోలుటకు గంగూశాన్!!

అడుగులో అడుగు వేస్తూ, ఆహారం కోసం వస్తోంది ఒక అడవి పిల్లి. అడుగుల చప్పుడు విని, ఒక పొద చాటున దాగుకుంది. చప్పుళ్ళతో పాటు వినవస్తున్న కూనిరాగాలను ఆలకించగానే బావురుమని అరిచి, ఒక్కసారిగా పరుగు లంకించుకుంది.

కను చివరల నుంచి ఆ దృశ్యాన్ని చూసి ఫక్కున నవ్వేశాడు షాడో.

పాట ఆపేసి ముఖం ముడుచుకున్నాడు గంగారాం.

"నవ్వు గురూ.... ఇంకా బాగా నవ్వు.... ఎప్పుడో నా పాటతో నీకు అవసరం రాకపోదు. అప్పుడు నేను నీకంటె పెద్దగానే నవ్వుతాను." అంటూ పెదిమలు బిగించి వడివడిగా అడుగులు వేశాడు.

ఫ్యుజీశాన్‌ని మట్టి తినిపించి, అగ్ని గుండం మీదుగా పారిపోయి వచ్చిన సంగతి అతనికి ఎలా తెలిసిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ, అక్కడి నుంచి ఉత్తర దిశకు దారి మార్చాడు షాడో.

ఉదయం పదిగంటల సమయంలో వారి ముందు ప్రత్యక్షం అయింది అషీకావా రైల్వే స్టేషన్.

"నువ్వు యిక్కడే కూర్చో గురూ.... నేను పోయి సకాయ్ సిటీకి టిక్కెట్లు తీసుకు వస్తాను...." అంటూ స్టేషన్ ముఖద్వారం వైపు కదల బోయాడు గంగారాం.

అప్పుడే అక్కడికి వచ్చాడు ఒక వృద్ధుడు. షాడోని చూడగానే, "నీ కోసమే ఎదురు చూస్తున్నాను రాజూశాన్.... నీ గురించిన శ్రీముఖం నాకు యిప్పుడే అందింది...." అంటూ చేయి పట్టుకోబోయాడు.

టిక్కట్ల మాటను మరిచిపోయి ఆ చేతి మీద ఫెడీమని కొట్టాడు గంగారాం. "అనవసరమైన శ్రమ పడద్దు బాబాయ్.... రాజూశాన్‌ని పట్టుకోవటం నీకు సాధ్యపడదు." అని సలహా యిచ్చాడు.

పట్టరాని కోపంతో పళ్ళు కొరుకుతూ ఎగిరి తన్నాడు వృద్ధుడు. ఆరు అడుగుల ఎత్తుకు లేచింది అతని కుడిపాదం. కనెక్ట్ అయి వుంటే దవడ పగిలి దుమ్ములో పడి వుండేవాడు గంగారాం.

వృద్ధుడి పాదం లేస్తుండగానే స్పీడ్‌గా కదిలాడు షాడో. పిడికిళ్ళు బిగించి ఫ్లాట్‌గా అడ్డం పెట్టాడు.

ఎదురు చూడని ఆటంకాన్ని తట్టుకోలేక వెనక్కి తూలాడు వృద్ధుడు. అదొక రకమైన ఆశ్చర్యం అతని కన్నుల్లో ప్రవేశించింది.

"నీ తన్నులు రాజూశాన్ ముందు పనికిరావు బాబాయ్.... ఇంటికి పోయి బబ్బో...." మరో ఉచిత సలహాను అందించాడు గంగారాం.

జేవురించింది వృద్ధుడి ముఖం.

"అహ్హోయ్" అని అరిచి కాలితో నేలను తన్నాడు. చూపుడు వేళ్ళను కత్తుల్లా బిగించి వేగంగా ముందుకు జాచాడు చేతుల్ని.

అద్భుతమైన పోరాట విధానం అది. ఉపయోగించటం తెలిస్తే కత్తులు కూడా ఎందుకూ పనికిరావు ఆ చూపుడు వేళ్ళ ముందు.

మరోసారి మెరుపులా కదిలాడు షాడో. మణికట్లను క్రాస్ చేసి చిటుక్కున అడ్డుకున్నాడు ఆ చేతుల్ని. అదే వేగంతో వాటిని పైకి నెట్టి మోకాలితో అతని తొడలమీద పొడిచాడు.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిందది. తొడమీద పడిన దెబ్బకు మోకాళ్ళు మడతబడి నేల మీద చతికిల పడ్డాడు వృద్ధుడు.

"కుంగ్ ఫూ నేర్పే సమయంలో ఫింగర్ ఫైటింగ్ ప్రసక్తి వచ్చినప్పుడల్లా మీ పేరే చెప్పేవారు గురుదేవులు. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకొనే సాధన చేశాను. ఒక విధంగా మీకు శిష్యుడిని" అంటూ నేల మీద మోకరించి తల నేలకు ఆనించాడు షాడో.

నాలుగు అంగుళాలు విస్తరించింది వృద్ధుడి ఛాతీ. మెరుస్తున్న కనులతో అతని తల నిమిరి, లేవ తీశాడు.

"ఆకలితో వున్న కడుపుకు అజీర్ణ వ్యాధులు రావని అంటారు మన పెద్దలు. గురువుల ఎడ యింత భక్తిశ్రద్ధలు కల నీకు చెడు తలపులు మనస్సులో అడుగు పెట్టటానికే వీలు లేదు. క్షేమంగా వెళ్ళిరా రాజూశాన్. నీకు నా ఆశీస్సులు ఎల్లప్పుడూ వుంటాయి" అన్నాడు ఆర్ద్రంగా.

అదే సమయంలో పెద్దగా కూత బెట్టి ప్లాట్‌ఫాం మీది నుంచి కదిలింది అక్కడి నుంచి ఒసాకా సిటీ మీదుగా సకాయ్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ట్రైన్.

"తొందరగా తెములు గురూ.... ఈ ట్రైన్ తప్పిపోతే మరో రోజు ఇక్కడే పడుకోవాల్సి వస్తుంది" అంటూ బాణంలా పరిగెత్తాడు గంగారాం.

మరోసారి తలవంచి వృద్ధుడికి అభివాదం చేశాడు షాడో. వెనుతిరిగి వేగంగా ప్లాట్‌ఫాం మీదికి పరిగెత్తుకు వచ్చాడు.

ఆఖర్లో వున్న కంపార్టుమెంట్‌ని పట్టుకొని వ్రేలాడుతున్నాడు గంగారాం. చేయి అందించి అతన్ని లోపలికి లాగేశాడు.

చెవులు చిల్లులు పడేటట్లు మరోసారి కూత పెట్టింది ట్రైన్. పట్టాలను దడదడలాడిస్తూ వేగంగా బయలు దేరింది ఒసాకా సిటీ వైపు.

## 6

"... ఇంకో పెగ్ విస్కీ తీసుకు రమ్మంటారా సార్ ?" వినయంగా అడిగాడు వెయిటర్.

లాగి పెట్టి వీపు మీద చరిచినట్లు వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు లిన్‌ఫాంగ్.

ఆశ్చర్యంగా చూశాడు వెయిటర్. అప్పటికి నాలుగు గంటల నుంచీ జరుగుతోంది ఆ భాగవతం. చెమటలతో దుస్తులు తడిసి పోతున్నా లెక్క చేయకుండా, టెలీఫోన్ ప్రక్కనే కూర్చుని వున్నాడతను. పలకరించి నప్పుడల్లా వులిక్కిపడి ఇంతెత్తున ఎగిరి పడుతున్నాడు.

"విస్కీ... ఇంకో పెగ్గు.... తీసుకు రమ్మంటారా ?" ఎందుకైనా మంచిదని ఒక అడుగు వెనక్కి వేస్తూ అడిగాడు వెయిటర్.

విసుగ్గా తల వూపి, కోటు జేబులో నుంచి సిగరెట్ పాకెట్ని బయటికి తీశాడు లిన్ఫాంగ్. అదే సమయంలో గణగణమని మ్రోగింది టెలిఫోన్.

"హల్లో.... లిన్ఫాంగ్ సార్.... అషీవాకా నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ ఇంకో అరగంటలో ప్లాట్‌ఫాం మీదికి చేరుకుంటుంది.... మీకు కావాల్సిన మనిషి పేరు చెపితే మైక్స్‌లో అనౌన్స్ చేయిస్తాను" రిసీవర్ ఎత్తగానే చెప్పేశాడు రైల్వేస్టేషన్ ఎంక్వైరీ క్లర్క్.

ఒక్కసారిగా రైజ్ అయింది లిన్ఫాంగ్ బ్లడ్ ప్రెషర్. చేతులు స్వల్పంగా కంపించటం మొదలు పెట్టాయి.

"ఇటీజ్ ఆల్‌రైట్ మై ఫ్రండ్.... నేనే స్వయంగా వచ్చి రిసీవ్ చేసుకుంటాను. థేంక్యూ వెరీ మచ్." అంటూ రిసీవర్ని క్రెడిల్ చేసేసి వెనుదిరిగాడు.

అప్పటికి ఆరు గంటలయింది సమయం. వేగంగా ప్రయాణం చేస్తే గాని ట్రైన్ వచ్చే సమయానికి స్టేషన్ని చేరుకోవటం కుదరదు.

అప్పుడే విస్కీ గ్లాసును తెచ్చి టేబిల్ మీద పెట్టాడు వెయిటర్.

"నో థాంక్స్ బ్రదర్.... నా పేరు చెప్పుకుని నువ్వు తాగేయ్...." అంటూ వాలెట్‌లో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి అతని మీదికి విసిరాడు లిన్ఫాంగ్. వాలెట్ని జేబులో పెట్టుకోవటం కూడా మరిచిపోయి రెస్టారెంట్ బయటికి పరుగు తీశాడు.

పది అడుగులు కూడా వేయక ముందే రివ్వున ఎగురుతూ వచ్చి అతని ముందు పడింది రబ్బర్ బంతి వంటి నల్లటి వస్తువు ఒకటి.

అదిరి పడి గాలిలోకి జంప్ చేశాడు లిన్‌ఫాంగ్. బాణంలా పోయి, దగ్గర్లో వున్న కాంక్రీట్ పోల్ చాటున పడ్డాడు.

ఆకాశం బ్రద్దలైనట్లు దారుణమైన శబ్దంతో ప్రేలిపోయిందా వస్తువు. కెవ్వున అరిచి కుర్చీలో నుంచి లేచారు కస్టమర్స్ అందరూ. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ గాలిలోకి లేచాయి. ఎర్రటి మంటలు నాలుకలు విరజాస్తూ నాలుగు మూలలకూ ఎగబ్రాక సాగాయి.

నామ రూపాలు లేకుండా నాశనం అయి పోయాయి నాలుగు టేబుల్స్. వాటి ముందు కూర్చొని వున్న కస్టమర్స్ పదిమంది ముక్కలు ముక్కలై ప్రాణాలను పోగొట్టుకున్నారు.

విపరీతమైన భయంతో, గోలగోలగా అరుస్తూ, రోడ్డు మీదికి పరుగులు తీస్తున్న కస్టమర్స్‌నీ, గుండెలు బాదుకుంటున్న రెస్టారెంట్ ఓనర్స్‌నీ చూస్తూ, మెల్లిగా కాక్రీట్ పోల్ చాటు నుంచి లేచాడు లిన్‌ఫాంగ్.

ఆగటానికి గాని, ఆ దృశ్యాల్ని చూసి జాలి పడటానికి గాని వ్యవధి లేదు. వెంటనే స్టేషన్‌కి చేరుకోక పోతే -

ఆపైన ముందుకు సాగలేదు అతని ఆలోచనలు. గుంపులు గుంపులుగా రెస్టారెంట్ ముందు గుమికూడుతున్న పౌరుల్ని తప్పించుకొని రోడ్డు ఆవలి భాగంలోకి పోయాడు.

పార్కింగ్ లాట్‌లో నిలబడి వున్న తన కారు ఎక్కే ధైర్యం అతనికి లేకుండా పోయింది. తనను హతమార్చటానికి కస్టమర్స్‌తో క్రిక్కిరిసి వున్న రెస్టారెంట్ లోకే బాంబు విసరగలిగిన శత్రువులు, తన కారును టాంపర్ చేయకుండా వుంటారా!

పరుగులాంటి నడకతో ప్రక్క వీధిలోకి పోయి, ఒక టాక్సీని ఎక్కాడు. అరగంట తరువాత అతన్ని స్టేషన్ ముందు దించింది అది.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ, లోపలికి పోయిన అతనికి, అప్పుడే ట్రెయిన్ దిగి వస్తున్న పాసింజర్స్ ఎదురు పడ్డారు.

ముఖం మీది నుంచి భుజాల మీదికి జారుతున్న స్వేదబిందువుల్ని అడ్డుకోవటం కూడా మరిచి పోయి, అటూ యిటూ చూడసాగాడతను.

అత్యంత ప్రమాదకరమైన పనిని దిగ్విజయంగా పూర్తి చేసి హెడ్‌క్వార్టర్స్‌కి తిరిగి వస్తున్నాడు తన అసిస్టెంట్ ఓవిన్ టాకా.... తన వునికిని శత్రువులు కనిపెట్టేశారనీ, ఏ క్షణంలోనైనా తన ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చనీ తెలియ చేశాడు.... కొంప తీసి అతను భయపడినంతా జరగలేదు కదా!

గుంపులు గుంపులుగా వస్తున్న పాసింజర్స్ క్రమంగా పలుచపడటం మొదలెట్టారు.... ఎటువంటి ప్రమాద పరిస్థితి నయినా నేర్పుగా ఎదుర్కోగల ఓవిన్ టాకా మాత్రం ఎక్కడా కనిపించటం లేదు.

భారంగా గడిచి పోయాయి మరో పది నిముషాలు. పాసింజర్స్ అందరూ వెళ్ళిపోయారు. ప్లాట్‌ఫాం ఖాళీ అయింది. ఓవిన్ టాకా మాత్రం అయిపు అంతు లేడు.

విపరీతమైన నీరసం వంటిని ఆవరించుకుంటుండగా, ఒక సిమెంట్ బెంచీవైపు అడుగులు వేశాడు లిన్‌సాంగ్.

అదే సమయంలో అతన్ని సమీపించాడు ఒక కుర్రాడు.

"సార్.... మీ పేరు లిన్‌ఫాంగ్ కదూ ?" అని అడిగాడు లోగొంతుకతో.

తన ఆలోచనలలో తను మునిగి వున్నాడతను. యదాలాపంగా తల వూపాడు.

"మీ కోసం టాయిలెట్ రూమ్స్ దగ్గిర వెయిట్ చేస్తున్నాడు ఒక జంటిల్మన్. తన పేరు ఓవిన్ టాకా అని చెప్పమన్నాడు" గొంతును మరింత తగ్గించి గబగబా చెప్పాడు ఆ కుర్రాడు. ఒక్క క్షణం కూడా అక్కడ వుండకుండా వడివడిగా అవతలికి వెళ్ళిపోయాడు.

జారి పోతున్న శక్తి యుక్తులన్నీ ఒక్కసారిగా తిరిగి వచ్చినట్లు ఫీల్ అయ్యాడు లిన్‌ఫాంగ్. అనవసరంగా అనేక రకాల అశుభాలు ఊహించుకున్నందుకు సిగ్గుపడుతూ, వేగంగా టాయిలెట్ రూమ్స్ దగ్గిరికి పోయాడు.

ఓరగా వేసి వున్నాయి ఒక రూమ్ తలుపులు. లోపల ఎవరో నిలబడి వున్నట్లు అవుతోంది అలికిడి.

"ఇట్సాల్ రైట్ .... టాకా.... ఇక మనల్ని ఎవరూ ఏమీ చేయలేరు.... హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళిపోదాం వెంటనే -" అంటూ లోపలికి పోయాడు.

లోపలికి అడుగు పెట్టిన మరుక్షణం ఆగిపోయాయి అతని మాటలు. గిరుక్కున వెనుతిరిగి బయటికి జంప్ చేయటానికి ప్రయత్నించాడు.

అతని కోటు ముందు భాగాన్ని పట్టుకొని బలంగా లోపలికి యీడ్చాడు ఎత్తుగా, లావుగా వున్న ఒక వ్యక్తి. ఎలుక పిల్లను పిల్లి వూపినట్లు రెండుసార్లు అటూ యిటూ వూపి టాయిలెట్ గోడకేసి బాదాడు.

"మా దారికి అడ్డు వచ్చిన వాళ్లు ప్రాణాలతో అవతలికి పోలేరు.... నీ రోజులు చెల్లిపోయాయి లిన్‌ఫాంగ్...." అంటూ ఫెడీమని తన్నాడు ముఖం మీద.

గోడకు కొట్టుకొని ఖంగుమని శబ్దం చేసింది లిన్‌ఫాంగ్ తల. ఆ వ్యక్తి తన్నిన తన్నుకు ముందు పళ్ళు రెండు వూడి క్రింద పడ్డాయి. భరించలేని బాధ నరాలను జివ్వుమనిపిస్తున్నా లెక్క చేయకుండా, పిడికిళ్ళు బిగించి, ఆ వ్యక్తి మీద కలబడ్డాడు లిన్‌ఫాంగ్.

ఎదురు చూడని ఆ ఎగ్రెసివ్ ఎటాక్ ముందు రెండు క్షణాల పాటు తల్లక్రిందులై పోయాడా వ్యక్తి.

పిడికిళ్ళతో అతని ముఖం మీదా, మూతి మీదా యిష్టం వచ్చినట్లు గుద్ది ఎగిరి వెనక్కి దూకాడు లిన్‌ఫాంగ్. ఉన్నట్లుండి కోటు జేబులో చేయిపెట్టి పెద్ద రివాల్వర్‌ని బయటికి లాగాడు.

ఆ కాస్త వ్యవధిలోను తేరుకున్నాడా వ్యక్తి లిన్‌ఫాంగ్ కంటె వేగంగా కదిలాయి అతని చేతులు. తుమ్మెదలా ఝుంకారం చేస్తూ పోయి రివాల్వర్ పట్టుకున్న చేతిలో దిగబడింది పొడుగాటి పిడిబాకు.

అదిరిపడి రివాల్వర్‌ని వదిలేశాడు లిన్‌ఫాంగ్. ఊపిరి పీల్చుకునే వ్యవధి కూడా యివ్వకుండా అతని మీదికి జంప్ చేశాడు ఆ వ్యక్తి. మెడ చుట్టూ చేతులు చుట్టి క్రింద పడవేశాడు.

పడుతూ పడుతూ క్రింద వున్న రివాల్వర్‌ని లాగిపెట్టి తన్నాడు లిన్‌ఫాంగ్. జర్రున జారుతూ పోయి ఒక గోడకు గుద్దుకున్నది అది. చెవులు చిల్లులు పడే శబ్దంతో ప్రేలింది.

"గాడ్! ఎవరినయినా పంపు.... టాయిలెట్ రూమ్స్‌లో రివాల్వర్ మ్రోతలేమిటో తెలుసుకోవటానికి ఎవరో ఒకర్ని వెంటనే పంపు...." అని ఆక్రోశించింది అతని అంతరంగం.

అదే సమయంలో పెద్దగా కూత పెట్టింది పక్క ప్లాట్‌ఫాం మీద నిలబడి వున్న గూడ్స్ ట్రెయిన్ ఒకటి.

దాని మ్రోతలో రివాల్వర్ ప్రేలుడు ఎవరికీ వినపడదని గ్రహించేసరికి నిరాశ నిస్పృహలు లిన్‌ఫాంగ్‌ని ఆవరించుకున్నాయి.

అతని ఆలోచనల్ని గ్రహించినట్లు వికృతంగా నవ్వాడు ఆ వ్యక్తి.

"నీ గోడు వినిపించుకునే నాధుడు ఎవడూ లేడు లిన్‌ఫాంగ్. నువ్వు చావక తప్పదు" అంటూ మెడమీది పట్టు మరింత బలవత్తరం చేశాడు.

## 7

ఎత్తిన పాదాన్ని ఎత్తినట్లే క్రిందికి దించి చుట్టూచూశాడు షాడో.

"టిక్కెట్ కలక్టర్లు ఎవరైనా యిటువస్తే మన బండారం బయట పడిపోతుంది. కొత్త పెళ్ళికొడుకులా అలా దిక్కులు చూస్తూ నిలబడి పోతావేమిటి గురూ!" విసుగ్గా అంటూ షాడో చేయి పట్టుకొని ముందుకు లాగాడు గంగారాం.

"ఒక్క క్షణం ఆగు గంగూ... రివాల్వర్ ప్రేలిన మ్రోత వినవచ్చింది... ఎక్కడి నుంచో..." అంటూ ఆ పరిసర ప్రదేశాల్ని మరింత జాగ్రత్తగా కలియచూశాడు షాడో.

"రాను రాను నీకు మతిపోతోంది.... రైల్వే స్టేషన్‌లో రివాల్వర్ మ్రోతలు వినబడ్డాయంటే నవ్వుతారు వినేవాళ్లు. నువ్వు బయలుదేరు గురూ...." అంటూ మరోసారి అతని చేయి పట్టుకొని లాగాడు గంగారాం.

చేతిని విదిలించుకొని, రెండు అడుగులు ప్రక్కకు వేశాడు షాడో. ఉన్నట్లుండి పరుగు అందుకొని వేగంగా సమీపించాడు ఒక టాయిలెట్ రూమ్‌ని.

ద్వారానికి అడ్డంగా నిలబడి వున్నాడు ఒక వ్యక్తి.

"ఇంకో రూమ్‌కి వెళ్ళండి సార్.... ఇది రిపేర్‌లో వుంది." ఉన్న చోటి నుంచి ఒక్క అంగుళం కూడా అవతలికి జరక్కుండా అన్నాడు షాడోని చూడగానే.

"మరి నువ్వు యిక్కడ ఏం చేస్తున్నావ్ బ్రదరూ.... కాపలా కాస్తున్నావా లోపలికి ఎవరూ వెళ్ళకుండా ?" షాడో వెనుకే పరిగెత్తుకొచ్చిన గంగారాం అడిగేశాడు తడుముకోకుండా.

ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకొని కనులు ఎర్ర చేశాడా వ్యక్తి.

"పిచ్చి పిచ్చి మాటలు కట్టిపెట్టి మర్యాదగా ప్రక్కకు వెళ్ళండి.... అధిక ప్రసంగం చేశారంటే తగిన శాస్తి జరుగుతుంది." అన్నాడు ఒక అడుగు ముందుకు వేసి.

ఆ మాట వెలువడిన మరుక్షణం పెద్దపులిలా అతని మీదికి దుమికాడు గంగారాం.

"నువ్వు లోపలికి పోయి నీ పని చూసుకో.... వీడి సంగతి నాకు వదిలేయ్" అంటూ జుట్టు పట్టుకొని ఆ వ్యక్తి ని ముందుకు లాగేశాడు.

మూసి వున్న తలుపుల్ని లాగిపెట్టి తన్ని లోపలికి పోయాడు షాడో. అక్కడ కనిపించిన దృశ్యం అతని రక్తాన్ని వేడెక్కించింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ముందుకు దూకి లాగిపెట్టి తన్నాడు లావుగా ఎత్తుగా వున్న వ్యక్తి నడుము మీద.

లిన్‌ఫాంగ్‌ని క్రింద పడవేసి గొంతు పిసుకుతున్న ఆ దృఢకాయుడు బాధగా అరిచి వెనక్కి వరిగాడు.

అతని మెడ పట్టుకొని పైకి లేపాడు షాడో. కుడికాలిని తొడలకు అడ్డం పెట్టి బలంగా విసిరేశాడు ద్వారం వైపు.

తల్ల క్రిందులుగా పల్టీ కొడుతూ పోయి, ద్వారం ముందు పడ్డాడు దృఢకాయుడు. తల నేలకు పొడుచుకొని బాధగా మూలిగాడు.

అతని జుట్టును కూడా గట్టిగా పట్టుకొని బర్రున బయటికి ఈడ్చేశాడు గంగారాం.

"వీడిని కూడా నాకు వదిలేసి గో ఎహెడ్ గురూ.... డోన్ట్ వర్రీ" అంటూ కేక వేశాడు వచ్చీ రాని ఇంగ్లీషులో.

నలిగి పోయిన గుడ్డ బొమ్మలా నేల మీద పడివున్న లిన్‌ఫాంగ్ వైపు అడుగులు వేశాడు షాడో.

అదే సమయంలో అతనికి ఎడమచేతి వైపున వున్న గాజు కిటికీ ఒకటి భళ్ళున బ్రద్దలైంది.

కండలు తిరిగిన శరీరంతో, నున్నగా షేవ్ చేసిన తలతో భీకరంగా కనిపిస్తున్న ఒక వస్తాదు కిటికీలో నుంచి లోపలికి దూకాడు. షాడోని చూడగానే స్లయిట్‌గా ముందుకు కదిలింది అతని కుడిపాదం. స్టిఫ్‌గా బిగించిన వ్రేళ్ళతో కత్తుల్లా ముందుకు వచ్చాయి చేతులు.

అతని కాళ్ళల్లోను, కళ్ళల్లోను కదలాడుతోంది అందమైన రిథమ్. మార్షల్ ఆర్ట్స్‌లో అపారమైన అనుభవం వుంటేగాని అది సాధ్యపడదు.

పిడికిళ్ళు బిగించి ముందుకు దూకాడు షాడో. ముందు వెనుక చూసుకోకుండా అతని ముఖం మీద గుద్దాడు.

తల ప్రక్కకు వంచి బిగ్గరిగా నవ్వాడు ఆ వస్తాదు. ముఖానికి తగుల వలసిన షాడో పిడికిలి నిరపాయకరంగా అతని భుజం మీద పడి జారిపోయింది.

భయంతో బెంబేలెత్తి పోతున్నట్లు కీచుగా అరిచి వెంటనే వెనక్కి దూకేశాడు షాడో. పారి పోవటానికి అన్నట్లు ముఖద్వారం వైపు దొంగ చూపులు చూశాడు.

తొడ చరిచి చేతుల్ని పైకి ఎత్తాడు వస్తాదు. గాలిలో తేలుతున్నట్లు కదిలింది అతని శరీరం. కంటికి కనిపించనంత వేగంతో పైకి లేచింది కుడిపాదం.

ఆ మూవ్‌మెంట్ కోసమే అంత శ్రమ పడ్డాడు షాడో. చటుక్కున క్రిందికి వంగి, తడి తగలకుండా గచ్చు మీద పరిచి వుంచిన రబ్బర్ పట్టాను బలంగా ముందుకు గుంజాడు.

ఎడమ కాలి మీద బాలెన్స్ అవుతున్నాడు ఆ వస్తాదు. పాదం క్రింది రబ్బర్ పట్టా కదలటంతో తల్లక్రిందులై గచ్చు మీద పడి పోయాడు. చేతుల్ని క్రిందికి దించి ఆ షాక్‌ని తట్టుకోవటానికి ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ముందుగా గచ్చుని తాకిన అతని కుడి భుజం ఫట్‌మని శబ్దం చేస్తూ విరిగిపోయింది. బాధను భరించలేక తపతపా నేలను తంతూ స్పృహ తప్పి తల వాల్చేశాడతను.

ఇక ఆ ప్రదేశంలో ఒక్క క్షణం కూడా ఆగదలుచుకోలేదు షాడో. నడుములు విరిగిన రబ్బర్ బొమ్మలా అడ్డదిడ్డంగా పడివున్న లిన్‌ఫాంగ్‌ని భుజం మీద వేసుకున్నాడు. బయటికి ఈడ్చుకు పోయిన దృఢకాయుడి తలను నేలకేసి బాదుతున్న గంగారాంని హెచ్చరించాడు. కన్ను మూసి కన్ను తెరిచేలోగా అక్కడికి దగ్గర్లో వున్న ప్రహరీ గోడను క్రాస్ చేసి మెయిన్‌రోడ్డు మీదికి వెళ్ళిపోయాడు.

# 8

"వచ్చేస్తున్నారు.... బందిపోట్లు మన గ్రామం మీదికి వచ్చేస్తున్నారు." గావు కేకలు పెడుతూ గ్రామం లోకి వచ్చారు పదిమంది కుర్రాళ్ళు.

గొల్లుమని అరిచి తలా ఒక దిక్కుకు చెల్లా చెదరై నారు వీధుల్లో తిరుగుతున్న పౌరులు.

పది అడుగులు కూడా వేయలేక పోయారు వాళ్ళు. పద ఘట్టనలతో గ్రామాన్ని దద్దరిల్ల చేస్తూ వేగంగా అక్కడికి వచ్చేశాయి పాతిక అశ్వాలు.

"కదలకండి.... ఎక్కడి వాళ్ళక్కడే నిలబడి పొండి...." ఖంగు మంటున్న కంఠంతో గ్రామస్తుల్ని హెచ్చరిస్తూ చేయి వూపాడు నల్లని ముసుగు ధరించి వున్న బందిపోటు నాయకుడు.

వికటంగా నవ్వుతూ గుర్రాల మీదినుంచి దూకి ఇళ్ళ మీద పడ్డారు బందిపోట్లు. అడ్డం వచ్చిన పౌరుల్ని చర్మపు కొరడాలతో దారుణంగా హింసిస్తూ పెద్ద పెద్ద ధాన్యపు మూటల్ని వీధుల్లోకి దొర్లించారు.... ఎక్కడెక్కడో దాచుకున్న ధనాన్ని ఆభరణాలను వెతికి వెతికి వెలికి తీసుకు వచ్చారు.

"అన్యాయం.... యిది అమానుషం.... సంవత్సరాల తరబడి కష్టించి, కూడ బెట్టుకున్న ధనం అది...." అని అరుస్తూ ఒక బందిపోటు మీదికి ఎగబడ్డాడు అరవై సంవత్సరాల వృద్ధుడు.

ఫెడీ మని అతని ముఖం మీద కొట్టాడు బందిపోటు. కాలి దగ్గర కనిపించిన కిరోసిన్ దీపాన్ని గోడకు తగిలేలా తన్ని, అగ్గిపుల్ల వెలిగించాడు.

భగ్గున లేచాయి మంటలు.... కిరోసిన్‌తో తడిసిన గోడ మీదినుంచి వేగంగా పై కప్పుకు వెళ్ళిపోయాయి.

వీధుల్లో నిలబడి పోయిన పౌరుల్లో ఒక్కసారిగా వచ్చింది చైతన్యం. గోలగోలగా అరుస్తూ ఆ యింటి వైపు కదలబోయారు.

"అడుగు ముందుకు వేస్తే మీ అందరి ప్రాణాలు తీసిపోతాను... వెనక్కి జరగండి...." ఉరుము లాంటి కంఠంతో వారిని హెచ్చరించాడు ముసుగు మనిషి.

వృద్ధుడి యింటి మీది నుంచి ప్రక్కనే వున్న మరో యింటివైపు మరలాయి అగ్ని జ్వాలలు. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ గాలిలోకి లేస్తుండగా మంటల బారిన పడ్డాయి ఆ యింటి మీది ఎండుటాకులు.

చేతులతో ముఖాన్ని కప్పుకొని నేల మీద కూలబడి పోయాడు వీధిలో నిలిచి వున్న ఒక పౌరుడు. అది చూసి చలించి పోయింది అతని ప్రక్కనే వున్న ఒక పడుచు.

"నా తమ్ముడు.... నా తమ్ముడు యింట్లో నిద్ర పోతున్నాడు... అయ్యయ్యో...." అని అరుస్తూ యింటి వైపు పరుగుతీసింది.

కంటికి కనిపించనంత వేగంగా కదిలింది ఒక బందిపోటు చేతిలోని పొడవాటి కత్తి.

గుండెల మీద పెద్ద గాయం కాగా, కెవ్వున అరిచి నేల కూలి పోయిందామె. ఎర్రటి రక్తం వెల్లువలా ప్రవహించి నేల మీద మడుగు కట్టసాగింది.

"చేతకాని దద్దమ్మల్లా చూస్తూ నిలబడి వుంటే యిటువంటి దారుణాలు వీళ్ళు యింకా చేస్తూనే వుంటారు.... ధైర్యం అనేది మీలో ఎవరికయినా వుంటే ఎదురు తిరగండి.... ఈ దుర్మార్గులను దునుమాడండి." అని గర్జిస్తూ చెంగున ముందుకు దూకాడు శత వృద్ధుడైన ఆ గ్రామపు పెద్ద.

సుడులు తిరుగుతూ గాలిలోకి లేచి ఛెళ్ళున అతని ముఖం మీద వాలింది పొడవాటి చర్మపు కొరడా.

ఎర్రటి వాత ముఖం మీద ప్రత్యక్షం అవుతుండగా, నేల మీద పడి పోయాడు గ్రామపెద్ద.

"మమ్మల్ని ఎదిరించేటంతటి మొనగాడివా నువ్వు ? నీ మాటలతో అందర్నీ రెచ్చ గొడతావా ? నీకు పట్టబోయే గతిని కనులారా చూసుకో...." అంటూ తన గుర్రం మీద వున్న ఒక చిన్న బుట్టను ఎత్తి క్రింద పడేశాడు ముసుగు మనిషి.

క్రింద పడిన వెంటనే వూడిపోయింది ఆ బుట్టకు బిగించి వున్న నల్లటి గుడ్డ. పొడుగాటి నాలుకల్ని వేగంగా ఆడిస్తూ బయటికి వచ్చింది రెండే రెండు మూరల పొడవున్న జోసీ జాతి కొండ చిలువ. రెండు క్షణాల పాటు అటూ యిటూ చూసి, ఒక్కసారిగా పోయి క్రింద పడిన గ్రామ పెద్ద కంఠాన్ని చుట్టేసింది.

ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయి పోయాడతను. నీలం రంగుకు తిరగసాగింది అతని ముఖం.

నీరు నిండిన కనులతో నిస్సహాయంగా నిలబడి పోయారు గ్రామస్తులు అందరూ.... భరించరాని దుఃఖం గుండెల్ని బ్రద్దలు చేస్తున్నా బయటపడి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోయారు.

"నా కోసం మీరు బాధపడకండి.... మీ కోసం, మీ పిల్లల కోసం దైవాన్ని ప్రార్థించండి. అబుటూ పర్వత శిఖరం మీద హాయిగా నిద్రపోతున్నాడు తోషీవాన్. మీ ప్రార్థనలతో అతన్ని నిద్రలేపండి.... అశక్తులైన ప్రజల్ని అవసర సమయంలో కాపాడతానని ప్రతిజ్ఞ చేసిన ఆ బంజాయ్ వీరుడిను పిలవండి...." శరీరంలో వున్న శక్తి నంతా కూడతీసుకొని బిగ్గరిగా అన్నాడు గ్రామ పెద్ద.

ఒక్కసారిగా గొంతులు విప్పారు గ్రామస్తులు.

"బంజాయ్! బంజాయ్!! బంజాయ్!!!" అన్న పిలుపులతో మార్మోగి పోయిందా గ్రామం.

అదిరిపడి అశ్వాల్ని ముందుకు దూకించారు బందిపోట్లు.

"నోళ్ళు మూయండి.... నోళ్ళు మూయకపోతే మీ చర్మాలు వలిచేస్తాము...." కర్కశ కంఠాలతో బెదిరిస్తూ, చర్మపు కొరడాలతో అందరినీ చెల్లా చెదరు చేయటం మొదలు పెట్టారు.

"నీ పేరు మరిచి పోయిన గ్రామస్థులకు నిన్ను గుర్తుకు తెచ్చి నా బాధ్యతను నెరవేర్చుకున్నాను. ఇక ఈ అమాయకులను కాపాడే బాధ్యత నీదే తోషీవాన్.... నీదే...." గద్గదంగా అనుకున్నాడు గ్రామపెద్ద. అతని మనస్సులోని మాటల్ని గమనించినట్లు పెద్దగా బుసకొట్టి తోకను నేలకేసి బాదింది కొండచిలువ. ఎండు కొమ్మ విరిగినట్లు విరిగి పోయింది గ్రామ పెద్ద మెడ ఎముక.

"బంజాయ్ వీరుడి పేరు తలిచినా, అబుటూ పర్వత శిఖరం మాట మనస్సులో అనుకున్నా మీ పని ఆఖరై పోతుంది. చిత్రహింసలు పెట్టి చెట్ల కొమ్మలకు వ్రేలాడదీయిస్తాను...." పారిపోతూ కూడా పెద్ద పెద్ద కేకలు పెడుతున్న పౌరుల్ని ఇష్టం వచ్చినట్లు కొరడాతో కొడుతూ, అశ్వాన్ని అటూ యిటూ పరుగులు తీయిస్తున్నాడు ముసుగు మనిషి.

అదే సమయంలో నురుగులు కక్కుతూ అక్కడికి పరిగెత్తుకు వచ్చింది ఒక అశ్వం. ఎత్తుగా లావుగా వున్న దృఢకాయుడు ఒకతను దాని మీది నుంచి క్రిందికి దూకి ముసుగు మనిషి దగ్గిరికి వచ్చాడు.

"చాంగ్‌మిన్ లోయలో వున్న మన కేంద్రానికి పావురాల టపా వచ్చింది. సకాయ్ సిటీలో మన వాళ్ళు దారుణంగా దెబ్బ తిన్నారట...." అంటూ ఒక చిన్న చీటీని అతనికి అందించాడు.

అందులో వ్రాయబడి వున్న మెస్సేజిని చదువుకోగానే, ముసుగులో నుంచి కనిపిస్తున్న నాయకుడి కనులు చింత నిప్పుల్లా ఎర్రబడ్డాయి.

"అబాషిరీ పట్టణం దగ్గర మన దారికి అడ్డం వచ్చిన వారి పనే ఇది. వాళ్ళు సకాయ్‌లో అడుగుపెట్టక ముందే లిన్‌ఫాంగ్‌ని పైకి పంపించేద్దామని ప్రయత్నించాను.... ఇక ఆలస్యం చేసి ప్రయోజనం లేదు" అంటూ అనుచరులకు సైగ చేసి తన అశ్వాన్ని ముందుకు దూకించాడు.

ఇళ్ళు కొల్లగొట్టి బయటికి చేరవేసిన ధనాన్ని, ధాన్యపు బస్తాలను గ్రామంలో వున్న ఎడ్ల బళ్ళ మీద సర్దారు బందిపోట్లు. వికటాట్టహాసాలు చేస్తూ గ్రామాన్ని వదిలి, దూరంలో కనిపిస్తున్న కొండలవైపు బయలు దేరారు.

## 9

".... ఆరు నెలల క్రితం టోక్యో సెంట్రల్ జైలు నుంచి తప్పించుకు పోయారు కొందరు నేరస్తులు. వారి జాడలు తెలుసుకోవటానికి పట్టణ ప్రదేశాలను వదిలి అడవుల్లోకి పోయాడు నా అసిస్టెంట్...." అన్నాడు లిన్‌ఫాంగ్.

అతను అందించిన వేడి వేడి టీని సిప్‌చేస్తూ ఆ మాటల్ని వింటున్నారు షాడో, గంగారాం.

టాయిలెట్ రూమ్‌లో తగిలిన దెబ్బల నుంచి యింకా సరిగ్గా కోలుకోలేదు లిన్‌ఫాంగ్. స్వల్పంగా కంపిస్తూనే వున్నాయి అతని చేతులు. నీరసంగానే వెలువడుతున్నాయి మాటలు.

"ఇప్పుడు ఈ విషయాలన్నీ దేనికి బాబాయ్! రేపు మాట్లాడుకోవచ్చు గదా!" అనబోయిన గంగారాంని వారిస్తూ చిరునవ్వు నవ్వాడతను.

"జైలులో నుంచి పారిపోయిన నేరస్తుల జాడలకు బదులు కొన్ని దారుణమైన రహస్యాలు నా అసిస్టెంట్‌కి తెలిశాయి. బందిపోటు దొంగతనాల పేరుతో గ్రామస్తుల్ని హడల కొడుతున్నారు కొందరు విద్రోహులు. అందరి దృష్టి ఆ దొంగతనాల మీద వున్న సమయంలో దేశాన్ని మొత్తం స్వాహా చెయ్యటానికి పథకాలు తయారు చేయబడినాయట...." అంటూ మెటల్ ట్యూబ్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

"నా అసిస్టెంట్ సంపాదించిన ఇన్ఫర్మేషన్ యిందులో పొంద పరచబడి వుంది. ఇది నా చేతికి చేరితే తమ బండారం బట్టబయలు అవుతుందనే భయంతో యిన్ని దారుణాలు చేశారు ఆ దుర్మార్గులు...." అంటూ చిన్న స్క్రూ డ్రయివర్‌తో మెటల్ ట్యూబ్‌ని పగల గొట్టాడు.

టైట్‌గా చుట్టిన మైక్రో ఫిలిం ఒకటి పాక్ చెయ్యబడి వుంది అందులో. మామూలు కనులకు కనిపించవు అందులోని బొమ్మలు.

"ఇందుకు ప్రత్యేకమైన ప్రొజెక్టర్ వుంది. దాన్ని తెప్పిస్తాను. ప్రాణాలను పణంగా పెట్టి నా అసిస్టెంట్ కనిపెట్టిన విషయాన్ని దేశమంతటా చాటిస్తాను" ఆనందంగా అంటూ గదిలో ఒక మూలగా వున్న టెలిఫోన్ దగ్గరికి పోయాడు లిన్‌ఫాంగ్.

టీ కప్పును ఖాళీ చేసి టేబిల్ మీద పెడుతున్న షాడో అనీజీగా కదిలాడు అటూ యిటూ.

"ఏమిటి గురూ ? ఏమయింది ?" తన చేతిలోని కప్పును ఠపీమని క్రింద పెట్టేస్తూ వెంటనే అడిగాడు గంగారాం.

"సమ్ థింగ్ యీాజ్ రాంగ్ హియర్ గంగూ.... ఏదో ప్రమాదం మనల్ని పొంచి పొంచి చూస్తున్నట్లు అనిపిస్తోంది...." అంటూ గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు షాడో.

ఘాటుగా సోకింది ఒక వెగటు వాసన.... అడవుల్లో తిరిగే జంతువు ఏదో ఆ పరిసరాల్లో తచ్చట్లాడుతున్నట్లు-

షాడో ఆలోచన ఒక కొలిక్కి రాకముందే దబ్‌మని శబ్దం చేస్తూ విరిగి లోపల పడ్డాయి మూసి వున్న ఆ గది తలుపులు.

అదిరి పడి కుర్చీలో నుంచి లేచాడు షాడో. బలంగా వున్నాయి గది తలుపులు. పది మంది బలవంతులు పలుగులు తెచ్చి పొడిస్తే గాని పగిలి క్రింద పడవు అవి....

అటువంటి తలుపుల్ని ఒకే ఒక గుద్దుతో విరగ్గొట్టి గదిలోకి వచ్చింది బ్రహ్మాండమైన ఆకారం ఒకటి.

"అయ్య నాయనోయ్! ఇదెక్కడిది గురో.... ఇలా వుందేమిటి!!" షాడోతో పాటు కుర్చీలోనుంచి లేచిన గంగారాం ఆశ్చర్యంతో మ్రాన్పడి పోతూ అన్నాడు అస్పష్టంగా.

ఆఫ్రికన్ అడవుల్లో అగుపించే గొరిల్లాకు నాలుగింతలు పెద్దదిగా వుంది ఆ ఆకారం. చురకత్తుల్లాంటి రోమాలు శరీరమంతటా కనిపిస్తున్నాయి. చిన్న సైజు మద్ది చెట్ల మాదిరిగా వున్న దాని చేతుల్లో తళతళ మెరుస్తూ కనిపిస్తోంది ఆరు అడుగుల పొడవున్న పెద్ద గండ్ర గొడ్డలి.

ఎర్రగా జ్యోతుల్లా మెరిసిపోతున్న కనుల్ని గుండ్రంగా తిప్పుతూ గది నంతా కలియ చూసింది ఆ ఆకారం. టెలీఫోన్ దగ్గర వున్న లిన్‌ఫాంగ్‌ని గమనించగానే భీకరంగా నోరు తెరిచి గండ్ర గొడ్డలిని అతనివైపు విసిరింది.

ఫట్‌మని శబ్దం చేస్తూ మధ్యకు విరిగి పోయింది టేబిల్. క్రింద పడి ముక్కలు ముక్కలై పోయింది టెలీఫోన్.

“మైగాడ్! తప్పుకో బాబాయ్.... తప్పుకో!” ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అరిచాడు గంగారాం.

ఎగిరి వెనక్కు దూకాడు లిన్‌ఫాంగ్. వయసును మించిన వేగంతో పారిపోయి వచ్చాడు.

“జపాన్ దేశపు జానపద గాథల్లో తప్ప ఎక్కడా కనిపించని భీకర మృగం యిది. తెలివి తేటల్లో మనిషికి సమానం. మన మాటలు అర్థం చేసుకున్నా ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. కథల్లో వుండే ఈ రాక్షసి యిక్కడికి ఎలా వచ్చింది ? మనం భ్రమ పడటం లేదు గదా!” భయంతో కంపించి పోతూ అన్నాడు.

అతని మాటలు నిజంగానే అర్థం అయినట్లు నోరు తెరిచి కాలితో నేలను బాదింది ఆ మృగం.

భూకంపం వచ్చినట్లు కంపించింది నేల. రెండు అంగుళాల ఎత్తుకు లేచి పడ్డాయి గదిలో వున్న సామాన్లు.

"దీని యవ్వారం చూస్తుంటే మనల్ని కథల్లోకో, గాథల్లోకో పంపించేసేటట్లుంది. ఏం చేద్దాం గురూ ?" అంటూ ప్రక్కకు చూశాడు గంగారాం.

పది అడుగుల దూరంలోనే వుంది పెద్ద ఫ్రెంచి విండో.... వేగంగా పోయి తలుపులు తెరవ గలిగితే -

ఆ అలోచన మనస్సులోకి ఎంటర్ అయిన మరుక్షణం కదిలాడతను. లిన్‌ఫాంగ్ చేయి పట్టుకొని రెండు అడుగులు వేశాడు.

కత్తుల్లా కనిపించే కోరల్ని బయటపెట్టి వళ్ళు జలదరించేటట్లు అరిచింది ఆ మృగం.... కాళ్ళకు దగ్గర్లో వున్న కుర్చీ నొకదాన్ని బలంగా తన్ని ముందుకు దూకింది.

"కమ్ బేక్ గంగూ.... కమ్ బాక్ యూ బ్లడీ యిడియట్" అని హెచ్చరిస్తూ గంగారాం చేయి పట్టుకొని వెనక్కి లాగేశాడు షాడో.

ఫుట్‌బాల్ మాదిరి గింగిరాలు తిరుగుతూ పోయి విండోకి కొట్టుకొంది కుర్చీ. ముక్కలు ముక్కలై పోయింది విండో గ్లాస్.

షాడో అరుపును లక్ష్యపెట్టకుండా ఒక్క గంతులో విండోని సమీపించాడు లిన్‌ఫాంగ్. ఒక కాలు ఎత్తి విండో సిల్ మీద వేశాడు.

మెరుపు కంటే వేగంగా అతన్ని సమీపించి మెడ పట్టుకుంది ఆ మృగం. కొయ్య బొమ్మని విరిచినట్లు పుటుక్కున మధ్యకు విరిచేసి క్రింద పడవేసింది.

రెండుసార్లు గిలగిలా కొట్టుకున్నాడు లిన్‌ఫాంగ్. "రక్షించండి.... రక్షించండి" అంటూ ప్రాణాలు వదిలేశాడు.

ఎడమ కాలితో నేలను తన్ని గాలిలోకి ఎగిరాడు షాడో. నాభి కండరాలను మెలిపెడుతూ అతని నోటి వెంట వెలువడింది భయంకరమైన కుంగ్‌ఫూ ఛాలెంజి. కంటికి కనిపించని వేగంతో పోయి దాని ముఖానికి తగిలింది అతని కుడి పాదం.

కొండ రాళ్ళను సైతం పిండి చేయగల బలమైన దెబ్బ అది. ఎంతటి బలవంతుడైనా బావురుమంటూ నేల కూలవలసిందే!

ముక్కు మీద ఏదో ఈగ వాలినట్లు ముఖాన్ని సవరించుకొంది ఆ మృగం. ఉన్నట్లుండి ముందుకు వంగి ఫెడీ మని కొట్టింది కుడి చేత్తో.

తల్ల క్రిందులుగా గాలిలోకి లేచి ఒక గోడకు గుద్దుకున్నాడు షాడో. కరెంట్ షాక్ తగిలినట్లు పారలైజ్ అయిపోయింది అతని శరీరం.

గచ్చు అదిరేటట్లు అడుగులు వేస్తూ అతనివైపు కదిలింది ఆ మృగం. అది చూసేసరికి.... చీమలు పాకినట్లు కంపరం ఎత్తింది గంగారాం శరీరం.

"నీ వైపే వస్తోంది.... తప్పుకో గురూ....!' అని అరిచాడు.

తప్పుకోవటానికి ప్రయత్నించాడు షాడో. ఎంత ప్రయత్నించినా స్వాధీనంలోకి రాలేదు అవయవాలు.

గురగురమని శబ్దం చేస్తూ ముందుకు వంగింది ఆ మృగం. చేతులు జాచి షాడో మెడ పట్టుకుంది.

తనని తాను మరిచి పోయాడు గంగారాం. గది గోడలు ప్రతిధ్వనించేలా రంకె వేసి దుస్తుల్లో దాచి వుంచిన టోంగా పిడిబాకును బయటికి లాగాడు. ఛెంగున ముందుకు దూకి పోటు మీద పోటుగా దాన్ని వెన్ను మీద పొడిచాడు నాలుగు పోట్లు.

బాధతో మెలికలు తిరిగి పోయిందా మృగం. ఎగిరి గంతులు వేస్తూ వెనుతిరిగి అతని మీదికి జంప్ చేసింది.

"నన్ను పట్టుకోవటం నీ తాత తరం కూడా కాదే.... నీలాంటి దద్దమ్మల్ని నేను చాలా సార్లు చూశాను....' అంటూ ఒక ప్రక్కన నిలబెట్టివున్న స్టీల్ కప్‌బోర్డ్‌ని దాని నెత్తి మీదికి నెట్టాడు గంగారాం.

కప్ బోర్డ్ దెబ్బకు యిసుమంత కూడా తొణకలేదా మృగం. టోంగా బాకుకు రాసి వున్న విషం మాత్రం దాన్ని గింగిరాలు తిప్పుతోంది. ఆ తిక్కలో గంగారాంని పట్టుకోలేక గుండెలు బాదుకుంటూ భీకరంగా అరిచింది.

ముందుకు రావటం అంటూ జరిగితే ఈసారి దాని అంతు చూడాలన్న పట్టుదలతో లిన్‌ఫాంగ్ దగ్గర పడి వున్న గండ్రగొడ్డలిని అందుకొని రెడీ అయినాడు గంగారాం.

ముందుకు వచ్చిందది. మామూలుగా మాత్రం కాదు. ఎవరో ఆర్డర్ యిచ్చినట్లు అరుపుల్ని ఆపేసి సుడిగాలిలా అతని ప్రక్కనుంచి ఫ్రెంచి విండో దగ్గిరికి పరుగు తీసింది.

"ఆగు.... ఆగవే.... పిరికి పందలా పారిపోవటానికి నీకు సిగ్గు లేదూ ? ఆగమని అంటుంటే నీకు వినిపించటం లేదూ ?" అంటూ గండ్ర గొడ్డలిని దాని మీదికి విసరబోయి శిలా విగ్రహంలా స్తంభించి పోయాడు గంగారాం.

ఫ్రెంచి విండోలోనుంచి బయటికి దూకి చీకట్లలో కలిసి పోయింది ఆ మృగం. తలుపులు విరిగి పోయిన ద్వారంలోనుంచి పరుగు పరుగున వచ్చి అతన్ని, షాడోని చుట్టు ముట్టారు అనేక మంది పోలీస్ గార్డులు.

## 10

"లిన్‌ఫాంగ్ మా సీక్రెట్ ఏజన్సీకి గౌరవ సలహాదారు. అతన్ని దారుణంగా హత్య చేసిన మీ యిద్దరికీ వురిశిక్ష తప్పదు...." లావుపాటి సిగార్‌ని వెలిగించుకొని గుప్పు గుప్పున పొగ వదులుతూ అన్నాడు పోలీస్ కమీషనర్.

"అయ్యబాబోయ్! అతన్ని హత్య చేసింది మేము కాదు సారూ.... అబాషిరీ పట్టణం నుంచి అతనికి ఒక మెస్సేజిని మోసుకొచ్చాము.... మేము తెచ్చిన మైక్రో ఫిలిం యింకా అతని దగ్గిరే వుంది...." ఆందోళనగా అన్నాడు గంగారాం.

అతని చేతిలోని గండ్రగొడ్డలిని లాక్కుని జాగ్రత్తగా క్రింద పెట్టాడు పోలీస్ కమీషనర్. లిన్‌ఫాంగ్ దగ్గిరికి పోయి ఫిలిం కోసం వెతికాడు.

అతని దగ్గిర కాదు కదా.... ఆ గది మొత్తం గాలించినా కనిపించలేదు ఆ ఫిలిం.

"గంద్ర గొడ్డళ్ళతో నిండు ప్రాణాన్ని బలి తీసుకోగలిగిన మీ వంటి రాక్షసులకు అబద్ధాలు ఆడటం ఏమంత కష్టం కాదు. మిమ్మల్ని చిత్రహింసలు పెట్టి సజీవంగా కాల్చిచంపాలి...." అంటూ గార్డులకు సైగ చేశాడతను.

"అది కాదు సారూ.... ఆ మృగం...." అనబోయిన గంగారాంని కనులతోనే వారించాడు షాడో.

"ఇక మనం ఏమి చెప్పినా వీళ్ళు నమ్మరు గంగూ. అనవసరం అయిన విషయాలను ఎత్తి యింకా అవమానాల పాలు కావటం దేనికి ? ?" అంటూ హెచ్చరించాడు.

నోరు మూసుకొని నడిచాడు గంగారాం. లిన్‌ఫాంగ్ నివశించే ఆ యింటి ముందు గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు జనం.

"చంపండి.... ఆ దుర్మార్గుల్ని నిలబెట్టి నరకండి...." అని అరుస్తూ ఒక్కసారిగా ముందుకు దూకారు.

లాటీ కర్రలతో వారందరినీ వెనక్కి తరిమి, షాడో గంగారాంలను ఒక జీప్‌లోకి నెట్టారు పోలీస్ గార్డులు. అరగంట తరువాత ఒక పోలీస్ స్టేషన్ ముందు దించి లోపలికి తీసుకుపోయారు.

కిటకిటలాడి పోతున్నాయి అక్కడ వున్న లాకప్ రూములన్నీ. ఇద్దరు ముగ్గురి కంటె ఎక్కువ వుండకూడని ఆ గదుల నిండా పాతిక మందికి పైనే బంధింపబడి వున్నారు.

"పాపం పెరిగి పోయింది. జనన మరణాల సంఖ్యల కంటె జైలు గదుల్లోకి వచ్చేవారి సంఖ్యే ఎక్కువ అనిపిస్తోంది...." అంటూ లాకప్ గదుల ముందున్న వరండాలోకి నడిచాడు గంగారాం.

ఒకదాని మీద ఒకటిగా వరుసల్లో పేర్చి వున్నాయి అనేక రకాల జనపనార బస్తాలు. తెల్లటి పొడుము ఎదో వాటిలో నుంచి క్రిందికి జారి నేలంతా పరుచుకొని వుంది.

"అవేమిటి బ్రదర్ ?" కుతూహలాన్ని అణుచుకోలేక వెంట వస్తున్న గార్డుల్ని అడిగాడు.

"మీలాంటి దుర్మార్గుల్ని మేపటానికి తెచ్చిన మైదాపిండి. నన్ను అడిగితే మీకసలు తిండి పెట్టటం శుద్ధ దండగ. లాకప్‌లో వున్నంత కాలం మాడ్చి మసి చేయాలి. అప్పుడు గాని మీ బుద్ధులు మారవు." కరుకుగా చెప్పాడు ఒక గార్డు.

"ఏదో తెలియక అడిగినందుకు యింత పెద్ద ఉపన్యాసం దేనికి బ్రదరూ ? ఎవరు దుర్మార్గులో, ఎవరు సన్మార్గులో యిప్పుడే తెలియదు. ఒక్క నిముషం ఓపిక పట్టు...." అంటూ ఒక అడుగు ప్రక్కకు వేసి, షాడోకి అడ్డం తిరిగాడు గంగారాం.

అతన్ని తప్పించు కోవటానికి రెండు అడుగులు అవతలికి వేశాడు షాడో. ఉన్నట్లుండి బిగ్గరిగా షౌట్ చేసి వరుసలో పేర్చివున్న ఒక బస్తాను కుడిచేత్తో బలంగా పొడిచాడు.

షాడో కంటె బిగ్గరిగా అరిచి అమాంతం ఆ బస్తాను అందుకున్నాడు గంగారాం. గిర్రున తిరుగుతూ అందులో వున్న మైదాపిండిని వరండా అంతా విరజిమ్మాడు.

రెప్పపాటు కాలంలో జరిగిపోయింది ఆ సంఘటన. నోళ్ళు తెరుచుకొని రాతిబొమ్మల్లా చూస్తున్న గార్డుల కళ్ళనిండా పడింది మైదా పిండి.

"మోసం.... మోసం.... పట్టుకోండి.... పట్టుకోండి" అని అరుస్తూ, గుడ్డిగా కదం తొక్కటం మొదలు పెట్టారు వాళ్ళు.

అడ్డం వచ్చిన ఇద్దర్ని అవతలికి నెట్టి వింటి నుంచి వెలువడిన బాణంలా స్టేషన్ బయటికి పరుగు తీశాడు షాడో.

"పట్టుకోండి.... పట్టుకోండి" అని గావుకేకలు పెడుతూ క్లోజ్‌గా అతన్ని ఫాలో అయ్యాడు గంగారాం.

స్టేషన్ బయటే నిలబడి వుంది వారిని తీసుకొచ్చిన పోలీస్ జీప్. బోనెట్ దగ్గర నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్నాడు డ్రయివర్.

"నిన్ను ఇన్స్‌పెక్టర్‌గారు పిలుస్తున్నారు బ్రదరూ.... అర్జంటుగా వెళ్ళు...." అంటూ ఒక్క గంతులో స్టీరింగ్ ముందు కూర్చున్నాడు గంగారాం.

మైదాపిండితో నిండివున్న అతని అవతారాన్ని చూసి నోరు తెరిచాడు ఆ డ్రయివర్. తెరిచిన నోరు తెరిచినట్లు వుండగానే స్టార్ట్ అయింది జీప్. అతన్ని అవతలకు నెట్టి వేగంగా ముందుకు దూసుకు పోయింది.

# 11

"హెచ్చరిక! సకాయ్ పట్టణ పౌరులందరికీ హెచ్చరిక!! పోలీసుల కళ్ళు కప్పి పారిపోతున్న నేరస్తులు పట్టణంలోనే వున్నట్లు తెలుస్తోంది. వారిని పట్టిచ్చిన వారికి మంచి బహుమతి యివ్వబడుతుంది." చెవులు చిల్లులు పడేటట్లు ఎనౌన్స్ చేస్తూ దూసుకు పోయింది పోలీస్ వాన్.

"పిచ్చినాయాళ్ళు.... అనవసరంగా హైరాన పడిపోతున్నారు.... ఇంకో పది నిముషాల్లో మనం యీ పట్టణంలోనుంచి చెక్కేస్తామని తెలియదు...." అంటూ ఒక సందులో ఆపిన జీప్‌ని కదిలించి వేగంగా ముందుకు పోనిచ్చాడు గంగారాం.

పది నిముషాల తరువాత ఎదురయింది సిటీలిమిట్స్‌ని సూచించే ఒక పెద్ద వంతెన. దాని ముందు నిలబడి వున్న పోలీస్ వాన్స్‌ని చూడగానే సడన్ బ్రేకుతో జీప్‌ని ఆపి, స్పీడ్‌గా వెనక్కి లాగేశాడతను.

"ఎవరు పిచ్చినాయాళ్ళో యిప్పుడు అర్థం అయిందా ?" చిరునవ్వుతో ప్రశ్నించాడు అంతవరకూ మౌనంగా కూర్చుని వున్న షాడో.

"నీ ఎత్తి పొడుపుల్ని కట్టిపెట్టి యిప్పుడు ఏం చేయాలో చెప్పు గురూ... ఈ నిద్రముఖం నాయాళ్ళకు యిన్ని తెలివి తేటలుంటాయని నేనేమైనా కలగన్నానా ?" జీప్ ప్రక్కనే చతికిలబడుతూ నీరసంగా అన్నాడు గంగారాం.

సమాధానం యివ్వలేదు షాడో. సీటులోనుంచి క్రిందికి దిగకుండా అలాగే కూర్చున్నాడు....

ఖచ్చితంగా ఒక గంట గడిచిన తరువాత వున్నట్లుండి రాకపోకలు ప్రారంభం అయినాయి నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్డుమీద.

ప్రక్క గ్రామలనుంచి వచ్చి, పగలంతా పనీ పాటలు చేసికొని బ్రతికే పేదవాళ్ళు, హాయిగా సెకండ్ షో సినిమాలు చూసి యిళ్ళకు మరలి పోతున్నారు.

పెద్ద పెద్ద బుట్టల్ని నెత్తి మీద పెట్టుకొని కూనిరాగాలు తీస్తు వస్తున్న ఒక వ్యక్తి ని ఎంచుకున్నాడు షాడో. దగ్గరికి రానిచ్చి చటుక్కున జీప్‌లోకి లాగేశాడు. మెడమీద ఎత్తుగా కనపడుతున్న బ్లడ్ వెస్సెల్‌ని చూపుడు వ్రేలితో అదిమాడు అరక్షణం పాటు.

పెద్దగా అరిచి కేకలు పెట్టటానికి ప్రయత్నిస్తూ, మెల్లిగా తల వాల్చేశాడు ఆవ్యక్తి. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతని దుస్తుల్ని తాను ధరించి ఒక బుట్టను తల మీద బోర్లించుకున్నాడు గంగారాం. రెండో బుట్టను షాడో మీదికి విసిరి వడివడిగా వంతెన వైపు బయలు దేరాడు.

“బీ కేర్‌ఫుల్ గంగూ.... ఏమాత్రం అనుమానం కలిగినా మన పని ఖతమ్ అయిపోతుంది....” లోగొంతుకతో హెచ్చరిస్తూ, అతన్ని అనుసరించాడు షాడో.

ఆ తరువాత జరగబోయే దేమిటో తెలిసి వున్నట్లయితే మరొక విధంగా వుండి వుండేది అతని హెచ్చరిక.

అతని మాటలు వినగానే గట్టిగా గొంతు సవరించుకొని కూనిరాగాలు ప్రారంభించాడు గంగారాం.

నీడ చూస్తావుంటె నిదుర రాకున్నాది

రెవికె చూత్తావుంటె ముడి నిలువకున్నా ది

నేనేమి చేతురో ఓరయ్యో

నాకేటి దిక్కు రో ఓరయ్యో

నెత్తి మీది బుట్టను అవతలికి విసిరేసి వెనక్కి పారిపోవాలన్న కోరికను బలవంతంగా నిగ్రహించుకున్నాడు షాడో. అంత నిగ్రహం వంతెన ముందున్న పోలీసులకు లేక పోయింది.

"నోరు మూసుకొని పోవోయ్.... వెధవ పాటలు పాడావంటే ముఖం పగిలి పోతుంది...." కరుకుగా హెచ్చరించాడు ఒక ఇన్స్పెక్టరు.

తన పాట వారందరికీ ఎలర్జీని కలిగించిందని తెలుసుకోగానే మరింత రెచ్చిపోయాడు గంగారాం. నోరు మూసుకొని నాలుగు అడుగులు వేసినట్లే వేసి మరో చరణం అందుకున్నాడు.

చేనుగట్టూ మీద జడ పట్టి లాగావు

చెరువు కొమ్మూ కాడ చేయట్టుకున్నావు

వట్టొట్టి చేతలతో ఓరయ్యో

నట్టేట ముంచావు ఓరయ్యో....

భరించలేక పోయాడు షాడో. వేగంగా రెండు అడుగులు వేసి ఫెడీ మని కొట్టాడు అతని వీపు మీద.

వీపు సవరించుకుంటూ నిర్మొహమాటంగా పాటను కంటిన్యూ చేశాడు గంగారాం.

ఎదురు తెన్నులు చూసి ఏసారె కళ్ళూ

ఏడెక్కి బుసకొట్టి మెలిపెట్టె వళ్ళు

ఆపైన సడన్‌గా ఆగిపోయిందతని కంఠం. వంతెన చివర నిలబడి వున్న కానిస్టేబుల్ ఒకతను పరుగులాంటి నడకతో ఎదురొచ్చి లాగిపెట్టి కొట్టాడు అతని నెత్తి మీద.

"నోరు మూసుకొని నీ దారిన నువ్వు పోకుండా ఏమిటి యీ అరుపులు ? ఇంకొక్క శబ్దం బయటికి వచ్చిందంటే పళ్ళు రాలగొట్టేస్తాను." లాటీ కర్రను గాలిలో వూపుతూ హెచ్చరించాడు.

చిన్నబుచ్చుకున్నాడు గంగారాం.... తల వంచుకొని గబగబా వంతెన దాటాడు. ఉబికి వస్తున్న నవ్వును అతి ప్రయత్నం మీద అణుచుకుంటూ అతని వెనుకే అడుగులు వేశాడు షాడో.

పైకి ఎంతో ప్రశాంతంగా కనిపిస్తున్నా సమాధానం లభించని ప్రశ్నలు ఎన్నెన్నో అతని అంతరంగాన్ని పట్టి పీడించుకు తింటున్నాయి.

జపాన్ దేశపు శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లబోతున్నట్లు మాట్లాడాడు మరణించిన లిన్‌ఫాంగ్.... ఆ పని చేస్తున్నది ఎవరు ?

అర్థాంతరంగా ప్రత్యక్షమై అతన్ని హతమార్చి పోయిన ఆ వింత మృగం ఎక్కడి నుంచి వచ్చింది ? లిన్‌ఫాంగ్ దగ్గిర వున్న మైక్రో ఫిలింని ఖచ్చితంగా అదే తీసుకొని పోయి వుండాలి.... దానికి అన్ని తెలివి తేటలు ఎక్కడినుంచి వచ్చాయి ?

షాడో మనస్సులో మెదులుతున్న ఆలోచనలను గమనించి అతన్ని డిస్టర్బ్ చేయలేదు గంగారాం. ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి మరునాడు ఉదయం పది గంటలకు మియాకీ సిటీని చేరుకున్నారు.

సిటీలోకి ఎంటర్ కాగానే ఒక చిన్న కాకా హోటల్లోకి దారి తీశాడు షాడో. అక్కడ వున్న రొట్టెల్ని తిని వేడి వేడి టీ తాగారు యిద్దరూ.

"ఇక నా పని అయిపోయింది గురూ.... అరిచి పీక్కున్నా సరే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేను" పొట్ట సవరించుకుంటూ తన పొజిషన్ క్లియర్‌గా బయట పెట్టేశాడు గంగారాం.

హోటల్ ప్రక్కనే వున్న షాపులో సిగరెట్ పాకెట్‌ని తీసుకున్నాడు షాడో. సిగరెట్ వెలిగించుకుంటూ రోడ్డు ఆవలి ప్రక్కకు అడుగులు వేశాడు.

"నా పని అయిపోయిందని చెపుతుంటే వినబడటం లేదా ? నన్ను చిత్రహింసలు పెట్టి చంపటమే నీ ధ్యేయమా ?" ఇండిగ్నంట్‌గా అడుగుతూ అతన్ని అనుసరించాడు గంగారాం.

"ఈ పట్టణంలో ఫాక్స్ అనే పెద్ద మనిషి ఒకతను ఉండాలి గంగూ.... సరయిన ధర చెల్లిస్తే ఎటువంటి ఇన్ఫర్మేషన్ కావాలన్నా సప్లయి చేయగలడు..." సిగరెట్ పొగను గుండెల నిండా పీల్చుకుంటూ సాలోచనగా అన్నాడు షాడో.

క్షణంలో మాయమై పోయింది గంగారాం అలసట.

"పట్టపగలు మనం రోడ్లను సర్వే చేస్తే బాగుండదు గురూ.... సకాయ్ దొంగనాయాళ్ళు యీ పాటికి మెస్సేజి పంపి వుంటారు.... ఇక్కడి పరిస్థితులు ఎలా వున్నాయో తెలుసుకోకుండా తొందర పడితే మళ్ళీ ప్రమాదంలో యిరుక్కుంటాం" అన్నాడతను, రోడ్డు మీద ట్రాఫిక్‌ని పరిశీలనగా చూస్తూ.

"ఆల్‌రైట్.... చీకటి పడేదాకా ఎక్కడయినా తల దాచుకుందాం...." అంటూ ఎదురుగా కనిపించిన ఒక సందులోకి మరలాడు షాడో.

సందు మధ్యలో వుంది చిన్న చెక్కల మేడ. ఆలనా పాలనా చూసేవారు లేకపోవటంతో చెదలు పట్టి శిథిలావస్థకు చేరుకుంటోంది. దాని వెనుక భాగంలో వున్న వరండాను ఆక్రమించుకున్నాడు షాడో. తల క్రింద చేతులు పెట్టుకొని గాఢ నిద్దురలో మునిగి పోయాడు.

మరో అరగంట పాటు సందులో తిరుగుతున్న పౌరుల్ని శ్రద్ధగా గమనిస్తూ మేడ ముందు కూర్చున్నాడు గంగారాం. తమను గురించి పట్టించుకునే వారు అక్కడ ఎవరూ లేరని నిశ్చయ పరుచుకొని షాడో ప్రక్కన మేను వాల్చాడు.

# 12

సకాయ్ పోలీసులు తమ వెంట పడి తరుముతున్నట్లు కల వచ్చి చటుక్కున కనులు తెరిచాడు షాడో.

సాధారణమైన కలల మూలకంగా అంత హఠాత్తుగా మెలకువ రాదు. అందుకు యింకేదో కారణం వుండే వుంటుంది.

పడుకున్న చోటునుంచి కదలకుండా, కనుచివరల నుంచి చుట్టూ చూశాడు. నిశ్శబ్దంగా వున్నాయి మేడ వెనుక భాగంలో పెరిగిన ముళ్ళ పొదలు. ఒక్క ఆకు కూడా అటూ యిటూ కదలటం లేదు. మరి తనకు మెలకువ ఎందుకు వచ్చినట్లు ?

ఉన్నట్లుండి అతని దృష్టి తన పాదాలకు సమీపంలో వున్న స్తంభం మీద పడింది.

స్తంభం చాటున నిలబడి అతని వంకే పరిశీలనగా చూస్తున్నాడు ఒక వృద్ధుడు. రెండు నిముషాల పాటు అలాగే చూసి మెల్లిగా వెనక్కి తిరిగాడు.

బిగపట్టి వుంచిన వూపిరిని తేలికగా బయటికి వదులుతూ నిశ్శబ్దంగా లేచి నిలబడ్డాడు షాడో. అడుగులో అడుగువేస్తూ ఆ వృద్ధుడిని అనుసరించాడు.

పొడుగాటి వెదురు కర్రను ఆధారంగా తీసుకొని నడవలేక నడుస్తున్నాడు ఆ వృద్ధుడు. పది నిముషాల తరువాత ప్రక్క వీధిలో ఒక ఇంటి చాటుకు పోయాడు.

సాధ్యమైనంత దగ్గిరలో నిలబడి చెవులు రిక్కించాడు షాడో.

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటికి చీకటిలో నుంచి మాటలు మాత్రం విన వస్తున్నా యి. మనుష్యులు కనిపించటం లేదు.

"చెక్క ల మేడలో ఎవరో యిద్దరు వ్యక్తులు పడుకొని వున్నా రు. వారి వాలకం చూస్తుంటే చాలా దూరం నుంచి వచ్చినట్లు అనిపిస్తోంది" మెల్లిగా అంటున్నా డు వృద్ధుడు.

"మనకి పనికి వస్తారా ?" ప్రశ్నించింది ఒక బొంగురు గొంతు.

"పనికి రారని అనుకుంటే నేను యిక్క డికి దేనికి వస్తాను ? ఆ యిద్దరిలో ఒకతను మంచి వయసు మీద వున్నా డు."

"ఆల్‌రైట్. నువ్వు పోయి మిగిలిన ఏర్పాట్లు చూడు. మేము ఇంకో పావుగంటలో అక్క డికి వస్తాము" రెండు క్షణాలు దీర్ఘంగా ఆలోచించి అన్నది ఆ బొంగురు గొంతు.

ఇక తను వినదగిన విషయాలు అక్క డ ఏవీ లేవని గ్రహించి, వేగంగా వెనక్కి వచ్చేశాడు షాడో.

వృద్ధుడు, అతనితో మాట్లాడిన బొంగురు గొంతు ఏదో పెద్ద ప్లాను మీదే వున్నా రు. ఏమిటి అది ? ?

అతని ఆలోచన ఒక కొలిక్కి రాకముందే బర్రుమని మ్రోతలు చేస్తూ వచ్చి చెక్క ల మేడ ముందు ఆగింది ఒక జీప్.

పొడుగాటి లాటీలను పట్టుకొని అందులోనుంచి క్రిందికి దూకారు నలుగురు కానిస్టేబుల్స్. బూట్లను టకటకలాడిస్తూ మేడ వెనక్కి వచ్చి లాటీలతో షాడో భుజం మీద తట్టారు.

అప్పుడే నిద్ర లేచినట్లు ఆవలిస్తూ నిలబడ్డాడు షాడో. వారిని చూసి ఖంగారు పడ్డాడు.

"ఎవరు మీరు ? ఇక్కడ దేనికి పడుకున్నారు ?" లాటీతో అతని భుజాన్ని టాప్‌చేస్తూ హుందాగా అడిగాడు ఒక కానిస్టేబుల్.

శరవేగంతో ఆలోచించి జాగ్రత్తగా సమాధానం చెప్పాడు షాడో. "సకాయ్ పట్టణం నుంచి బస్సులో వస్తుండగా ఎవరో పర్సు కొట్టేశారు. విధిలేక, వేరు దారిలేక ఆ శిథిల గృహంలో తలదాచుకోవాల్సి వచ్చింది. ఘనత వహించిన కానిస్టేబుల్ గారు అనుమతియిస్తే తెల్లవారగానే ఇక్కడి నుంచి వెళ్ళిపోతాము."

"నో.... నో.... నథింగ్ డూయింగ్. మీ ముఖాలు చూస్తుంటే పెద్ద కేడీల మాదిరిగా కనిపిస్తున్నారు. స్టేషన్‌కి తీసుకుపోయి రెండు వుతికితే గాని సరయిన సమాధానం బయటికి రాదు." కరుకుగా అంటూ మిగిలిన వారికి సైగ చేశాడు కానిస్టేబుల్.

బెల్టులకు తగిలించి వున్న సంకెళ్ళను తీసి రెండు అడుగులు ముందుకు వేశారు వాళ్ళు. సరిగ్గా అదే సమయంలో రంగప్రవేశం చేశాడు వృద్ధుడు.

"అయ్యయ్యో! ఇదెక్కడి అన్యాయం సార్ ? అమాయకులైన ఆ కుర్రాళ్ళని పట్టుకుంటే మీకేం ఒరుగుతుంది ? ఈ దేశంలో న్యాయం ధర్మం నశించిపోయాయని అనుకున్నారా ?" అన్నాడు వస్తూనే.

"గెటవుట్ ముసలోడా.... ఈ విషయంలో నీ జోక్యం అనవసరం." చివ్వున అతనివైపు తిరుగుతూ అన్నాడు కానిస్టేబుల్.

విపరీతమైన కోపంతో ఎర్రగా కందిపోయింది వృద్ధుడి ముఖం.

"గెటవుట్ అంటావా ? నన్ను గెటవుట్ అంటావా ? నీ అంతు చూస్తాను. నీ పై అధికారులకు రిపోర్టుచేసి నీ వుద్యోగం ఊడపీకిస్తాను. వీళ్ళు నా స్నేహితులు. నా యింట్లో సరిగ్గా గాలి వేయటం లేదని యిక్కడికి వచ్చి పడుకున్నారు.... ఇక నీ యిష్టం వచినట్లు కేసురాసుకో.... కావాలంటే నేను కూడా స్టేషన్‌కి వస్తాను." అంటూ యింతెత్తున ఎగిరాడు.

అంతకు ముంది అతని మాటలు విని వుండకపోతే నిజమని అనిపించే విధంగా, నాచురల్‌గా వుంది అతని యాక్షన్.

ముందు అనుకున్న ప్రకారం వెంటనే తగ్గిపోయారు కానిస్టేబుల్. నోరు జారినందుకు క్షమాపణలు కోరుకొని అక్కడినుంచి వెళ్ళిపోయారు.

జీప్ ఆ సందును దాటి అవతలికి పోగానే షాడో వైపు తిరిగాడు వృద్ధుడు.

"ఈ పట్టణం గురించి మీకు యింకా తెలియదని నాకు తోస్తోంది. ఇలా వీధుల్లో పడుకుంటే స్టేషన్‌కి తీసుకుపోయి దొంగకేసుల్ని బనాయిస్తారు యీ పోలీసులు....

మీకు అభ్యంతరం లేకపోతే నా యింటికి వచ్చి పడుకోండి....” అంటూ ఆహ్వానించాడు.

నాటకంలో సెకండ్ పార్ట్ స్టార్ట్ అయిందని గ్రహించి మొఖమాట పడ్డాడు షాడో. “అబ్బే.... మీకు అనవసరమైన శ్రమ.... తెల్లవారగానే వెళ్ళిపోతాం....” అన్నాడు నత్తి మాటలతో.

“అబ్బెబ్బే అలాంటిదేమీ లేదు.... దూరంనుంచి వచ్చిన మీ వంటి అమాయకులకు ఆతిథ్యం యిచ్చిన తృప్తి నాకు మిగులుతుంది. కమాన్.” అంటూ చేయి పట్టుకొని లాగాడు.

అంతకు ముందే నిద్రలేచి అక్కడ జరుగుతున్న నాటకాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నాడు గంగారాం.

“ఏమిటి గురూ ? ఏమయింది ? ?” అంటూ లేచి కూర్చున్నాడు అప్పుడే లేచినట్లు ఆవలిస్తూ.

జరిగిన దంతా చెప్పి, అతనితోపాటు వృద్ధుడి వెనుక బయలుదేరాడు షాడో. రెండు సందుల్ని తిప్పి, మూడో సందులో ఒక పెద్ద మేడలోకి వారిని తీసుకు పోయాడు వృద్ధుడు.

“రెండు నిముషాల్లో చక్కటి కాఫీని తయారుచేయిస్తాను. ఆ తరువాత హాయిగా నిద్ర పోదురుగాని....” అంటూ వారిని ఒక బెడ్ రూమ్‌లో వదిలి పక్క గదిలోకి పోయాడు.

"నువ్వు లక్ష రూపాయలు ఇచ్చినా సరే, నేను వీడిని పొరపాటున కూడా నమ్మను" ఉన్నట్లుండి ఎనౌన్స్ చేశాడు గంగారాం.

"ఎందుకని నమ్మవు ?" చిరునవ్వుతో అడిగాడు షాడో.

"వీడి పెదవులు నవ్వుతున్నాయిగాని, ఆ నవ్వు కళ్ళల్లో కనపడటం లేదు. మనసులో ఒక మాట పెట్టుకొని బయటికి మరొక మాట చెపుతున్నాడు. వీడు వట్టి లఫూట్ నెంబర్ వన్."

గంగారాం సంగతి తెలిసికూడా అతని సునిశిత పరిశీలనా శక్తికి ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాడు షాడో.

"ఆల్‌రైట్ గంగూ.... నువ్వు నిద్రపోతుండగా...!" అంటూ అసలు విషయాన్ని చెప్పటానికి వుద్యుక్తుడైనాడు. అంతలోనే రెండు కాఫీ కప్పుల్ని ట్రేలో పెట్టుకొని గదిలోకి వచ్చాడు వృద్ధుడు.

ఒక కప్పును అందుకొని నోటిదగ్గర పెట్టుకున్నాడు షాడో. వెంటనే అతని నాశికా రంధ్రాలకు సోకిందొక అస్పష్టమైన వెగటు వాసన. కప్పును పెదవుల దగ్గిరినించి తీయకుండా గంగారాం వైపు చూశాడు. కప్పుమీద చెక్కివున్న డిజైన్లను సీరియస్‌గా చూసేస్తున్నాడతను. పరాయి ప్రదేశంలో అపరిచితులు యిచ్చిన ఆహార పదార్థాలనుగాని, పానీయాలను గాని ముందుగా ముట్టుకోవటం గంగారాంకి అలవాటు లేదు. షాడో గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. ఇచ్చేవరకూ బుద్ధదేవుడిలా అలాగే డిజైన్లను డికాషన్ చిక్కదనాన్ని సీరియస్‌గా చూస్తూ కూర్చుంటాడు.

"కాఫీ ఎలావుంది గంగూ ? బాగుందా ?" చేతిలోని కప్పును క్రింద పెట్టేస్తూ అడిగాడు షాడో.

పూనకం వచ్చిన వాడిలా పళ్ళు కొరుకుతూ చేతిలోని కప్పును నేలకేసి బాదాడు గంగారాం. కాఫీలో ఏముందో అర్థం అయిపోయిందతనికి.

"అతిథి మర్యాదలు చేస్తానంటూ తీసుకువచ్చి, హతమార్చటానికి ప్రయత్నిస్తావా దొంగనాయాల! నీలాంటి వాళ్ళని బ్రతకనీయకూడదురా!!" అంటూ బ్రహ్మరాక్షసుడిలా పోయి వృద్ధుడి మెడ పట్టుకున్నాడు.

"ఆగు గంగూ.... ఆగు...." ఆందోళనగా అంటూ అతన్ని వెనక్కి లాగాడు షాడో.

"నువ్వు ఎప్పుడూ యింతే గురూ.... ప్రతిదానికీ ఆగమంటావు. ఆగి ఆగి అదే అలవాటయిపోతోంది. రేపు ఎవరయినా పోలీసు నాయాలు ఎదురై ఆగు అన్నాడంటే, మున్సిపాలిటీ ఎద్దులా ఠక్కున ఆగిపోవాల్సిందే." విసుగ్గా అంటూ వెనక్కి జరిగాడు గంగారాం.

అదే అదనుగా గిరుక్కున వెనుతిరిగి ద్వారం వైపు జంప్ చేశాడు వృద్ధుడు. అతని కంటె వేగంగా కదిలింది షాడో ఎడమ పాదం.

"బాబోయ్!" అని అరిచి గాలిలోకి లేచాడతను. డొక్కల్ని అదుముకుంటూ రెండు పిల్లిమొగ్గలు వేసి క్రింద పడ్డాడు.

"ఆల్‌రైట్ ఓల్డ్‌మాన్! మమ్మల్ని యిక్కడికి ఎందుకు తీసుకు వచ్చావో చెప్పకపోతే నీ ఎముకలు చూర్ణం అయిపోతాయి." దగ్గిరికి పోతూ అడిగాడు షాడో.

"ఇది దారుణమైన అన్యాయం.... పోలీసుల బారినుంచి మిమ్మల్ని రక్షించి తీసుకు వచ్చినందుకు యిలా బాధ పెట్టటం మీకు బాగుందా ?" కీచుగా అన్నాడతను.

లాగి పెట్టి తన్నాడు షాడో.

ఇంకోసారి గాలిలోకి లేచి గిలగిలా కొట్టుకుంటూ క్రింద పడ్డాడు వృద్ధుడు. కళ్ళు తేలవేసి తల ప్రక్కకు వాల్చేశాడు.

"నిన్ను అంత తేలిగ్గా వదిలి పెడతామని అనుకుంటున్నావా దొంగ రాస్కెల్.... మేము భారతదేశం నుంచి వచ్చాముారా.... నీలాంటి వాళ్ళని మా దేశంలో చాలా మందిని చూశాము." అంటూ అటూ యిటూ చూసి, ఆ గది మూలన వున్న నీళ్ళ బిందె నొకదాన్ని తెచ్చి అతని తల మీద కుమ్మరించాడు గంగారాం.

గజగజ వణుకుతూ కనులు తెరిచాడు వృద్ధుడు.

"నన్నేమీ చేయకండి.... మీకు దణ్ణం పెడతాను. మత్తు మందు యిచ్చి మీ దగ్గిర వున్న డబ్బును దోచుకుందామని తీసుకువచ్చాను. నన్ను నమ్మండి." అంటూ వేడుకున్నాడు చేతులు జోడించి.

"నథింగ్ డూయింగ్.... నీ మాటలు నేను నమ్మను. మర్యాదగా నిజం చెప్పక పోతే రామకీర్తన పాడుతుంది నీ బుర్ర." అంటూ ఖాళీ బిందెను ఎత్తి అతని తల మీద మోదబోయాడు గంగారాం.

చటుక్కున అతని చేయి పట్టుకొని ఆపేశాడు షాడో.

"కమాన్ గంగూ.... మనం యిక్కడ యింకొక్క క్షణం కూడా వుండకూడదు... సమ్ థింగ్ యీజ్ రాంగ్ హియర్." అంటూ వెనుతిరిగి ద్వారం వైపు పరుగు తీశాడు.

అటూ యిటూ చూసి బిందెతో వృద్ధుడి నెత్తి మీద ఠపీమని కొట్టాడు గంగారాం.

"నిన్ను వదిలేశామని సంబర పడకు.... వీలు చూసుకొని తిరిగి వస్తాము. ఈ సారి నీ అంతు చూసి పోతాము...." అని హెచ్చరిస్తూ షాడోని అనుసరించాడు.

వేగంగా పరుగుతీసి ముందు గదిలోకి అడుగుపెట్టాడు షాడో. ముఖ ద్వారం వైపు తిరగబోతూ అదిరిపడి వెనక్కి దూకేశాడు.

ఓరగా వేసివున్న తలుపుల్ని తెరుచుకొని లోపలికి వస్తున్నారు అనేకమంది దృఢకాయులు. షాడోని చూడగానే కలసికట్టుగా ముందుకు జంప్ చేశారు.

"ఏమిటి గురూ ? ఎందుకలా వెనక్కి దూకుతున్నావ్ ?" అని అడుగుతూ షాడో వెనకాలే వస్తున్న గంగారాం, రెండో ఆలోచన లేకుండా వేగంతో రియాక్ట్ అయినాడు.

ఎడమపాదంతో నేలను తన్ని చెవులు చిల్లులు పడేలా అరుస్తూ చేతిలోనే వున్న బిందెను ముందుకు విసిరేశాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి, ముఖద్వారం ప్రక్కనే వున్న ఎలక్ట్రిక్ మెయిన్‌కి తగిలింది ఆ బిందె.

ఫట్‌మని శబ్దం చేస్తూ పగిలింది మెయిన్. నీలం రంగు మంటల్ని వెలువరుస్తూ మాడిపోయాయి అందులోని ఫ్యూజులు. అంతవరకూ ప్రకాశవంతంగా వెలుగుతున్న ఆ ఇంటిలోని దీపాలన్నీ గప్పున ఆరిపోయాయి.

"పట్టుకోండి.... ఆ దుర్మార్గుల్ని పట్టుకోండి...." అని అరుస్తూ అలాగే ముందుకు దూకాడతను.

కన్‌ఫ్యూజ్ అయిపోయారు దృఢకాయులు. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని ఆ కటిక చీకటిలో ఒకరి నొకరు తోసుకుంటూ, చెల్లాచెదరు అయినారు.

"టార్చిలైటు వెలిగించండిరా గుడ్డి నాయాళ్ళలార... దీపాలు పోతే ఏం చేయాలో తెలియని వెధవలు మీరు.... మమ్మల్ని ఇంకేం పట్టుకుంటారు ?" అంటూ వారి మధ్యలో నుంచి దూసుకుపోయి ముఖద్వారాన్ని దాటాడు గంగారాం. అడ్డు వచ్చిన యిద్దరు దృఢకాయుల్ని మెడల మీద గుద్ది అతన్ని అనుసరించాడు షాడో.

ఇంటి ముందున్న వీధి దీపం వారి గుట్టును రట్టు చేసేసింది. గదిలోని చీకటిని భరించలేక బయటికి వచ్చిన యిద్దరు దృఢకాయులు వారిని చూసి బిగ్గరిగా అరిచారు.

ఒకరి కాళ్ళకు ఒకరు అడ్డం పడుతూ ఇంట్లోనుంచి బయటికి పరిగెత్తుకు వచ్చారు మిగిలిన వారందరూ.

ఉన్నట్లుండి మారి పోయింది వారి స్లోగన్!

"దొంగలు.... దొంగలు.... పట్టుకోండి.... పట్టుకోండి." అని కేకలు పెడుతూ వెంట పడ్డారు.

"కొంప ముంచారు గురూ దొంగ రాస్కెల్స్.... వీళ్ళ అరుపులకు వీధుల్లో వున్న వాళ్ళందరూ లేచి మన వెంట పడతారు.... వెంటనే ఎక్కడో ఒకచోట తల దాచుకోక పోతే లాభం లేదు...." అంటూ ఆ సందును దాటి విశాలంగా వున్న ఒక వీధిలోకి మరలాడు గంగారాం.

వీది మధ్యలో ఒక యింటి ముందు నిలబెట్టి వుంది చిన్న కారొకటి. మంచు పడి తడిసి పోకుండా మందపాటి టార్పాలిన్ కప్పి వుంది.

రెండు అంగల్లో దాన్ని సమీపించి టార్పాలిన్‌ని అవతలికి విసిరేశాడు షాడో. బోనెట్ ఎత్తి ఇంజన్‌లో తలదూర్చాడు.

వింటినుంచి వెలువడిన బాణంలా మరో పదిగజాల దూరం పోయాడు గంగారాం. రోడ్డు ప్రక్కనే కనిపించిన బస్ షెల్టర్‌లోకి దూకి, సిమెంట్ బెంచి మీద ముడుచుకు కూర్చున్నాడు.

అతను వూహించినట్లే దృఢకాయుల అరుపులకు ఆ చుట్టు పట్ల నివశిస్తున్న పౌరులందరూ నిద్రలు లేచారు. పెద్ద పెద్ద టార్చిలైట్లను పట్టుకొని వీధుల్లో పరుగులు ప్రారంభించారు.

"హేయ్! ఎవరు నువ్వు ?" ఇంజన్‌లో తలపెట్టి మరలన్నిటినీ కెలుకుతున్న షాడోని గద్దించాడు ఒక పౌరుడు.

"కళ్ళు మూసుకు పోయాయా ? కనిపించటం లేదా ? ?" తల బయటికి తీయకుండానే కరుకుగా సమాధానం యిచ్చాడు షాడో.

బిత్తర పోయాడు ఆ పౌరుడు. అతన్ని ప్రశ్నించే ఆలోచనను మానుకొని వీధి చివరికి పరుగు తీశాడు.

"ఎవడ్రా నువ్వు ? ఇక్కడ ఏం చేస్తున్నావ్ ?" ముడుచుకు కూర్చున్న గంగారాం వైపు అనుమానంగా చూస్తూ అడిగాడు ఒక దృఢకాయుడు.

బద్ధకంగా ఆవలించి, కుడి చేతిని బస్ షెల్టర్ బయటికి చాచాడు గంగారాం.

"నిన్న పొద్దుటినుంచీ తినటానికి ఏమీ దొరకలేదు. ధర్మ ప్రభువులు ఏమైనా దానం చేస్తే కడుపు నింపుకుంటాను...." అన్నాడు.

అసహ్యంగా చూస్తూ అవతలికి పరుగు తీశాడు దృఢకాయుడు. ఐదు నిముషాల తరువాత ప్రక్క వీధిలోకి వెళ్ళిపోయాయి అరుపులు.

మరో పది నిముషాలపాటు అలాగే కదలకుండా కూర్చుని, మెల్లిగా లేచి నిలబడ్డాడు గంగారాం. షెల్టర్‌లో నుంచి బయటికి వస్తుండగా అతనికి కనిపించాడు వృద్ధుడు.

నీళ్ళు బిందె కుమ్మరించటంవల్ల తడిసిపోయిన దుస్తుల్ని మార్చుకోకుండా, ఎవరో వెంటపడి తరుముతున్నట్లు పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వస్తున్నాడతను.

ముందుకు వేసిన పాదాన్ని వెనక్కి లాక్కుని నీడల్లో వదిగిపోయాడు గంగారాం. అతను షెల్టర్‌ని దాటి వీధి చివరికి పోగానే బయటికి వచ్చి షాడోకి సైగ చేశాడు.

"అనుకోకుండా దొరికిన అవకాశం యిది.... ఎక్కడికో పోతున్నాడు ఈ దొంగనాయాలు.... మనం కూడా వీడి వెనకాలే పోయి వింత చూద్దాం." అని సజెస్ట్ చేశాడు.

చేతులకు అంటిన ఆయిల్‌ని క్రింద వున్న టార్పాలిన్‌కి తుడుస్తూ తల వూపాడు షాడో. పాంటు జేబులో వున్న సిగిరెట్ పాకెట్‌లో నుంచి సిగరెట్ తీసి వెలిగించుకుంటూ వీధి చివరికి బయలుదేరాడు.

ఎక్కడా ఆగకుండా వేగంగా అడుగులు వేశాడు వృద్ధుడు. సిటీ లిమిట్స్‌ని దాటి తెల్లవారే సమయానికి ఒక పెద్ద మల్బరీ ఎస్టేట్‌ని చేరుకున్నాడు.

ఆరు అడుగుల ఎత్తున కట్టబడిన ప్రహరిగోడ ఆ ఎస్టేట్ చుట్టూ వుంది. ముందు భాగంలో వున్న ఐరన్ గేటును దాటి లోపలికి వెళ్ళిపోయాడు వృద్ధుడు.

"వెలుగు వచ్చేలోగా మనం కూడా లోపలికి పోదాం గురూ.... మల్బరీ చెట్లమధ్య తిరిగి చాలాకాలం అయింది" అంటూ గేటుకు వంద గజాల దూరంలో నిలబడి ప్రహరీ మీద చేయి వేయబోయాడు గంగారాం.

చటుక్కున చేయి ఎత్తి అతని భుజంమీద బలంగా చరిచాడు షాడో. కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడి చేతిని వెనక్కు లాక్కున్నాడు గంగారాం.

"మనం వున్నది ఇండియాలో కాదు.... ఇక్కడ సెక్యూరిటీ ఏర్పాట్లు చాలా దారుణంగా వుంటాయి. వెనుకా ముందు చూసుకోకుండా గోడమీద చేయివేస్తే ప్రాణాలమీదికి వస్తుంది...." అంటూ అతను చేయి వేయబోయిన ప్రదేశాన్ని చూపించాడు షాడో.

అతను కొట్టిన చోట అరచేత్తో రుద్దుకుంటూ అటు చూశాడు గంగారాం. చూసిన వెంటనే ఎండుకుపోయింది గొంతు.

ప్రహరీగోడ పైభాగంలో పెద్ద పెద్ద రంధ్రాలున్నాయి. వాటిల్లో నుంచి తలలు బయటికి పెట్టి మిర్రి మిర్రి చూస్తున్నాయి అరచేయి వెడల్పున్న మండ్రగబ్బలు.

"అయ్యబాబోయ్! వీటిని దాటి లోపలికి పోవటం ఎలా గురూ ? హైజంప్ చేయటం కంటె వేరే మార్గం లేదా ?" ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో తడి చేసుకుంటూ అడిగాడు.

తల అడ్డం తిప్పి ప్రక్కకు జరిగాడు షాడో.

కెండో సిస్టమ్‌లో సెక్యూరిటీ అరేంజి చేయబడి వుంది ఆ ఎస్టేట్‌కి. గోడ మీద మండ్రగబ్బలే కాదు, గోడ వెనుక నేల మీదా, ఆ నేల మీద పెరిగే చెట్టు చేమల మీదా పొంచి వుంటాయి రకరకాల ప్రమాదాలు. వాటిని అధిగమించటానికి ప్రత్యేకమైన పద్ధతులున్నాయి. అన్నిటి కంటె ముందుగా, ఆ అరేంజ్‌మెంట్‌లో ఏదైనా బలహీనత వుందేమో కనిపెట్టాలి. అది కనిపెట్టలేకపోతే ప్రహరీగోడకు ఒక నమస్కారం చేసి వెనుతిరిగి పోవటం చాలా వుత్తమం. కాదు కూడదని మొండిగా ముందుకు పోతే ప్రాణాలు కోల్పోవటం తథ్యం.

చేయి వేస్తే జారిపోయేటంత నునుపుగా వుంది ప్రహరీ గోడ. ఆ నునుపుదనం మీద కాళ్ళకు పట్టు చిక్కక, క్రిందికి దిగే ఆలోచనను విరమించుకొని, గోడమీదే కాపురం చేస్తున్నాయి మండ్రగబ్బలు.

చూపుల్ని గోడ మీదినుంచి తిప్పకుండా, వేగంగా ఎస్టేట్ వెనుక భాగంలోకి పోయాడు షాడో.

"ఇంకో అరగంటలో వెలుగు వచ్చేస్తుంది.... ఎవరైనా మనల్ని గమనించారంటే వీపులు విమానం మోత ఎక్కిపోతాయి. వెనక్కి వెళ్ళిపోదాం పద గురూ." తూర్పు దిశకేసి చూస్తూ హెచ్చరించాడు గంగారాం.

"జస్ట్.... గివ్ మీ అనదర్ ఫైవ్ మినిట్స్ గంగూ.... ఇంకొక్క ఐదు నిముషాలు చాలు" అంటూ ప్రహరీ గోడ వెంబడే మరో పది గజాల దూరం పోయి, వున్నట్లుండి ఆగిపోయాడు షాడో.

వర్షాలు ఎక్కువగా కురవటం వల్ల కాబోలు అక్కడ నేలలోకి కుంగింది గోడ. పట్టు తప్పి ప్రక్కకు జరిగిన కొండరాళ్ళల్లో జానెడు వెడల్పున కనిపిస్తోంది పెద్ద పగులు.

పైన వుండే మండ్రగబ్బలు ఆ పగులును ఆధారంగా చేసుకొని క్రిందికి పారిపోకుండా, ఏదో ఆకుపసరును పగులు అటూ యిటూ పూశారు ఎస్టేట్ యజమానులు. ఆ పసరు వాసనకు బెదిరి, గజం మేర గోడను ఖాళీచేశాయి మండ్రగబ్బలు.

గిరుక్కున వెనుతిరిగి, దూరంలో కనిపిస్తున్న ముళ్ళ పొదలవైపు పరుగుతీశాడు షాడో. పదినిముషాలు ఆ పొదల్లోనే తిరిగి, రకరకాల మొక్కల్ని, రాళ్ళని ముళ్ళచెట్ల కొమ్మల్ని సేకరించాడు.

"ఈ చెత్తంతా మనకు దేనికి గురూ ? ఎవరైనా చూస్తే మేకల్ని గొర్రెల్ని మేపుకోవటానికి వచ్చామనుకుంటారు...." అది చూసి విసుగ్గా అంటున్న గంగారాం నెత్తి మీద ఠపీమని ఒకటి వేశాడు.

"ఏదైనా జంతువు దొరికితే చాలా బాగుంటుంది గంగూ.... గోదురుకప్ప లభించినా చాలు" అంటూ పొదలన్నిటినీ మరోసారి గాలించటం మొదలుపెట్టాడు.

"అర్థరాత్రి కాడ అంకమ్మ శివాలన్నట్లు ఈ సమయంలో మన ముఖాలకి ఆ కప్పలు కూడా కనిపించవు...." తనలో తను గొణుక్కుంటూ పొదలో దూరాడు గంగారాం. ఐదు నిముషాల తరువాత హడావుడిగా ప్రత్యక్షం అయ్యాడు షాడో

ముందు. తెల్లగా మెరిసిపోతున్న చెవుల పిల్లి ఒకటి అతని చేతుల్లోనుంచి జారి పోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది.

"శహబాష్ గంగూ.... నేను కావాలని అనుకుంటున్న జీవాన్నే తీసుకొచ్చావ్...." అంటూ దాన్ని అందుకొని వేగంగా గోడ దగ్గరికి వచ్చాడు షాడో.

వెంట తెచ్చిన ముళ్ళ మండల్ని, రకరకాల మొక్కల్ని పగులులో యిరికించి, వాటి మీదుగా గోడ ఎక్కి అవతలి వైపు దిగాడు.

దిగిన మరుక్షణం మెలికలు తిరుగుతూ తలలు ఎత్తి అతని వైపు చూశాయి రెండు జపాన్ వైపర్స్. గోడకు రెండు అడుగుల దూరంలో పెద్ద పూల కుండీ మీద పడుకొని వున్నాయవి.

ఎడమ చేతిలో రెడీగా పట్టుకున్న ఆరడుగుల ముళ్ళకర్రను వాటివైపు జాచాడు షాడో. చివరి భాగంలో రెండుగా చీలి వుంది ఆ కర్ర. తలలు ఎత్తిన వైపర్స్ రెండింటినీ నేర్పుగా ఆ చీలికలో చిక్కించుకొని, బలంగా విశిరేశాడు అవతలికి.

భీకరంగా బుసలు కొడుతూ, మోకాలెత్తున పెరిగి వున్న పచ్చగడ్డిలో పడ్డాయవి. పడిన మరుక్షణం వినవచ్చింది ఫట్ మనే శబ్దం. వెంటనే ఆగి పోయింది వాటి బుస.

"ఏమయింది గురూ ? పాపం బుస పెట్టటం మానేసి బుద్ధిగా అవతలికి వెళ్ళి పోయాయా ?" ఆశ్చర్యంగా అడిగాడు అప్పుడే గోడ దిగి, అతని వెనుక నిలబడిన గంగారాం.

ముళ్ళ కర్రను రెడీగా పట్టుకొని, అడుగులో అడుగు వేస్తూ, పాములు పడిన ప్రదేశంలోకి పోయాడు షాడో.

పచ్చిగడ్డి మాటున కనిపించింది నీట్‌గా నిలబెట్టి వున్న పెద్ద కత్తెర బోను. అందులో పడి రెండుగా తెగి వున్నాయి పాముల తలలు.

"అడుగు అడుగుకూ అరడజను వుంటాయి ఇటువంటి బోనులు. వళ్ళు దగ్గిర పెట్టుకొని నడవక పోతే పాములకు పట్టిన గతే మన పాదాలకు కూడా పడుతుంది...." అంటూ ముందుకు అడుగు వేశాడు షాడో.

పది అడుగుల దూరం అతని మాటను అక్షరాలా అనుసరించాడు గంగారాం. ఆ తరువాత కుతూహలాన్ని అణుచుకోలేక, ఒక అడుగు ప్రక్కకు వేశాడు.

జర్రున జారి పోయింది అతని పాదాల క్రింద వున్న నేల.

"అయ్యబాబోయ్! నా పని అయిపోయింది!!" అంటూ నడుముల దాకా ఒక గోతిలోకి దిగి పోయాడు.

మెరుపులా వెనక్కి తిరిగాడు షాడో. ఒక చేత్తో అతని నోటిని గట్టిగా మూసి, రెండవ చేత్తో భుజాలు పట్టుకొని పైకి లాగేశాడు.

అప్పటికే గంగారాం వంటిని పట్టేసుకున్నాయి తేళ్ళవంటి ఎర్రని కరెంట్ చీమలు. మంటల్లో నిలబడినట్లు బాధపడుతూ వాటన్నిటినీ వదిలించుకున్నాడు అతను.

"నీ అదృష్టం బాగుంది. అవే తేళ్లో, తుట్టె పురుగులో అయివుంటే ఈ పాటికి టిక్కెట్ పుచ్చుకుంటూ వుండే వాడివి.... బ్లడీ యిడియట్.... చెప్పిన మాటను చెప్పినట్లు వినటం నీకు ఈ జన్మలో అలవాటు కాదు." అంటూ అతన్ని ముందుకు నెట్టి, చంకలో యిరికించుకొని వున్న చెవుల పిల్లిని, దారి ప్రక్కన ఏర్పడిన గోతిలోకి విసిరాడు షాడో.

గంగారాం చేయి పట్టుకొని పరుగులాంటి నడకతో, అక్కడికి సమీపంలో వున్న పెద్ద పూపొద చాటుకు పోయాడు.

"ఇలా నిముషానికి ఒకసారి మకాం వేస్తుంటే యిక్కడే తెల్లారి పోతుంది.... తెల్లారిపోయిన మరుక్షణం మన బండారం బయటపడి పోతుంది." అనబోతూ, ఆ మాటల్ని నోటిలోనే దాచేసుకున్నాడు గంగారాం.

పూపొద మధ్యలో కొమ్మ కొమ్మకీ కనిపిస్తున్నాయి పెద్ద పెద్ద కందిరీగల గూళ్ళు. కొమ్మల్ని కదిలిస్తే చాలు- మీదికి వచ్చి ప్రాణాలు తీస్తాయవి.

వాటిని చూసి నోరు మూసుకోలేదతను. వాటి మధ్యలో నుంచి కనిపించారు నలుగురు దృఢకాయులు. పొడుగాటి టార్చిలైట్లను పట్టుకొని అడుగులు తూచి తూచి వేస్తూ వస్తున్నారు వాళ్ళు.

"మనం ఒసాకా పట్టణంలో షికార్లు చేస్తున్నామనుకొని అరిచి కేకలు పెడితే - యిదిగో యిలాగే వుంటుంది...." వారిని చూస్తూ లోగొంతుకతో గంగారాంని మందలించాడు షాడో.

తన అరుపు ఎంత పని చేసిందో గ్రహించి, మౌనంగా వుండి పోయాడతను. నోరు తెరిచి సమాధానం యివ్వలేదు.

సూటిగా వచ్చి గంగారాం పడిన గోతి దగ్గిర ఆగిపోయారు ఆ దృఢకాయులు.

మనిషి మాదిరిగానే గురక పెడుతోంది చెవుల పిల్లి, గోతిలో వున్న చీమల బాధకు తట్టుకోలేక ఎగిరెగిరి పడుతోంది.

"పగులులో నుంచి పారిపోయి వచ్చి యిందులో చిక్కుపడింది. దీని గురకల్నే మనిషి అరుపుగా భావించి వచ్చాం.... పదండి.... పదండి...." అంటూ వెనుతిరిగాడు ఒక దృఢకాయుడు.

రెండు క్షణాల పాటు చెవుల పిల్లిని దీక్షగా చూసి అతన్ని అనుసరించారు మిగిలిన వారు. బిగపట్టి వుంచిన వూపిరిని తేలికగా వదులుతూ, నీడలా లేచాడు షాడో. నిశబ్దంగా వారిని అనుసరించాడు.

ఏ మాత్రం శబ్దం అయినా వెనుతిరిగి చూస్తారు వాళ్ళు. చూసిన వెంటనే అరిచి అందర్నీ పోగుచేస్తారు. కాళ్ళు చేతులు కట్టేసి దూరంలో కనిపిస్తున్న భవనంలోకి లాక్కుపోతారు.

అయినా సరే.... వెనుకంజ వేయకుండా, వారు నడిచిన బాటలోనే అడుగులు వేశాడు షాడో. తనంతట తను ఒక పట్టాన కనుక్కోలేని సురక్షిత మార్గాన్ని వారి

మూలకంగా కనుక్కొని, పది నిముషాల్లో ఆ పసిరిక ప్రదేశాన్ని దాటి ఒక చెట్టు క్రిందికి చేరుకున్నాడు.

"ఆగి పోయావేం గురూ.... పద పోదాం...." అంటూ అతని ప్రక్క నుంచి ముందుకు అడుగు వేసి, అదిరి పడి వెనక్కి దూకేశాడు గంగారాం.

గడ్డీ గాదం లేకుండా, నీట్‌గా కనిపిస్తోంది నేల.... కాలు వేసిన మరుక్షణం కంటికి కనిపించనంత వేగంతో లోపలికి లాక్కునే భయంకరమైన ఊబి, ఆ నేల క్రింద దాగుకొని వుంది.

ముందు పోయిన దృఢకాయులు ఆ ఊబిని ఎలా దాటగలిగారో ఊహించటానికి ప్రయత్నిస్తూ, జేబులో దాచిన గులక రాళ్ళను బయటికి తీశాడు షాడో.

"గోలీలు ఆడుతూ కూర్చుంటే పుణ్యకాలం గడిచిపోతుంది. వెలుగు వచ్చేసింది చూడు..." ఖంగారుగా అన్నాడు గంగారాం.

ఆ మాటల్ని వినిపించుకోనట్లే తాపీగా ప్రక్కకు తిరిగి, రెండు రాళ్ళను ముందుకు విసిరాడు షాడో.

బుసబుసలాడుతూ పైకి పొంగింది బురద. పడిన మరుక్షణం మాయమయింది ఒక రాయి. ఒక క్షణం తరువాత మునిగిపోయింది రెండవది.

వెంటనే విశిరాడు షాడో మరో రెండు రాళ్ళను. రెండవ రాయి పడిన ప్రదేశానికి రెండు అడుగుల దూరంలో విడివిడిగా నేలను తాకాయి అవి.

రెండు క్షణాల తరువాత మాయమైపోయింది మొదటిది. మూడు క్షణాలు గడిచినా మునగకుండా అలాగే నిలిచి వుంది రెండవది.

గంగారాం చేయి పట్టుకొని అది నిలబడిన ప్రదేశంలో అడుగులు వేస్తూ ఊబిని దాటాడు షాడో.

ఎత్తయిన మల్బరీ చెట్లతో నిండి వుంది ఊబి అవతల వున్న ప్రదేశమంతా. తెల్లబడుతున్న తూర్పు దిక్కును చూస్తి రెక్కలు తపతపకొడుతూ కిలకిలా రావాలు చేస్తున్నా యి ఆ చెట్లమీది పక్షులు.

వాటిని గమనించిన మరుక్షణం ముందుకు పోయే ఆలోచనను విరమించుకొని ఎక్కడి వాడక్కడే ఆగిపోయాడు షాడో.

కెండో సెక్యూరిటీ అరెంజ్‌మెంట్‌లో అల్టిమేట్ ఆయుధం ఒకటి వుంది. అపరిచితుల ఉనికిని గ్రహించి గోల చేసే పక్షుల్ని తెచ్చి మచ్చిక చేస్తారు. ఖచ్చితమైన ట్రయినింగ్ యిచ్చి చెట్లమీద వదులుతారు. అర్ధరాత్రి సమయంలో అడుగులు ఎత్తి ఎత్తి వేస్తూ వచ్చినా సరే.... పసి కట్టేస్తాయవి.... ప్రాణాలు కడబట్టేదాకా అరిచి అందర్నీ హెచ్చరించేస్తాయి.

"అనవసరమైన అనుమానాలతో టైమ్ వేస్ట్ చేయటం దేనికి గురూ ? ఇంత దూరం వచ్చి యిప్పుడు వెనక్కి తిరగటం నాకు నచ్చలేదు...." అతని అనుమానాల్ని గమనించి లోగొంతుకతో అన్నాడు గంగారాం.

గుండెల నిండా గాలి పీల్చుకొని ముందుకు కదిలాడు షాడో. వందగజాల దూరం పోయేదాకా వారిని శ్రద్ధగా పరికించి చూశాయి కొమ్మలమీద కూర్చున్న పక్షులు. ఆ తరువాత పట్టించుకోవటం మానేశాయి.

"ప్రతి చిన్న విషయానికి ఖంగారు పడి, నన్ను కూడా ఖంగారు పెట్టేయటం యీ మధ్య నీకు బాగా అలవాటయి పోయింది. మనల్ని పట్టిచ్చే పక్షులు ఏవీ ? ఎక్కడా కనిపించవేం ?" నడుము మీద చేతులు వేసుకొని ఠీవిగా నడుస్తూ అన్నాడు గంగారాం.

అతను ఆ మాట అనటం - ఎదురుగా వున్న ఒక చెట్టుమీది నుంచి గోలగోలగా అరుస్తూ రెండు పాల పిట్టలు గాలిలోకి లేవటం ఒకేసారి జరిగింది.

అదిరి పడి వెనక్కి దూకాడు షాడో.

"కమాన్ గంగూ.... లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్...." అంటూ ప్రక్కకు తిరిగి బాణంలా ఊబి నేల వైపు పరుగు తీశాడు.

పాలపిట్టల అరుపులతో దద్దరిల్లి పోసాగింది ఆ ప్రదేశమంతా. ఉన్నట్లుండి వాటితో జతకలిసాయి మిగిలిన పక్షులు. ఎక్కడి నుంచో రివ్వు రివ్వున వచ్చాయి రెండు డేగలు.... ఫెడీమని షాడో ముఖం తన్నింది ఒకటి. పడుతూ లేస్తూ అతన్ని అనుసరిస్తున్న గంగారాం తలను గాయపరిచింది రెండవది.

"ఓసి నీ దుంపతెగ! లాగిపెట్టి కొడితే మంచినీళ్లు అడగటం చేతకాని అర్భక పక్షివి.... నన్నే తల మీద తంతావా!! చూడు నిన్నేం చేస్తానో!!!" అంటూ పాంటు బెల్టును వూడలాగి దాని మీదికి విసిరాడు గంగారాం.

అటువంటి సిచ్యుయేషన్స్‌లో ఎలా ప్రవర్తించాలో ట్రయినింగ్ పొందివున్న తెలివైన పక్షి అది. బెల్ట్ దెబ్బకు గింగిరాలు తిరుగుతూ నేలమీదపడినట్లే పడి రివ్వున గాలిలోకి లేచింది. దానితో పాటు ముందుకు దూకిన గంగారాం పాదాలకు అనుకోకుండా అడ్డం పడింది ఎత్తుగా పెరిగిన ఒక చెట్టు వేరు. బాలెన్స్ నిలుపుకోవటం చేతకాక తల్ల క్రిందులుగా పల్టీకొట్టి పడి పోయాడతను.

"మైగాడ్.... గెటప్ యూ బ్లడీ ఫూల్... గెటప్...." కోపంగా అంటూ అతని చేయి పట్టుకొని పైకి లాగాడు షాడో.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. బాణాకర్రలను గాలిలోకి ఎత్తి పట్టుకొని వారిని చుట్టుముట్టారు అనేకమంది దృఢకాయులు.

పిడికిళ్ళు బిగించి వారిని ఎదుర్కొనే అవకాశం షాడోకి లభించలేదు.

"కొట్టండి.... తలలు పగిలిపోయేటట్లు కొట్టండి...." అని అరుస్తూ కలసి కట్టుగా బాణాకర్రల్ని అతని మీదికి దించారు వారందరూ.

దెబ్బ మీద దెబ్బగా పది దెబ్బలు పడేదాకా ఓర్చుకున్నాడు షాడో. అవకాశం దొరికితే ఒక కర్రను వూడలాగుకొని వారందరినీ చెల్లాచెదరు చేద్దామని

అనుకున్నాడు. ఆ అవకాశం లభించకముందే కనుల ముందు ప్రత్యక్షం అయినాయి నల్లటి సిల్క్ పరదాలు. అతనికి తెలియకుండానే స్పృహతప్పి వాలిపోయాడు.

## 13

"చూస్తారేం ? ముఖం మీద నీళ్ళు కొట్టి కళ్ళు తెరిపించండి...." ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞయిచ్చింది సుమీ ఇవాటో.

వెంటనే కదిలారు నలుగురు దృఢకాయులు. నాలుగు బక్కెట్ల నిండా చల్లని నీరు తెచ్చి షాడో ముఖం మీదా, గంగారాం ముఖం మీదా కుమ్మరించారు.

ఊపిరి అందక ఉక్కిరి అవుతూ కనులు తెరిచారు వారిద్దరూ. ఒక్క క్షణం పాటు తాము ఎక్కడ వున్నదీ అర్థం కాక అయోమయంగా చుట్టూ చూశారు.

"మీ అభినయం కట్టిపెట్టి నా ప్రశ్నలకు సమాధానాలు యివ్వండి.... ఎవరు మీరు ? ఇక్కడికి ఎందుకు వచ్చారు ?" వెంటనే ప్రశ్నించింది సుమీ ఇవాటో.

ఆ మాటతో తలను ఆవరించుకొని వున్న మత్తు పూర్తిగా విడిపోయి ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో.

విశాలమైన ఒక గదిలో నిలబడి వున్నారు అతను, గంగారాం. కాళ్ళు కదలకుండా ఇనుప తీగెలతో బంధింపబడి వున్నాయి. చేతులకు బలమైన గొలుసులు కట్టి పట్టుకొని వున్నారు కొందరు దృఢకాయులు.

పాల రాతిలో మలిచినట్లు కనులు మిరుమిట్లు గొలిపే అందాలరాశి ఒకామె ఎదురుగా ఒక కుర్చీలో కూర్చుని వుంది. వినయంగా చేతులు కట్టుకొని ఆమె వెనుక నిలబడి వున్నారు మరి కొందరు దృఢకాయులు.

“అడిగిన ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా ఏమిటలా నోరు తెరుచుకొని చూస్తావ్ ?” కంచు గంట మాదిరి ఖంగుమంది ఆ సుందరి కంఠం.

ఉలిక్కి పడి నోరు విప్పాడు షాడో.

“ఆకలి బాధను భరించలేక పట్టణంలో దొంగతనం చేస్తుండగా పోలీసులు వెంట పడ్డారు. పారిపోయి వస్తూ మీ ఎస్టేట్‌ని చూశాం. మరో ప్రయత్నం చేద్దామని లోపలికి అడుగు పెట్టగానే మీ మనుష్యులు వెంటపడి పట్టుకున్నారు.” తడుముకోకుండా చెప్పేశాడు.

రెండు క్షణాల పాటు అతని ముఖంలోకే చూసి, చేయి వూపిందా సుందరి.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో వచ్చి షాడో మీద కలబడ్డారు నలుగురు దృఢకాయులు. ఊపిరి పీల్చుకునే వ్యవధి కూడా యివ్వకుండా పిడికిటి పోట్లతో నలగ పొడిచి వెనక్కి జరిగారు.

పలుగులతో కుమ్మినట్లు బాధ పడుతూ మోకాళ్ళ మీదికి వాలిపోయాడు షాడో.

“కెండో సెక్యూరిటీ సిస్టమ్ నిండి వున్న ఈ ఎస్టేట్ లోకి సామాన్యమైన దొంగలు పొరపాటున కూడా అడుగు పెట్టలేరు. మీరు దొంగలు కారు. మర్యాదగా

నిజం చెప్పకపోతే చాలా బాధలు అనుభవించాల్సి వుంటుంది." నాజూకుగా వున్న చేతుల్ని, చేతి వేళ్ళకున్న ఉంగరాల్ని చూసుకుంటూ అన్నది ఆ సుందరి.

"కరెక్ట్ మేడమ్.... మా వాడు చెప్పిన మాటలు అబద్ధాల పుట్టలని తేలికగా కనిపెట్టేసిన మీ అసమాన్యమైన మేధస్సుకు నేను జోహారు చేస్తున్నాను. అసలు విషయం చెప్పటానికి మా వాడు అనవసరంగా భయపడుతున్నాడు." వెంటనే కలుగజేసుకున్నాడు, అంత వరకూ మౌనంగా వున్న గంగారాం.

"ఏమిటి ఆ అసలు విషయం ?" నొసలు ముడివేస్తూ, అతని వైపు తిరిగింది ఆ సుందరి.

"వారం రోజులనుంచీ సరయిన తిండి లేక అలమటించి పోతోంది మా ఆవుదూడ. దాని బాధను చూడలేక పచ్చిగడ్డి కోసం మీ ఎస్టేట్ లోకి అడుగుపెట్టాం. ఈ ఒక్కసారికి క్షమించి వదిలేస్తే, యింకెప్పుడూ యిటువైపు రాము" సీరియస్‌గా ముఖం పెట్టి కనురెప్ప కూడా కదిలించకుండా అన్నాడు గంగారాం.

పట్టరాని కోపంతో పళ్లు కొరుకుతూ కుర్చీలో నుంచి లేచింది సుమీ ఇవాటో.

"అడిగిన ప్రశ్నను వదిలేసి ఆకతాయితనంగా సమాధానం ఇస్తున్న ఈ దుర్మార్గుడిని చితక కొట్టండి.... చేతులు జోడించి వేడుకునే దాకా విరగబాదండి...." ఆవేశంతో వణికిపోతూ ఆజ్ఞలు జారీ చేసింది.

కట్టు కట్టుకొని గంగారాంని కమ్ముకున్నారు దృఢకాయులు. పిడికిటి పోట్లతో క్రిందికి నెట్టి, బూటు కాళ్ళతో లాగి లాగి తన్నటం మొదలు పెట్టారు.

ఇనుప గొలుసులు అడ్డురాగా, చేతులతో తలను కాచుకునే అవకాశం కూడా లేక, నిస్సహాయంగా నేలమీద పొర్లిగింతలు పెట్టసాగాడు గంగారాం. ప్రాణాలు పోయేటంత బాధనుకూడా పెదవి కదిలించకుండా భరిస్తున్నాడు.

"కొట్టండి.... అరిచి కేకలు పెట్టేదాకా విరగతీయండి...." వెనుక నుంచి దృఢకాయుల్ని హెచ్చరించింది సుమీ ఇవాటో.

ఆ పైన ఆగలేక పోయాడు షాడో. పట్టరాని ఆవేశంతో పట పట మని శబ్దం చేస్తూ పైకి ఉబికాయి అతని శరీరంలోని కండరాలన్నీ. విపరీతమైన క్రోధంతో చింతనిప్పుల్లా తయారయినాయి కళ్ళు.

"వంటరివాడిని చేసి, కాళ్ళకు చేతులకు సంకెళ్ళు వేసి మీ యిష్టం వచ్చినట్లు హింసిస్తారా ? దమ్ము వుంటే నన్ను ఎదుర్కోండిరా...." అంటూ తన చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్న దృఢకాయుల్ని బర్రున లాగి ముందుకు విసిరేశాడు.

బంధించి వున్న పాదాలతో ఎగిరెగిరి దూకుతూ, చేతులకున్న ఇనుప గొలుసుల్ని గిర్రున తిప్పి ప్రక్కకు విసిరాడు.

కొరడాతో కొట్టినట్లు కెవ్వున అరిచి అడ్డంగా పడిపోయారు ఆరుగురు దృఢకాయులు. కీచుగా అరిచి వెనక్కి దూకారు మిగిలిన వారందరూ.

"బుద్ధిహీనుల్లారా.... యింత మంది వుండి ఒక్క సామాన్యుడిని పట్టుకోలేక పోతున్నారా ? మీ ధైర్య సాహసాలు సముద్రంలో కలిసి పోయాయా ?" కరకరలాడుతున్న కంఠంతో బిగ్గరిగా అరిచింది సుమీ ఇవాటో.

ఇనుప గొలుసుల్ని గిర్రున తిప్పుతూ ఆమె వైపు దూకాడు షాడో. ఆవేశానికి తగిన స్టెబిలిటీని అందించలేక పోయాయి, ఇనుప వైర్లతో బంధింపబడిన అతని పాదాలు. ఉన్నట్లుండి కాళ్ళు మడతబడి క్రిందికి జారి పోయాడు.

గొల్లున అరిచి అతన్ని చుట్టు ముట్టారు దూరంగా తొలగిన దృఢకాయులు. జుట్టు పట్టుకొని లేవ తీసి, ఒక గోడకు ఆనించి నిలబెట్టారు.

పొడుగాటి చర్మపు కొరడా నొకదాన్ని పట్టుకొని ఛణేల్ ఛణేల్ మని మ్రోతలు వచ్చేలా అతని శరీరం మీద నాట్యం చేయించింది సుమీ ఇవాటో. కొట్టి కొట్టి చేతులు నొప్పు పుట్టాయి కాబోలు, కొరడాను వదిలి, వెనక్కి జరిగింది.

"ఆకతాయి సమాధానాలతో, అర్థం లేని ఆవేశాలతో మీరు యిక్కడి నుంచి తప్పించు కోలేరు. మర్యాదగా మేడం అడిగిన ప్రశ్నలకు సమాధానం యివ్వండి." షాడో ప్రక్కనే నిలబడిన దృఢకాయుడొకతను సలహా యిచ్చాడు.

కొరడా దెబ్బలకు దుస్తులన్నీ చినిగి పేలికలైనా, శరీరమంతా ఎర్రని వాతలతో నిండి పోయినా, లెక్క చేయకుండా శిలా విగ్రహంలా నిలబడిన షాడోలో చలనం వచ్చింది.

"మేము దొంగలం కాదు. దూడ మేత కోసమూ రాలేదు. మీ మేడమ్ గారి అందచందాలు చూసి పోదామని వచ్చాము." అన్నాడు.

అవధులు దాటిన ఆగ్రహంతో ముఖం వికృత రూపాన్ని ధరిస్తుండగా, కూర్చున్న కుర్చీని ఎత్తి నేలకేసి బాదింది సుమీ ఇవాటో....

"అంగుళం అంగుళం చొప్పున కోసి కారం అద్దాలి.... రోజుకో అవయవం చొప్పున నరికి విపరీతమైన బాధకు గురి చేయాలి.... తమను పుట్టించిన భగవంతుడిని ప్రార్థిస్తూ, తమకు పట్టిన గతిని తలుచుకొని కుమిలిపోతూ, చావు ఎప్పుడు వస్తుందా అని రోదించే వరకూ చిత్ర హింసలు పెట్టాలి.... తీసుకు పోయి క్రింది గదిలో బంధించండి.... ఈ రోజు సాయంత్రం నుంచి వీళ్ళకు శిక్షల్ని నేనే స్వయంగా దగ్గర వుండి అమలు జరిపిస్తాను." అని ఆజ్ఞ యిచ్చింది.

ఇనుప గొలుసుల్ని పట్టుకొని ముందుకు కదిలారు దృఢకాయులు. ముళ్ళ కంపల్ని యీడ్చినట్లు స్నేహితులిద్దర్నీ యీడ్చుకు పోయి, అంధకార బంధురమయిన ఒక చీకటి గదిలోకి నెట్టి తలుపులు మూశారు.

## 14

కళ్ళు చీకటికి అలవాటు పడేదాకా వున్న చోటినుంచి కదలకుండా, అలాగే నిలబడి పోయాడు షాడో.

"గురూ.... ఎలా వుంది గురూ ? దెబ్బలు బలంగా తగిలాయా ?" అతని మౌనాన్ని మరొక విధంగా అర్థం చేసుకొని ఆందోళనగా భుజం మీద చేయి వేశాడు గంగారాం.

"యూ డోన్ట్ వర్రీ గంగూ.... ఐయామ్ ఆల్‌రైట్...!" అంటూ వులిక్కిపడి మాటలు ఆపేశాడు షాడో.

గాలి, వెలుతురు చొరరానంత దృఢంగా కట్టి వున్న ఆ డంజియన్ లోకి తెరలు తెరలుగా వస్తోంది రక్తపు వాసన. చిత్రహింసల్ని భరించలేక అలిసి పోయిన వ్యక్తి ఎవరో బాధతో నిట్టూరుస్తున్నట్లు వినవస్తోంది అస్పష్టమైన అలికిడి.

"బీ క్వయిట్ గంగూ.... వంటరిగా లేము మనం.... ఇంకెవరో బంధింపబడి వున్నారు ఇక్కడ...." గంగారాంని హెచ్చరిస్తూ, ఒక గోడ వెంబడి గది చివరికి పోయాడు షాడో.

ముందుకు జాచిన అతని చేతులకు చల్లగా తగిలించి ఒక శరీరం. చీమల పుట్ట మీద చేయి వేసినట్లు అదిరిపడి, పాంటు జేబులోనే సురక్షితంగా వున్న అగ్గిపెట్టెను తీసి వెలిగించాడు.

ఆ మసక వెలుగులో కనిపించాడు ఒక మధ్య వయస్కుడు. గోడలకు బిగించి వున్న ఇనుప రింగులకు వ్రేలాడుతున్నాడు. పదునైన కత్తితో చీరినట్లు తీవ్రంగా గాయపడి వుంది శరీరం. రక్తపు చారికలతో మలినమై అసహ్యకరంగా కనిపిస్తోంది అతని ముఖం.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో, మరో అగ్గిపుల్లను వెలిగించి ఆ ముఖంలోకి పట్టి పట్టి చూశాడు షాడో.

"మైగాడ్! ఇది అసంభవం!! దిసీజ్ హైలీ ఇంపాజిబుల్!!!" అన్న మాటలు అప్రయత్నంగా వెలువడ్డాయి అతని నోటినుంచి.

"ఎవరు గురూ ? ఎవరా మనిషి ?" అని అడుగుతూ హడావుడిగా ముందుకు రాబోయాడు గంగారాం. కాళ్ళకు బిగించి వున్న ఇనుప తీగెల సంగతి మర్చిపోవటం వల్ల తల్లక్రిందులుగా పడ్డాడు నేలమీద.

అతన్ని గురించి పట్టించుకోకుండా నేల మీద కూర్చుని, తన పాదాలను చుట్టి వున్న తీగెల్ని వూడతీసి అవతలికి విసిరేశాడు షాడో. కాలర్ క్రింద వున్న సూది వంటి సాధనంతో చేతుల్ని అంటి పెట్టుకొని వున్న గొలుసుల్ని వదిలించుకున్నాడు.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పవేమిటి గురూ ? ఎవరతను ?" అని అడుగుతూ లేచి కూర్చున్నాడు గంగారాం. పాదాల్ని పట్టివున్న తీగెల్ని తీసేసి, చేతుల్ని అతని ముందుకు జాచాడు.

అదే సమయంలో అటూ యిటూ కదిలాడు గోడకు వ్రేలాడుతున్న మనిషి. "దాహం.... దాహం....." అని అస్పష్టంగా కలవరించాడు.

"నీళ్ళు కావాలి గంగూ.... ముందర అర్జంటుగా అతని దాహాన్ని తీర్చాలి...." గంగారాం చేతులకున్న గొలుసుల్ని కూడా వూడదీస్తూ లోగొంతుకతో అన్నాడు షాడో.

ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలను ఆపైన వేయలేదు గంగారాం. కాళ్ళతో తడుముతూ గదంతా కలియ తిరిగాడు. మంచినీళ్లు కాదు కదా - కనీసం మంచినీళ్ళు త్రాగేటందుకు ఉపయోగించే గ్లాసు కూడా అతనికి కనిపించలేదు.

"ఎవడ్రా ఈ దరిద్రపు గదికి కాపలా వున్నదీ ? పీకలు ఎండి చచ్చిపోతుంటే పట్టినట్లు నిలబడతారేమిట్రా ? ?" అని అరుస్తూ గది తలుపుల్ని దబదబ బాదాడు. అప్పటికీ రెస్పాన్స్ రాకపోయేసరికి, లాగి లాగి తన్నాడు రెండుసార్లు. మూడోసారి తన్నటానికి రెడీ అవుతుండగా తెరుచుకున్నాయవి.

"తిన్న దెబ్బలు చాల లేదా ? చెవి కోసిన మేకల్లా అరిచారంటే ఇంకోసారి వదిలి పోతుంది మీ తుప్పు...." అంటూ చిన్న సత్తు గిన్నెలో కాసిని నీళ్ళు పోసి లోపలికి నెట్టాడు ఒక దృఢకాయుడు.

లాగి పెట్టి అతని ముఖం మీద గుద్దుదామన్న కోరికను అతి ప్రయత్నం మీద అణుచుకొని చీకట్లలోనే నిలబడ్డాడు గంగారాం. తలుపులు మూసుకోగానే గిన్నెను తీసుకొని పోయి షాడోకి అందించాడు.

తల అటూ యిటూ తిప్పుతూ అస్పష్టంగా గొణుగుతున్న మధ్య వయస్కుడి పెదవుల మీద గిన్నెలోని నీటిని బొట్లు బొట్లుగా పోశాడు షాడో.

పది క్షణాల తరువాత పూర్తిగా తెలివి వచ్చిందతనికి. ఎర్రబడిన కనులతో వారి వంక చూసి బరువుగా నవ్వాడు.

"నిన్ను కలుసుకోవడం కోసమే మియాకీ సిటీలోకి వచ్చాము మిస్టర్ ఫాక్స్.... నిన్ను ఈ స్థితిలో చూడవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు." గిన్నెలోని నీటినంతా అతని చేత తాగిస్తూ మృదువుగా అన్నాడు షాడో.

చేతిలో వున్న అగ్గిపుల్ల చుర్రుమని వేళ్ళను కాల్చే వరకూ తెలివి రాలేదు గంగారాంకి.

"అయ్యబాబోయ్! ఫాక్స్ అంటే ఇతనేనా ? దొరక్క దొరక్క ఈ దొంగనాయాళ్ళ చేతికి దొరికాడేమిటీ ?" ఆశ్చర్యంగా అడిగాడు కాలిన వేళ్ళను వూదుకుంటూ.

"హిరోషి అనబడే కెండోవారియర్ అనేకమంది టోంగా వస్తాదుల్ని కూడ గట్టుకొని దేశంలో అల్లకల్లోలం రేకెత్తించటానికి పథకాలు వేశాడు. అతన్ని గురించి తెలుసుకుందామని ప్రయత్నిస్తూ పట్టుబడి పోయాను...." ఆయాసంగా అంటూ తల విదిలించాడు ఫాక్స్.

కెండో వారియర్ అనేమాట వినబడగానే చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం. తెలివి తేటల్లో గుంటనక్కల్ని మించిన జాతి ఆ వారియర్ జాతి.... అన్నిటికన్నా, ఖడ్గవిద్యలో వారికున్న నేర్పు అసామాన్యమైనటువంటిది. కత్తి పట్టుకొని యుద్ధానికి సిద్ధపడిన కెండో వారియర్‌ని జయించటం అసాధ్యం అనే అంటారు అందరూ.

"నిన్ను కలుసుకోవాలనీ, నువ్వు అడిగినంత డబ్బిచ్చి, ఈ దొంగనాయాళ్ళ యవ్వారాలు తెలుసుకోవాలనీ అనుకున్నాము." చివరికంటా కాలిన అగ్గిపుల్లను అవతలికి విసిరేస్తూ నిరాశగా అన్నాడు గంగారాం. నెత్తి మీద చేతులు పెట్టుకొని గోడకు చేరగిల పడ్డాడు.

"ఐయామ్ వెరీ సారీ.... హిరోషీ తెలివి తేటల ముందు నేను ఓడిపోయాను. అతి ముఖ్యమైన ఒకరిద్దరు అనుచరులు తప్ప అతను ఎక్కడ వుంటాడో యింకెవరికీ తెలియదు." తడబడుతున్న కంఠంతో అన్నాడు ఫాక్స్.

అణగి పోతున్న ఆశ ఒక్కసారిగా చిగురించినట్లయి చటుక్కున లేచాడు గంగారాం. "ఆల్‌రైట్ ఫాక్స్ బాయ్.... ఆ అతిముఖ్యులెవరో చెప్పగలవా ? మొదలెట్టిన పనిని మధ్యలో వదిలేయటం మాకు నచ్చదు." అంటూ అతని ముఖంలోకి చూశాడు.

అప్పటికే అవుటయి పోయాడు ఫాక్స్. అతిగా మాట్లాడటం వల్ల విపరీతమైన స్ట్రెయిన్‌కి లోబడి, స్పృహతప్పి తల వాల్చేశాడు.

అంత వరకూ మౌనంగా వున్న షాడో వెంటనే కదిలాడు. గోడకు బిగించి వున్న రింగుల్ని తడిమి, అతికష్టం మీద ఫాక్స్‌ని క్రిందికి దించాడు.

"ఇప్పుడు ఏం చేద్దాం గురూ ? కొత్తగా వచ్చిపడిన ఈ సమస్యను ఎలా ఎదుర్కొంటాం ?" నిస్తేజంగా పడివున్న ఫాక్స్ గుండెలమీద చెవి ఆనించి వింటూ అడిగాడు గంగారాం.

అతి నీరసంగా కొట్టుకుంటోంది అది. వెంటనే తగిన వైద్యం చేయించకపోతే అతను టిక్కెట్ పుచ్చుకోవటం తప్పని సరి.

పాంటు జేబులోనుంచి సిగరెట్ నొకదాన్ని తీసి వెలిగించుకుంటూ గదిలో పచార్లు ప్రారంభించాడు షాడో.

"గంగూ.... మనం వెంటనే బయట పడాలి యిక్కడి నుంచి.... అందుకు బయట కాపలా నిలబడిన వారిద్దరూ ఈ గదిలోకి రావాలి.... నీకేమైనా మార్గం తెలిస్తే చెప్పు...." వున్నట్లుండి గంగారాం వైపు తిరుగుతూ అన్నాడు.

సీరియస్‌గా ముఖం పెట్టి తీవ్రంగా ఆలోచించాడు గంగారాం. బయటవున్న దృఢకాయులు సామాన్యమైన పరిస్థితుల్లో లోపలికి రారు. ప్రమాదకరమైన పరిస్థితి ఎదురయితే అరిచి కేకలు పెట్టి అందర్నీ పోగు చేస్తారు. అటూ యిటూ కాని ఉపాయం కావాలి.... కావాల్సిన మోతాదుకు ఒక్క వీసం ఎక్కువా కాకూడదు, తక్కువా కాకూడదు... అది!

ఉన్నట్లుండి పెట్రోమాక్స్ లైటులా వెలిగింది అతని ముఖం.

"అగ్గిపెట్టె యిటు పడేయ్ గురూ.... నువ్వు తలుపుల దగ్గర రెడీగా వుండు!" అంటూ తన షర్టును విప్పి క్రింద పడేశాడు.

అతని ఆలోచన ఏమిటో అర్థం కాలేదు షాడోకి. అయినా ఎదురు ప్రశ్న వేయకుండా అగ్గిపెట్టెను యిచ్చి తలుపుల దగ్గర గోడను ఆనుకొని నిలబడ్డాడు.

"తల్లీ కలకత్తా కాళీ! రెండు బ్రహ్మాండమైన గొర్రెపోతులు నాలుగు నల్ల కోడి పెట్టలు కావాలని అనుకుంటే నా ప్లాను సక్సెస్ అయ్యేటట్లు చూడు. అవసరం లేకపోతే మాత్రం నీ దారి నువ్వు చూసుకో. నా అభ్యంతరం ఏమీ లేదు." అంటూ అగ్గిపుల్లను వెలిగించి షర్టుకు అంటించాడు గంగారాం.

గుప్పు మంటూ పైకి లేచింది మంట. రెండు క్షణాలు ఆగి గబగబా దాన్ని చల్లార్చేశాడు.

మంట చల్లారి పోయింది. నిప్పు మాత్రం చొక్కాను నములుతూ, నాలుగు మూలలకు పాక సాగింది.

భరించరాని వాసనతో నిండి పోయింది గది.... వాసనతో పాటు సుడులు తిరుగుతూ గదిని అలుముకోసాగింది నీలం రంగు పొగ.

"గొర్రె పోతుల పేరు చెపితే కలకత్తా కాళికి ఎంత ఆశో చూశావా గురూ ?" అంటూ గట్టిగా వూది నిప్పును మరింత వ్యాపింప చేశాడు గంగారాం.

క్షణ క్షణానికి దట్టమై, పది క్షణాల తరువాత మెల్లిగా బయటికి ప్రసరించటం మొదలు పెట్టింది పొగ.

ఉలిక్కి పడి తలుపుల వైపు తిరిగారు బయట నిలబడి వున్న దృఢకాయులు యిద్దరూ.

"ఏమిటిది ? ఎక్కడి నుంచి వస్తోంది ఈ పొగ ?" అంటూ గబగబా తలుపులు తెరిచి లోపలికి తొంగి చూశాడు ఒకతను.

కుతూహలాన్ని అణుచుకోలేక, అతని భుజం మీదుగా తల లోపలికి పెట్టాడు రెండవ దృఢకాయుడు.

చటుక్కున చేతులు జాచి వారిద్దరి జుట్టూ పట్టుకున్నాడు షాడో. బలమంతా వుపయోగించి లోపలికి లాగేశాడు.

ఎదురు తిరగటానికి గాని, చేతుల్లో వున్న బాణాకర్రల్ని పైకి ఎత్త టానికిగాని అవకాశం దొరక్క, నోళ్ళు తెరిచారు వారిద్దరూ.

పొగలు వెలువరుస్తున్న షర్టుని ఎత్తి ఒకతని నోటిలో కుక్కాడు గంగారాం. పళ్ళు వూడి క్రింద పడిపోయేటట్లు ఫెడీమని గుద్దాడు రెండవ వ్యక్తి నోటి మీద.

తెరచి వున్న తలుపుల్ని దగ్గిరికి లాగి రెండు అంగల్లో వారిని సమీపించాడు షాడో. మొదటి దృఢకాయుడి మెడ పట్టుకొని, ఒక గోడకేసి విసిరాడు.

నిప్పు గుడ్డ మూలకంగా నోరంతా కాలి ఎగిరి గంతులు వేస్తున్నా డతను. బాలెన్స్ నిలబెట్టు కోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ పోయి, గోడకు గుద్దుకున్నా డు.

అతని చేతుల్లోనుంచి జారిపోయిన బాణాకర్రను అందుకొని రెండవ దృఢకాయుడి తల మీద ఆనించాడు షాడో....

"అరిచి అల్లరి చేయటానికి ప్రయత్నిస్తే తలలు పగలకొట్టి ప్రాణాలు తీస్తాము. మర్యాదగా మా ప్రశ్నలకు సమాధానం చెపితే మీరు భయపడాల్సిన అవసరం ఏదీ లేదు." అన్నా డు.

అరిచి అల్లరి చేసే ప్రయత్నాల్ని మానుకొని ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నా రా దృఢకాయులు.

"కెండో సెక్యూరిటీ సిస్టమ్‌తో నిండివున్న ఈ ఎస్టేట్‌లో అడుగు పెట్టటం ఎంత కష్టమో, బయటికి పోవటం కూడా అంతే కష్టమని మాకు తెలుసు. అయితే అవసర

సమయంలో ఉపయోగించు కోవటానికి, ఇక్కడ ఒక రహస్య మార్గం కాని, ఏదైనా సొరంగ ద్వారం కాని ఉండి తీరాలి. అది ఎక్కడ వుందో చెపితే మాకు చాలు...." ప్రాంప్ట్‌గా అన్నాడు షాడో.

మరోసారి ముఖ ముఖాలు చూసుకున్నారు వాళ్ళు. ఈ సారి విపరీతమైన ఆశ్చర్యం ప్రత్యక్షమైంది వారి ముఖాల్లో.

ఎటువంటి హెచ్చరికా లేకుండా బాణా కర్రను ఎత్తి, రెండో దృఢకాయుడి నెత్తి మీద బాదాడు షాడో.

ఫట్ మని శబ్దం చేసింది అతని తల. నాలుగు అంగుళాల పొడుగున పగిలి ఎర్రటి నెత్తురు ముఖం మీదికి జారింది.

షాడో కదలికను కనుచివరల నుంచి గమనించి, అతని నోటిని బలంగా అదిమేశాడు గంగారాం. బాధతో గిలగిల లాడుతూ, క్రిందికి జారి పోయాడతను. శరీరం నేలను తాకక ముందే స్పృహ తప్పి పోయింది.

"ఆల్‌రైట్ బ్రదర్.... నాకు ఓపిక చాలా తక్కువ. నా ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పక పోతే నీకు కూడా యిదే గతి పడుతుంది." బాణా కర్రను రెండో వ్యక్తి వైపు తిప్పుతూ హెచ్చరించాడు షాడో.

నెత్తురు లేనట్లు తెల్లగా పాలి పోయింది అతని ముఖం.

"అది.... అది ఎక్కడ వుందో చెపితే సుమీ ఇవాటో మా ప్రాణాలు తీసేస్తుంది...." అన్నాడు గుటకలు మ్రింగుతూ.

"చెప్పక పోతే మేమే చేస్తాము ఆ పని.... ఎవరి చేతుల్లో చావటం మంచిదో బాగా ఆలోచించుకో.... మా గురువు గారికి అసలే కోపం చాలా ఎక్కువ...." వెంటనే సలహా యిచ్చాడు గంగారాం.

నొసలు ముడి వేస్తూ, బాణాకర్రను పైకెత్తి రెండు అడుగులు ముందుకు వేశాడు షాడో.

నోటీస్ కూడా లేకుండా తన సహచరుడికి పట్టిన దుస్థితి, షాడో పెట్టిన ఫోజు, ఆ దృఢకాయుడిని బెదర కొట్టేశాయి.

"మాకు వంటలు చేసే కిచెన్‌లో బీరువాల చాటున వుంది ఒక సొరంగం. అది.... అది...." అంటూ తడబడ్డాడతను.

బాణాకర్రను యింకా కొంచెం పైకెత్తి మరో అడుగు ముందుకు వేశాడు షాడో. కొట్టే అవకాశం అతనికి లభించలేదు. చెప్పే వ్యవధి ఆ దృఢకాయుడికి దొరకలేదు. దగ్గిరికి వేసి వున్న తలుపులు ధడాలున తెరుచుకున్నాయి.

"మీరు యిటువంటి పని ఏదో చేస్తారని నేను అనుకుంటూనే వున్నాను. నేను అనుకున్నట్లే జరిగింది." అంటూ చేతిలోని కొరడాను ఎత్తి ముందుకు విసిరింది అక్కడ ప్రత్యక్షం అయిన సుమీ ఇవాటో.

బాణా కర్రల్ని పైకి ఎత్తి ముందుకు దూకటానికి రెడీ అయినారు ఆమెతో వచ్చిన అరడజను మంది దృఢకాయులు. వారి ప్రక్కనే వున్నాడు మత్తుమందు వృద్ధుడు. గదిలో వున్న ఆకారాలను చూడగానే పోల్చుకున్నాడు.

"మైగాడ్! వీళ్ళే!! వీళ్ళే మేడమ్ - నన్ను కొట్టి, మన వాళ్ళందర్నీ మోసం చేసి పారిపోయిన దుండగులు వీళ్ళే!!!" కీచు గొంతుతో ఆ గది దద్దరిల్లి పోయేటట్లు అరుస్తూ ఒక అడుగు ముందుకు వేశాడు.

ఎదురు చూడని ఆ డెవలెప్‌మెంట్‌ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక క్షణంలో పదోవంతుకాలం శిలావిగ్రహంలా నిలబడి పోయాడు షాడో.

అదృష్టం బాగుండి, అంత వరకూ తమ ఐడెంటిటీ ఆ రాక్షసికి తెలియలేదు. వృద్ధుడి మాటలతో రట్టు అయింది తమ గుట్టు.

ఛణేల్‌మని కొరడా చివరి భాగం ముఖానికి తగలటంతో వదిలి పోయింది షాడోని ఆవరించుకున్న స్తబ్ధత.

అదే సమయంలో కొరడాను వదిలి గిర్రున వృద్ధుడి వైపు తిరిగింది సుమీ ఇవాటో. విపరీతమైన కోపం ఆమె ఇంగితజ్ఞానాన్ని నశింప చేసింది.

"బుద్ధిహీనుడా.... నిన్ను అనుసరించి యిక్కడికి వచ్చి వుంటారు వీళ్ళు. నీ అవివేకానికి తగిన శిక్ష అనుభవించక తప్పదు" అంటూ బొడ్లో వున్న పచ్చల బాకును బయటికి లాగి వృద్ధుడి గుండెల మీద పొడిచింది.

కెవ్వున అరిచి క్రింద పడి పోయాడు వృద్ధుడు. చేతులు కాళ్ళు గిలగిలా కొట్టుకుంటూ, దగ్గిర వున్న దృఢకాయుల్ని దూరంగా తరిమాడు.

"కమాన్ గంగూ.... ఇంత కంటె మంచి అవకాశం మనకు లభించదు." అంటూ చేతిలోనే వున్న బాణాకర్రను ఎత్తి సుమీ ఇవాటో తల మీద బాదాడు.

అదిరి పడి ప్రక్కకు దూకిందామె. తల మీద పడవలసిన దెబ్బ భుజాల మీద పడింది. బాధతో కనులు బైర్లు క్రమ్ముతుండగా క్రిందికి జారిపోయింది.

"మేమెవరమో కనిపెట్టలేని నీ మందబుద్ధిని నిందించుకోక, పాపం ఆ ముసలాడి ప్రాణాలు తీస్తావా! అవకాశం అంటూ దొరికిన మరుక్షణం నీ అంతు చూస్తాను.... నీ అందమైన ముఖాన్ని అందవికారంగా మారుస్తాను." అంటూ ఆమె మీది నుంచి జంప్‌చేసి దృఢకాయుల మధ్యలో దూరాడు గంగారాం. బాణాకర్రతో వారిని చెల్లాచెదురు చేసి అండర్ గ్రౌండ్ ఎంట్రన్స్ వైపు పరుగు తీశాడు.

"పారి పోతున్నాడు.... బందీ పారిపోతున్నాడు...." అని అరుస్తూ అతని వెంట పడ్డారు వారందరూ.

క్రింద వున్న ఫాక్స్‌ని ఎత్తి భుజం మీద వేసుకున్నాడు షాడో. బాణా కర్రను రెడీగా పట్టుకొని వారి వెనుకే పరుగులు తీశాడు.

పళ్ళ బిగువున బాధను భరిస్తూ మోకాళ్ళ మీద లేచి వారిని హెచ్చరించటానికి విపరీతమైన ప్రయత్నం చేసింది సుమీ ఇవాటో.

"మందమతుల్లారా.... మీ వెనక వస్తున్నాడు. చూడండిరా.... కష్టపడి మనం బంధించిన ఫాక్స్‌ని విడిపించి తీసుకుపోతున్నాడు. గమనించండిరా...." అంటూ అరిచింది.

తగలక తగలక తగిలిన దెబ్బ కాబోలు - నీరసపడి పోయింది ఆమె కంఠం.... చెవులు చిల్లులు పడి పోయేటట్లు బిగ్గరిగా రావాల్సిన మాటలు ముసలమ్మ గొణుగుడులా ధ్వనించాయి.

అడుక్కు ఆరు మెట్లు ఎక్కుతూ పైకి వెళ్ళి కిచెన్ వుండే కారిడార్ వైపు దూసుకు పోయాడు గంగారాం.

కారిడార్ చివర అతనికి కనిపించింది విశాలమైన వంట గది. ఆ పూటకు వంటలు అయిపోవటం వల్ల నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వున్నదది. అందులో అడుగు పెట్టిన మరుక్షణం ప్రక్కకు దూకి, తలుపుల చాటున నిలబడ్డాడతను.

"పట్టుకోండి.... పట్టుకోండి...." అని భవనం బయట వున్న తమ సహచరుల్ని పిలుస్తూ అతనితో పాటు అందులోకి పోయారు దృఢకాయులు.

ఒక చేత్తో బాణాకర్రను రెడీగా పట్టుకొని, రెండో చేతిని తలుపు గడియ మీద వేసి వుంచాడు గంగారాం.

"ఇక చూడండిరా దొంగనాయాళ్ళలార.... ఇప్పుడు పట్టుకోండిరా మమ్మల్ని...." అంటూ బాణా కర్రను గిర్రున తిప్పుతూ దృఢకాయుల మీద కలబడ్డాడు.

ఫాక్స్‌ని జాగ్రత్తగా క్రింద పడుకో బెట్టి పాంటు జేబులో నుంచి సిగరెట్‌ని తీశాడు షాడో. అగ్గిపెట్టె అండర్ గ్రౌండ్ గదిలోనే వుండి పోవటం వల్ల ఆ గదంతా

కలియ తిరిగి, ఒక మూలగా వున్న గాడి పొయ్యిలోని నిప్పు బొగ్గులతో సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఆ సరికి క్రింద పడి పోయారు నలుగురు దృఢకాయులు. మిగిలిన యిద్దరూ కర్రల్ని వదిలేసి గడియ పెట్టిన తలుపుల వైపు గెంతుతున్నారు.

గాడి పొయ్యి దగ్గిరే వున్న లావాటి కట్టె పుల్లను అందుకొని అండర్ హేండ్ త్రోలో ముందుకు విశిరాడు షాడో.

గింగిరాలు తిరుగుతూ పోయి, ముందున్న వ్యక్తి మెడ మీద తగిలింది అది. కీచుగా అరిచి క్రింద పడ్డాడతను. వేగాన్ని ఆపుకోలేక అతని మీద కాలు వేసి తల్లక్రిందులుగా పల్టీ కొట్టాడు రెండో వ్యక్తి.

తలుపులకు పొడుచుకొని ఖంగు మన్నది అతని తల. బాధతో ముఖం చిట్లిస్తూ అలాగే కూలబడి పోయాడతను.

ఒక ప్రక్కన నిలబెట్టి వున్న బీరువాలను సమీపించి, వాటన్నిటినీ క్రిందికి పడత్రోశాడు గంగారాం.

అండర్ గ్రౌండ్ గదిలో కాపలా వ్యక్తి చెప్పిన మాటలు అసత్యాలు కాలేదు. ఒక బీరువా వెనుక కనిపించింది పెద్ద సొరంగ ద్వారం.

అదే సమయంలో దడదడలాడాయి కిచెన్ తలుపులు.

"పగలగొట్టండి.... తలుపుల్ని పగలగొట్టి వాళ్ళని పట్టుకోండి...." కీచుగా వినవచ్చింది సుమీ ఇవాటో కంఠం.

తలుపుల దగ్గర పడిపోయిన దృఢకాయుడు ఒకతను మెల్లిగా లేచి నిలబడటానికి ప్రయత్నించటం చూసి, క్రిందే వున్న కట్టె పేడుతో అతని తల మీద మరో దెబ్బ వేశాడు షాడో.

సిగరెట్ పొగను గుండెల నిండా పీల్చుకుంటూ, బీరువాల ప్రక్కనే కనిపించిన పెద్ద కిరోసిన్ డ్రమ్మును పైకి ఎత్తి నేలకేసి బాదాడు.

గాడిపొయ్యిలో వున్న బొగ్గుల్ని మంట వచ్చేదాకా వూది, గదంతా విరజిమ్మాడు. క్రింద పడుకోబెట్టిన ఫాక్స్‌ని భుజం మీదికి ఎత్తుకొని, అతను సొరంగంలోకి అడుగు పెట్టడం, నిప్పు బొగ్గుల మంట కిరోసిన్ వాసనకు నిలువెత్తున పైకి లేవటం, కిచెన్ తలుపులు విరిగి లోపల పడటం ఒకేసారి జరిగాయి.

## 15

"చల్లార్చండి.... మంటల్ని చల్లార్చండి.... రాతి బొమ్మల్లా నిలబడకుండా ముందుకు కదలండి...." పట్టరాని ఉద్వేగంతో పిడికిళ్ళు బిగిస్తూ బిగ్గరిగా ఆర్డర్స్ యిచ్చింది సుమీ ఇవాటో.

ఫెట ఫెటారావాలు చేస్తూ కిచెన్‌లో నుంచి బయటకు వస్తున్నాయి మంటలు. క్షణానికి పది అడుగుల చొప్పున ఆ చెక్కల మేడను ఆక్రమించుకుంటున్నాయి.

పచ్చటి చిగుళ్ళతో కనుల పండువుగా వుండే మల్బరీ చెట్లు వసివాడి వంగి పోతున్నాయి వాటి వేడికి. రెక్కల్ని విదిలిస్తూ, దిక్కులు పిక్కటిల్లేటట్లు అరుస్తూ తలా ఒక మూలకు పారిపోతున్నాయి చెట్ల మీది పక్షులు.

"లాభం లేదు మేడమ్.... మేడని మనం కాపాడలేము.... ఈ మంటల్ని అదుపు చేయటం మనవల్లకాదు...'' నాలుకలు విరజాస్తూ ఆకాశంలోకి లేస్తున్న మంటల్ని చూస్తూ బాధగా అన్నాడు ఒక దృఢకాయుడు.

"ఆల్‌రైట్.... నా అశ్వాన్ని రెడీ చేయండి.... మీరందరూ కలిసి మంటలు చెట్లమీదికి పోకుండా జాగ్రత్తలు తీసుకోండీ" అంటూ మేడ ముందు నుంచి యివతలికి వచ్చేసిందామె.

రెండు నిముషాల్లో తీసుకు రాబడింది ఒక జాతి గుర్రం. కళ్ళేలను పట్టుకొని ఒక్క గంతులో దాన్ని అధివసించింది సుమీ ఇవాటో.

జీనుకు తగిలించి వున్న పేము బెత్తాన్ని అందుకొని దాని పిర్రల మీద బలంగా చరిచింది. పెద్దగా సకిలించి పరుగు అందుకుంది అశ్వం. రెండు క్షణాల్లో గేటును దాటి పడమటి దిశగా పరుగు ప్రారంభించింది.

కళ్ళేలను వదిలేసి బెత్తంతో దాన్ని బాదుతూనే వున్నదామె. ఎంత వేగంగా పోయినా తృప్తి చెందకుండా, ఇంకా, ఇంకా స్పీడ్ కావాలని తాపత్రయ పడసాగింది.

అడ్డు వచ్చిన పొదల మీదుగా ఎగిరి దూకుతూ, విపరీతమైన ఆయాసంతో నురగలు కక్కుతూ, సూర్యుడు పడమటి దిశకు మరలే సమయంలో ఒక కొండ గుట్టను సమీపించింది అశ్వం.

గుట్ట చుట్టూ పెరిగి వున్నాయి పెద్ద పెద్ద ముళ్ళపొదలు. వాటి చాటునుంచి లేచి ఆమెను చుట్టుముట్టారు నలుపు రంగు దుస్తులు ధరించిన వ్యక్తులు అనేకమంది.

"వాన్‌టాంగ్‌ని అర్జంటుగా కలుసుకోవాలి.... ఎదురు చూడని ప్రమాదం ఒకటి ముంచుకు వచ్చింది" గుర్రం మీదినుంచి క్రిందికి దూకుతూ అన్నదామె.

మారు మాటాడకుండా, వెను తిరిగి గుట్టమీదికి దారి తీశారు వారందరూ. అక్కడ వున్న పాడుబడిన బంగ్లాలోకి పంపించి బయట నిలబడ్డారు.

మనస్సును ఆవరించుకొని వున్న ఆందోళనను అణుచుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ, ఒక గదిలో అడుగు పెట్టిందామె.

నల్లటి ముసుగును ధరించి పొడుగాటి ఖడ్గాన్ని పదును చూస్తున్న ఆజానుబాహుడు ఒకతను వున్నాడు అక్కడ.

"హల్లో సుమీ.... ఏమిటి యిలా హఠాత్తుగా వచ్చేశావ్ ?" అన్నాడు ఆమెను చూడగానే.

కంపిస్తున్న కంఠంతో జరిగినదంతా అతనికి వివరించిందామె.

"ఇదంతా ఆ ముసలాడి మూలకంగా జరిగింది.... వాళ్ళు తన చేతిలోనుంచి జారిపోగానే, చోటు మార్చి సిటీలోనే వుండి పోవాల్సింది. కొంపలు అంటుకు పోయినట్లు నా దగ్గిరికి వచ్చి, ఆ దుర్మార్గులకు దారి చూపించాడు." అన్నది.

ఖడ్గాన్ని అటూ యిటూ తిప్పుతూ ఆ మాటలన్నిటినీ విని చిరునవ్వు నవ్వాడు ముసుగుమనిషి.

"యూ డోన్ట్ వర్రీ సుమీ.... వచ్చినవాళ్ళు సామాన్యులు కాదు. వాళ్ళ విషయంలో నేను కూడా పొరపాటు పడ్డాను.... యిదిగో... ఇది చూడు...." అంటూ

అక్కడ వున్న ఒక అలమారాలోనుంచి నీలం రంగు హేండ్ కర్చీఫ్‌ని తీసి ఆమెకు అందించాడు.

హేండ్ కర్చీఫ్ మధ్యలో అందంగా కనిపిస్తోంది ఒక ఎంబ్లమ్....

"మైగాడ్! ఇది కుంగ్‌ఫూ విద్యా పీఠానికి చెందిన జేబుగుడ్డ!!" దాన్ని చూడగానే ఆశ్చర్యంగా అన్నది సుమీ ఇవాటో.

"కరెక్ట్ మైడియర్ సుమీ.... కుంగ్‌ఫూ విద్యాపీఠంలో భారతదేశం నుంచి వచ్చిన షాడో అనే గజదొంగ విద్య నేర్చుకుంటున్నాడు. అరివీర భయంకరులైన నింజా గురువుల్నే మూడు చెరువుల నీళ్ళు తాగించిన మనిషి అతనని నాకు ఆలస్యంగా తెలిసింది.... లిన్‌ఫాంగ్ మరణించిన ప్రదేశంలో దొరికిన ఈ జేబుగుడ్డను ఈ రోజునే నాకు అంద చేశారు మనవాళ్ళు...." అంటూ చేతుల్ని వెనక్కి కట్టుకొని పచార్లు మొదలెట్టాడు ముసుగు మనిషి.

"అయితే వాళ్ళని ఆపటం మనకు చేతకాదా ? ఎదురు పడినప్పుడల్లా ఏదో ఒక అఘాయిత్యం చేసి పోతున్న ఆ దుర్మార్గుల్ని అలా గాలికి వదిలేయవలసిందేనా ?" ఆవేశంగా అడిగింది సుమీ ఇవాటో.

చటుక్కున ఆమెను దగ్గరికి లాక్కుని పెదవుల్ని చుంబించాడు ముసుగు మనిషి.

"ఈ వాన్‌టాంగ్ శక్తి ని చాలా తక్కువగా అంచనా వేస్తున్నావ్ సుమీ.... ఆ దుర్మార్గుల పీచం అణచటానికి పథకం రెడీ చేశాను...." అంటూ ఆమెను వదిలి, ఆ గది వెనుక వున్న మరో విశాలమైన హాలులోకి దారి తీశాడు.

పెదవుల్ని అరచేత్తో అద్దుకుంటూ అతన్ని అనుసరించిందామె. హాలులో అడుగు పెట్టగానే భయంతో గగుర్పొడిచింది ఆమె శరీరం.

హాలు మధ్యలో కట్టివున్నాయి పెద్ద పెద్ద ఇనుపబోనులు. వాటిలో నిలబడి ఎర్రటి కళ్ళను గుండ్రంగా తిప్పుతూ వారి వైపు చూస్తున్నాయి భయంకరమైన హోకూకు జంతువులు.

బోను తలుపులు తెరిచి నాలుగు జంతువుల్ని బయటికి పిలిచాడు ముసుగు మనిషి.

"ఈ జేబు గుడ్డను జాగ్రత్తగా గమనించండి.... దీన్ని వాడిన మనిషి మన మల్బరీ ఎస్టేట్‌లోని సొరంగ మార్గం గుండా షీకూ నది వడ్డుకు చేరుకున్నాడు. అతని జాడల్ని అన్వేషించి హతమార్చండి.... హతమార్చకుండా వెనుతిరిగి వస్తే మిమ్మల్ని నాశనం చేసేస్తాను...." అంటూ ఎనిమిది అడుగుల ఎత్తున్న ఒక జంతువుకు జేబుగుడ్డను అందించాడు.

అతని మాటలు అర్థం అయినట్లు శబ్దాలు చేస్తూ హాలు వెనుక వున్న ద్వారంలోనుంచి బయటికి పరుగు తీశాయి ఆ హోకూకు జంతువులు.

"వీటికి బలం తప్ప తెలివి తేటలు వుండవు. మనల్నే ఏమార్చి తిరుగుతున్న ఆ దుర్మార్గులు వీటిని తప్పించుకోలేరా ?" ముక్కును ఎగబీలుస్తూ అడిగింది సుమీ ఇవాటో.

పెద్దగా నవ్వి ఆమెను మరోసారి ముద్దు పెట్టుకున్నాడు ముసుగు మనిషి. "హొకూకు జంతువుల సంగతి నీకు యింకా సరిగ్గా తెలియదు. మనుష్యుల్ని ఏమార్చటం చాలా తేలిక.... ఒకసారి వాటికి జాడలు దొరికితే ప్రాణాలు పోయినా సరే ప్రక్కకు కదలవు...." అంటూ ముందు గదిలోకి వచ్చాడు. అక్కడ ఆలమరాలోనుంచి కొన్ని దుస్తుల్ని తీసి ఆమె మీదికి విసిరాడు.

సామాన్యమైన స్త్రీలు ధరించే ఆ దుస్తుల్ని చూసి అసహ్యంగా నొసలు విరుస్తూ వెనక్కి జరిగింది సుమీ ఇవాటో.

"హొకూకులకు అందకుండా ఆ షాడో తప్పించుకోవటమంటూ జరిగితే, వెంటనే ఎదుర్కోవటానికి ఒక మార్గం వుంది. ఆడవారన్నా, ఆపదలో వున్న వారన్నా కరిగి పోతాడట అతను. ఆ బలహీనతను ఆధారంగా తీసుకొని అతన్ని బంధించాలి...." అంటూ ఆమె చెవిలో ఏదో చెప్పాడు ముసుగు మనిషి.

ముఖంలోని అసహ్యం మాయమైపోగా, చిరునవ్వు నవ్వుతూ ఆ దుస్తుల్ని తీసుకుంది సుమీ ఇవాటో.

"థేంక్యూ వాన్‌టాంగ్.... థేంక్యూ వెరీమచ్.... ఆ దుర్మార్గుల మీద పగ సాధించే అవకాశం యిచ్చినందుకు నీకు కృతజ్ఞతలు ఎలా తెలియ పరుచుకోవాలో నాకు అర్థం కావటం లేదు." అంటూ గది ద్వారం వైపు అడుగులు వేసింది.

"కృతజ్ఞతలు తెలియ పరుచుకోవటానికి చక్కటి మార్గం ఒకటి వుంది డియర్. చూపిస్తాను కమాన్...." అంటూ వెనుక నుంచి పోయి ఆమెను చేతుల్లోకి ఎత్తుకున్నాడు ముసుగు మనిషి.

అదిరిపడి గిలగిలా కొట్టుకుంది సుమీ ఇవాటో. అతని బాహువుల్లో నుంచి బయట పడటానికి విశ్వప్రయత్నం చేసింది.

పెద్దగా నవ్వుతూ తీసుకుపోయి మరో గదిలో వున్న బెడ్ మీద పడేశాడు ముసుగు మనిషి. గది తలుపులు గడియపెట్టి, ఆమె శరీరాన్ని చేతుల్లో పొదవుకున్నాడు.

అంతవరకే గుర్తు పెట్టుకో గలిగింది సుమీ ఇవాటో. ఆ తరువాత ఏం జరిగిందో ఆమెకు తెలియదు.

## 16

షీకు నది వడ్డున ఆగి నేలను వాసన చూసింది హౌాకూకు. తల అడ్డం తిప్పుతూ లేచి వేగంగా ముందుకు పరుగు తీసింది.

పది గజాల దూరంలో వెడం వెడంగా దాన్ని అనుసరిస్తున్నాయి మిగిలిన హౌాకూకులు. మధ్య మధ్యలో ఆగి నది దిగువనుంచి వీస్తున్న గాలిని వాసన చూస్తున్నాయి.

సూర్యుడు పూర్తి గా పడమటికి దిగి పోయే సమయంలో వున్నట్లుండి పెద్దగా అరిచింది మొదటిది. చేతిలోవున్న హేండ్ కర్చీఫ్‌ని అవతలికి విసిరికొట్టి, బాణంలా పొదల్లోకి బయలు దేరింది.

అరగంట తరువాత తూర్పు దిక్కున ప్రత్యక్షం అయినాడు చంద్రుడు. ఆ వెన్నెల వెలుగులో ఒక పెద్ద చెట్లగుంపును సమీపించి ఆగిపోయిందది. అలుపు ఆయాసం అంటే ఏమిటో తెలియనట్లు అవలీలగా దాన్ని అనుసరించి వస్తున్న హాకూకులు నిశబ్దంగా చీలి పోయాయి. అడుగులో అడుగు వేస్తూ తలా ఒక మూలనుంచి చెట్లలోకి బయలు దేరాయి.

ఒక పెద్ద రేగి చెట్టు క్రింద పడుకొని వున్నాడు షాడో. అతనికి పది అడుగుల దూరంలో, కూర్చునే కునికి పాట్లు పడుతున్నాడు గంగారాం.

ఉన్నట్లుండి కనులు తెరిచాడతను. ఎర్రబడిన కనులను నులుముకుంటూ చుట్టూ చూశాడు.

"ఫాక్స్ దగ్గిరికి పోయి రెడీగా వుండు గంగూ.... మనం పిక్కబలం చూపించాల్సిన అవసరం వచ్చేసింది." అరమూసిన కనులతో అతని వైపు చూస్తూ మెల్లిగా అన్నాడు షాడో.

అప్పటికీ అసలు విషయం ఏమిటో గంగారాంకి అర్థం కాలేదు. అయినా సరే మారు మాటాడకుండా, మెల్లిగా ప్రక్కకు జరిగాడు. నాలుగు అడుగుల దూరంలో నడుములు విరిగి పోయిన రబ్బర్ బొమ్మలా పడుకొని వున్న ఫాక్స్ దగ్గిరికి పోయి రెడీ అయినాడు.

నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా చివ్వున లేచాడు షాడో. ప్రక్కనే వున్న పెద్ద పెద్ద రాళ్ళను రెండింటిని అందుకొని బలంగా విసిరాడు చీకట్లలోకి.

దబ్‌మని వినవచ్చింది ఒక శబ్దం.... బరువైన జంతువేదో ఎగిరి వెనక్కి దూకినట్లు వినబడింది సవ్వడి.

"కమాన్ గంగూ.... లెటజ్ గో." అంటూ అటుకేసి జంప్ చేశాడు షాడో.

ఫాక్స్‌ని భుజం మీదికి ఎత్తుకొని అతని వెనుకే పరుగు తీశాడు గంగారాం. పాతిక అడుగుల దూరం పోగానే ఒక చెట్టు ప్రక్కన అతనికి కనిపించింది హాకూకు.

షాడో విసిరిన రాళ్ళ దెబ్బకు ముఖం నలిగిపోయింది కాబోలు, కళ్ళు ఆర్పుతూ తల విదిలిస్తోంది అది.

"దొరికిన అవకాశాన్ని వూరికే పోనీయటం దేనికి గురూ ? లాగిపెట్టి యింకో రెండు పీకితే శాశ్వతంగా నిలబడి పోతుంది గదా!" దాన్ని దాటి అవతలకు పోగానే అన్నాడు గంగారాం.

అతని నెత్తి మీద లాగిపెట్టి రెండు యిచ్చాడు షాడో.

"నీకున్న తెలివి తేటలకంటె రెండింతలు ఎక్కువగానే వున్నాయి దాన్ని మన మీదికి పంపిన వారికి.... ఒక్కసారి వెనక్కి చూడు." అన్నాడు పరుగు ఆపకుండానే.

వీలు చూసుకొని వెనక్కి తిరిగాడు గంగారాం. గురకలు పెడుతూ వస్తున్న మిగిలిన హాకూకులను గమనించగానే దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయింది అతని గొంతు.

"తల్లీ కలకత్తా కాళీ.... పులుల్నీ సింహాల్నీ వదిలి పెట్టి యిటువంటి దరిద్రపు జీవుల్ని సృష్టించావేమిటి తల్లీ.... వీటి బారిన పడి నేను మరణిస్తే నీకు మొక్కులు తీర్చేవాడు ఎవడున్నాడు ? ?" అంటూ మరింత వేగంగా పరుగు తీయబోయి, బోర్లా పడి పోయాడు.

చటుక్కున వంగి, అతని భుజాల మీది నుంచి అవతలికి పడిన ఫాక్స్‌ని ఎత్తుకున్నాడు షాడో. అతనికి చేతిని అందిస్తూ, మళ్ళీ పరుగు ప్రారంభించాడు.

అమూల్యమైన సమయం కాస్తా వేస్ట్ అయిపోయింది ఆ యాక్సిడెంట్ మూలకంగా. పది గజాల దూరంలోకి వచ్చేసి, గుండెలు జలదరించేటట్లు గురక పెట్టసాగాయి హౌకూకులు.

"నా పని అయిపోయింది గురో.... ఇంత స్పీడ్‌గా పరిగెత్తటం నా వల్ల కాదు." అంటున్న గంగారాం చేయిని దొరకబుచ్చుకొని, సూటిగా ముందుకే పోయాడు షాడో.

మరో నిముషంలో హౌకూకులు వచ్చి మీద పడతాయనగా వారి ముందు ప్రత్యక్షమయింది సుడులు తిరుగుతున్న షీకూ నది.

వెనక్కి లాగుతున్న గంగారాం చేయి వదలకుండా, పరుగు పరుగున పోయి నదిలోకి దూకాడు షాడో. వంటి చేత్తో బారలు వేస్తూ అవతలి వైపుకు ఈదసాగాడు.

నీటిని చూడగానే బ్రేకులు పడినట్లు ఆగిపోయాయి హౌకూకుల పాదాలు. టాప్ పిచ్‌లో గురకలు పెడుతూ కదం తొక్కసాగాయి వడ్డు మీద.

"అదేమిటి గురూ ? అలా ఎగురుతున్నాయేమిటి ?" ఎగసి పడుతున్న అలల తాకిడికి ఉక్కిరి బిక్కిరి అవుతూ, షాడోని అడిగాడు గంగారాం.

సమాధానం యివ్వలేదు షాడో.... మరో రెండు నిముషాల తరువాత అవతలి వడ్డును సమీపించి, వెనక్కి చూశాడు.

అతని అంచనా కరెక్టు అయింది. మెల్లిగా నీటిలోకి దిగాయి హౌండులు. బలంగా బారలు వేశాయి. బరువైన వాటి శరీరాలు నదిని క్రాస్ చేయటం పోయి నీటి వాలుకు కొట్టుకు పోతున్నాయి.

"అవి నదిని దాటేలోగా మనం సురక్షిత స్థానానికి చేరుకోవటం చాలా మంచిది.... ఈ సారి ఎదురైతే మనల్ని ప్రాణాలతో వదిలి పెట్టవు." అంటూ వడ్డున వున్న చెట్లను దాటి ముందుకు సాగాడు షాడో.

అరగంట తరువాత కనిపించాయి రెండు కొండ గుట్టలు. క్రాస్ చేయటానికి వీలులేనంత నిటారుగా వున్నాయి వాటి మీది రాతి బండలు. నలుగురు మనుష్యులు పట్టే సన్నపాటి సందు వుంది వాటి మధ్యలో. అది తప్ప మరో మార్గం కనిపించటం లేదు.

కుడి భుజం మీద వున్న ఫాక్స్‌ని ఎడమ భుజం మీదికి మార్చుకుంటూ సందుకు వంద గజాల దూరంలో ఆగిపోయాడు షాడో.

"ఆగి పోయావేమిటి గురూ ? ఆ సందులో ఏవైనా పొంచి వున్నాయని అనుమానమా ?" అతని ప్రక్కనే నిలబడుతూ అడిగాడు గంగారాం.

అవునన్నట్లు తల వూపుతూ చుట్టూ చూశాడు షాడో. కొండ గుట్టల్ని చుట్టి అవతలకు పోవాలంటే చాలా దూరం నడవాలి.... నడవటానికి బద్ధకం వేసి మొండిగా ముందుకు పోతే -

చలిగాలి వీచినట్లు జలదరిస్తున్న మెడను తడుముకుంటూ, తల విదిలించి మరోసారి సందుకేసి చూశాడు. నిశబ్దంగా నిర్మానుష్యంగా కనిపిస్తోంది అది.... భయపడాల్సినంత ప్రమాదం అందులో పొంచి వున్నట్లు కనిపించటం లేదు.

అతని మనస్సులోని సందేహాలను గమనించి చిన్నగా నవ్వాడు గంగారాం. ముఖం మీదికి పడుతున్న జుట్టును వెనక్కి నెట్టుకుంటూ పది అడుగులు ముందుకు వేశాడు.

"మైగాడ్! నీకేమైనా మతి పోయిందా ?" ఆందోళనగా అంటూ అతని చేతిని పట్టుకోబోయాడు షాడో.

విదిలించి కొట్టి, వెనక్కి కూడా చూడకుండా ఒక బండరాయి మీద నిలబడ్డాడు గంగారాం. గట్టిగా దగ్గి గొంతు సవరించుకున్నాడు. చెవికి చేయి ఆనించి, ఒక్కసారిగా అందుకున్నాడు భయంకరమైన ఒక పద్యాన్ని.

మొదటి చరణం రెండు సార్లు రిపీట్ అయింది. ప్రశాంతంగానే వుండి పోయాయి ఆ చుట్టు పట్ల వున్న ప్రదేశాలు. రెండో చరణం మొదలు అయిన మరుక్షణం బండల చాటున మాటువేసి వున్న బల్లులు, చిన్న చిన్న పాములు మొదలయినవన్నీ అర్జంటుగా అవతలికి పారి పోయాయి.

మూడో చరణం స్టార్ట్ అయింది - హడావుడిగా లేచాయి దూరంలో బండల మీద కూర్చుని వున్న గుడ్లగూబలు. వికృతంగా అరుస్తూ ఎటో ఎగిరిపోయాయి.

"పాపం.... వాటి బ్రతుకుల్ని ఎందుకు దుర్భరం చేస్తావ్ ? ఆపు నాయనా! పద్యం ఆపి వెనక్కి వచ్చేయ్...." భుజం మీద వున్న ఫాక్స్ మూలకంగా చెవులు మూసుకోవటం చేతకాక బ్రతిమాలాడు షాడో.

నిర్మోహమాటంగా కంటిన్యూ చేశాడు గంగారాం. నాలుగో చరణం సగం అయ్యేసరికి, విపరీతమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న ఎలుగుబంటి మాదిరిగా, గుట్టల మధ్య వున్న సందులోనుంచి వినవచ్చింది భీకరమైన గురక.

ఎందుకైనా మంచిదని ఒక పాదాన్ని వెనక్కి జరిపి ప్రక్కకు తిరిగాడు షాడో.

పద్యం పూర్తి అయిపోయింది.... శృతి భంగం కలగకుండా ఆదే వూపుతో రాగాలాపన ప్రారంభించాడు గంగారాం.

ఆపైన భరించటం చేతకాక చేతులతో గుండెల్ని బాదుకుంటూ సందులోనుంచి ఇవతలకు దూకేశాయి హోకూకులు.

"కమాన్ గంగూ.... కమ్ బేక్ యూ బ్లడీ ఫూల్...." అని హెచ్చరిస్తూ పరుగు ప్రారంభించాడు షాడో.

తీస్తూ తీస్తూన్న రాగాన్ని గాలికి వదిలేసి, పిక్కబలం చూపించాడు గంగారాం.

బండల మీది నుంచి ఎగిరెగిరి దూకుతూ, కొండ గుట్టల వెనక్కి చేరుకున్నారు యిద్దరూ.

ఎడమ భుజం మీద వ్రాలాడుతున్న ఫాక్స్‌ని కుడి భుజం మీదికి మార్చుకుంటూ వులిక్కిపడి ఆగి పోయాడు షాడో.

బండల మీది నుంచి ఎగురుతూ రావటం వల్ల తిరిగి రేగాయి ఫాక్స్ వంటి మీది గాయాలు. ఎర్రటి రక్తం బొట్లు బొట్లుగా జారుతోంది షాడో శరీరం మీదికి.

కొండ గుట్టల వెనుక అక్కడక్కడా పెరిగి వున్నాయి అనేక రకాల ముళ్ళ చెట్లు. వాటి మధ్య ఫాక్స్‌ని పడుకోబెట్టి గాయాలకు కట్టు కట్టటం మంచిదేమో అన్న ఆలోచన షాడో హృదయంలోకి ఎంటర్ అయింది.

అదే సమయంలో తోకచుక్క మాదిరిగా రివ్వున వచ్చిందొక బండరాయి. గింగిరాలు తిరుగుతూ అతనికి నాలుగు అడుగుల దూరంలో నేలను తాకి ముక్కలు ముక్కలై పోయింది.

అప్రయత్నంగా ప్రక్కకు దూకుతూ తల తిప్పి వెనక్కి చూశాడు షాడో. వంద గజాల దూరంలోకి వచ్చేశాయి హాకూకులు. క్రింద వున్న బండల్ని ఎత్తి ముందుకు విసురుతున్నది వాటిలో ఒకటి.

"సామాన్యమైన జంతువులకు యింత తెలివి వుండదు... వీటికి ట్రయినింగ్ యిచ్చిన వాడు ఎవడో గాని, సూపర్ ఇంటెలిజెంట్ అయివుంటాడు...." అంటూ ముందున్న బండల మధ్య తల దాచుకోబోయి, ఆనందం పట్టలేక బిగ్గరిగా అరిచాడు గంగారాం.

రెండు అంగల్లో అతన్ని సమీపించిన షాడోకి ఆ బండల ప్రక్కగా మెలికలు తిరుగుతూ పైకి పోతున్న కాలి బాట ఒకటి కనిపించింది.

"నరమానవుడు ఎవడూ అడుగు పెట్టని ఈ దరిద్రపు ప్రదేశంలోకి యింత చక్కటి బాట ఎలా వచ్చింది ? మన బాధల్ని చూడలేక ఆకాశంలో తిరిగే దేవతలు ఎవరో దీన్ని సృష్టించి వుంటారు. సందేహం లేదు" అంటూ ఆ బాట మీదుగా పరుగు ప్రారంభించాడు గంగారాం.

అది చూశాయి హొకూకులు. భీకరంగా అరిచి మరింత వేగంగా వెంటాడటం మొదలెట్టాయి.

ఫాక్స్ వంటి మీది గాయాల్ని గురించి ఆలోచించటం మానేశాడు షాడో. ఎగుడు దిగుడుగా వున్న ఆ బాట మీదే దృష్టిని నిలిపి, గంగారాంని అనుసరించాడు.

సరిగ్గా ఒక గంట తరువాత, ఆ చుట్టు పట్ల వున్న పర్వత శిఖరాలన్నిటిలోకి అతి పెద్దదయిన అబుటూ శిఖరం మీద వారిని కార్నర్ చేశేశాయి హొకూకులు.

కోరలు కనబడేలా నోరు తెరిచి, మర్రి చెట్టు మొదలు వంటి తన చేత్తో గంగారాం వీపు మీద బలంగా చరిచింది వాటిలో ఒకటి. అత్యంత లాఘవంగా పైకి ఎగిరి పాదాలతో షాడో వీపు మీద తన్నింది మరొకటి.

దారి ప్రక్కనే వున్న బండరాయి మీద పడి ముఖం పగల గొట్టుకున్నాడు షాడో. చావో బ్రతుకో తేల్చుకోవలసిన సమయం వచ్చేసిందని గ్రహించి, భుజం మీది ఫాక్స్‌ని అలాగే నేలకు వదిలేస్తూ లేచి నిలబడ్డాడు.

చేతుల్ని ముందుకు జాచి అతని మీదికి దుమికింది ఒక హూకూకు. నడుము పట్టుకొని నేలకేసి కొట్టబోయింది. ఆఖరి క్షణంలో క్రిందికి వంగి నేర్పుగా తప్పించుకున్నాడు షాడో. రెండు అడుగులు పక్కకు వేసి బలంగా విసిరాడు కుడిపాదాన్ని.

అతనితో పాటు ప్రక్కకు తిరగబోతున్న ఆ జంతువు నడుముకు కనెక్ట్ అయింది అతని పాదం.

ఎటువంటి దెబ్బనయినా అవలీలగా భరించే ఆ భీకర మృగం, ఈదురుగాలి వీచినట్లు వణికి పోయింది.... నేలను కంపింపచేస్తూ కదులుతున్న దాని పాదాలు విచిత్రంగా తడబడ్డాయి.

"కొట్టు గురో.... అక్కడే కొట్టు.... ఈ దరిద్రపు జంతువుల బలం అంతా వాటి నడుములలోనే వున్నట్లు కనిపిస్తోంది...." వెంటనే అరిచి షాడోని హెచ్చరించాడు గంగారాం.

పన్నెండు అడుగుల ఎత్తున్న పెద్ద బండ మీదికి ప్రాకి, కాలుమీద కాలు వేసుకొని కూర్చుని వున్నాడతను. ఆ బండ మీదికి ఎక్కి అతన్ని పట్టుకోవాలని శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాయి రెండు హూకూకులు. బరువైన వాటి పాదాలకు పట్టు దొరకటం లేదు.

తన మెడ మీదికి వస్తున్న రెండో హూకూకు చేతుల్ని తప్పించుకొని వెనక్కి పల్టీ కొట్టాడు షాడో. చటుక్కున క్రిందికి వంగి, ఒక పెద్ద బండరాయిని మొదటి జంతువు నడుము మీదికి విసిరేశాడు.

రివ్వున వస్తున్న ఆ రాయిని చూసి తప్పించుకోవటానికి విశ్వప్రయత్నం చేసిందది. ప్రయోజనం లేకపోయింది. సూటిగా పోయి ఆ రాయి దాని వెన్ను మీద పడటం, బాధగా మూలిగి అది క్రిందికి దొర్లటం ఒకేసారి జరిగింది.

అదే సమయంలో వూహించరానంత వేగంతో ముందుకు దూకి షాడోని పట్టుకుంది రెండవ జంతువు. భయం కలిగించే విధంగా నోటిని తెరిచి మెడ మీదికి వంగింది.

దాని చేతుల్ని గట్టిగా పట్టుకొని, వెనక్కి నెట్టే ప్రయత్నం చేశాడు షాడో. ఉన్న చోటినుంచి ఒక్క అంగుళం కూడా జరగలేదది. గుండెలు జలదరించేటట్లు గురుకపెడుతూ కోరలతో కంఠాన్ని బిగించి పట్టుకుంది.

పదునైన కత్తులు గొంతులో దిగబడినట్లు భరించరాని బాధ షాడో నరాల్ని జివ్వుమనిపించింది. నల్లటి సిల్కు పరదాలు ప్రత్యక్షం కాసాగాయి అతని కనుల ముందు.

బండరాయి మీద బాసిపట్టు వేసుకొని, తనను పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్న హూకూకులను సూటి పోటి మాటలతో వెక్కిరిస్తున్నాడు గంగారాం. షాడో దుస్థితిని గమనించేసరికి చలి జ్వరం వచ్చినట్లు అయిందతనికి.

“అయ్యబాబోయ్! ఒక్క క్షణం దాన్ని ఆపు గురూ.... ఒక్క క్షణం ఆపావంటే నేను వచ్చేస్తాను.” అంటూ లేచి నిలబడ్డాడు. గుండెల నిండా గాలి పీల్చుకొని గాలిలోకి ఎగిరాడు.

ముంచుకు వస్తున్న మైకపు తెరలను ఛేదించటానికి ప్రయత్నిస్తూ, అతి ప్రయత్నం మీద ఎడమ చేతిని ముందుకు లాక్కున్నాడు షాడో. చూపుడు వ్రేలిని స్టిఫ్‌గా నిలబెట్టి, బలంగా పొడిచాడు హొంకూకు కంటి మీద.

అదిరి పడి వెనక్కి లాక్కుంది అది. కుడి చేత్తో అతని భుజాన్ని మెలిపెట్టి ముందుకు వంగింది మళ్ళీ.

పల్టీలు కొడుతూ వచ్చేశాడు గంగారాం. సూటిగా, స్ట్రెయిట్‌గా వచ్చి దభేలున పడ్డాడు దాని నడుము మీద.

కరెంట్ షాక్ కొట్టినట్లు షాడోని వదిలి యింతెత్తున గాలిలోకి ఎగిరింది ఆ హొంకూకు. నడుమును రెండు చేతులతోను పట్టుకొని, తల తెగిన కోడి తిరిగినట్లు గిర్రున తిరిగింది రెండు రౌండ్లు. మూడో రౌండ్ తిరుగుతూ, తిరుగుతూ, విరుచుకు పడిపోయింది.

పాదాలు నేలకు ఆనిన మరుక్షణం దగ్గర్లో వున్న లావాటి కొండరాయిని తీసుకొని పెడబొబ్బలు పెడుతూ వెనక్కి తిరిగాడు గంగారాం. బండరాయిని వదిలి, అతని వైపు వస్తున్నాయి మిగిలిన హొంకూకులు రెడూ. పడిపోయిన తమ సహోదరుల్ని చూసుకునే సరికి దిగజారి పోయింది వాటి ధైర్యం. గంగారాం బొబ్బలు వాటిని మరింతగా బెదరకొట్టేశాయి.

ముందుకు వచ్చినట్లే వచ్చి, పరుగు ప్రారంభించాయవి. రెండు క్షణాల్లో ఆ ప్రదేశాన్ని వదిలి చీకట్లలో కలిసిపోయాయి.

"నడుముల మీద దెబ్బ పడితే యివి ఎందుకూ పనికి రావని మనకు ముందే తెలిసి వుంటే ఎంత బాగుండేది గురూ! పడుతూ లేస్తూ పరిగెత్తు కొచ్చే బాధ తప్పేది...." అంటూ షాడోకి చేయి అందించి లేపాడు గంగారాం. బండరాళ్ళ మధ్యలో పడివున్న ఫాక్స్ వైపు అడుగులు వేస్తుండగా వినవచ్చిందా శబ్దం.

బరువైన శరీరాలు పెద్ద గోతిలో పడినట్లు - బయటికి రాలేక భీకరంగా అరిచినట్లు అనిపించింది వారిద్దరికీ.

ఫాక్స్ దగ్గరికి పోయే ఆలోచనను మానుకొని ఆ శబ్దం వినవచ్చిన వైపుకు పరుగు తీశాడు గంగారాం.

వంద అడుగుల దూరం పోగానే కనిపించింది ఒక దృశ్యం.

చీకటిలో దారి సరిగా కనిపించక, బాట ప్రక్కనే వున్న పెద్ద గోతిలో పడి వున్నాయి పారిపోయిన హోకూకులు. పైకి రావటం చేతకాక చెవులు చిల్లులు పడేటట్లు అరిచి గోల చేస్తున్నాయి.

"ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతారన్న మాట కొంతవరకూ నిజం అయింది గురూ.... ఇక మనం యిక్కడి నుంచి వెళ్ళిపోదాం పద...." అంటూ, ఫాక్స్‌ని భుజం మీద వేసుకొని బాట వైపు తిరిగాడు గంగారాం.

సరిగ్గా అప్పుడే అబుటూ శిఖరం ఆవలి వైపు నుంచి వినవచ్చాయి పెద్ద పెద్ద అరుపులు.

ఎత్తిన పాదాన్ని ఎత్తినట్లే క్రిందికి దించుతూ వెనక్కి తిరిగాడు షాడో. వెంటనే అతని చేతుల్ని గట్టిగా పట్టుకున్నాడు గంగారాం.

"వద్దు గురూ.... దారిన పోయే దరిద్రాలన్నిటినీ నెత్తి మీదికి ఎక్కించుకొని యిప్పటికే పడరాని పాట్లు పడుతున్నాం. ఇప్పుడు యింకో కొత్త తలనొప్పిని కావాలని ఆహ్వానించుకోవటం ఏమీ బాగోలేదు. మన దారిన మనం పోదాం పద...." బాటవైపు లాగటానికి విశ్వ ప్రయత్నం చేస్తు బ్రతిమిలాడాడు.

అతని మాటలు పూర్తి కాకముందే పెద్ద పెట్టున మరోసారి వినవచ్చాయి ఆ ఆక్రందనలు. ఆపైన ఆగలేక పోయాడు షాడో. అతని చేతుల్ని విసిరికొట్టి శరవేగంతో శిఖరం ఆవలి వైపుకి పరుగుతీశాడు.

## 17

"... క్రమం తప్పకుండా నీకు పూజలు చేస్తున్నాం.... నీ కథల్ని గాథల్ని ఒకటికి పదిసార్లు చెప్పుకొని మురిసిపోతున్నాం. ఇన్ని చేస్తున్నా నీకు మా మీద దయగలగటం లేదు తోషీవాన్! మా ప్రార్థనలు నీ మనసును కరిగించటం లేదు." కన్నీటి చారికలతో మలినం అయిన ముఖాల్ని పైకి ఎత్తి ప్రార్థించాడు మితూబిషీ.

తెల్లటి కోరలతో, పెద్ద పెద్ద కొమ్ములతో, బ్రహ్మరాక్షసుడిగా కనిపించే వెదురు బుట్టను తలకు తగిలించుకొని, పొడుగాటి శూలాన్ని చేత పట్టుకొని ఠీవిగా నిలబడి వున్నాడు తోషీవాన్. మితూబిషీ ప్రార్థనలు అతని చెవికి చేరిన జాడలు ఎక్కడా కనిపించటం లేదు.

ఉన్నట్లుండి చివ్వున లేచి నిలబడ్డాడు మితూబిషీ.

“అబుటూ శిఖరం మీద హాయిగా నిద్ర పోతున్న నీకు, మానవులమైన మా మాటలు వినిపించటం లేదని నాకు యిప్పుడు అర్థం అయింది. ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటున్న నా ముద్దు బిడ్డలు నలుగుర్నీ నీకు బలి యిస్తాను. మానవ శరీరాలను వదిలి ఆత్మ స్వరూపాలతో అబుటూ శిఖరం ఎక్కుతారు వాళ్ళు. నిన్ను నమ్ముకున్న పేద ప్రజల ఆక్రందనల్ని స్వయంగా నీ చెవికి చేరుస్తారు....” అంటూ విగ్రహం చెంతనే వున్న పెద్ద కత్తి నొకదాన్ని అందుకున్నాడు.

సజల నయనాలతో ఒక ప్రక్కగా నిలబడి వున్న అతని బిడ్డలు నలుగురూ ముందుకు వచ్చి విగ్రహం ముందు మోకరించారు.

అంత వరకూ దూరదూరంగా నిలబడి వున్న గ్రామస్థులందరూ, ఒక్కసారిగా ముందుకు దూకి మితూబిషీ చేతుల్ని గట్టిగా పట్టుకున్నారు.

“దయచేసి నన్ను వారించకండి.... ఆమాయకులైన ప్రజలు ఆ బందిపోట్ల దాడికి బలియై పోతుంటే, చీమ కుట్టినట్లయినా చలించని తోషీవాన్‌ని నిదుర లేపాలి.... అవసర సమయంలో ఆదుకుంటానని మన పూర్వీకులకు అతను యిచ్చిన మాటను గుర్తు చేయాలి. అందుకు యిదొక్కటే మార్గం....” అంటూ వారందర్నీ విదిలించి కొట్టి, చేతుల్లోని కత్తి ని పైకి ఎత్తాడు మితూబిషీ.

బాష్పధారలు బుగ్గల్ని తడిపేస్తుండగా చేతులు జోడించి పర్వత శిఖరం వైపు తిరిగారు గ్రామస్థులు.

"రక్షించు తోషీవాన్.... అపురూపంగా పెరిగిన అబలలు నలుగురు నీ పేరు మీద బలి కాబోతున్నారు.... రక్షించు.... రక్షించు...." అంటూ దశ దిశలూ మార్మోగేటట్లు ముక్త కంఠాలతో అరిచారు.

ఆ అరుపులతో నిమిత్తం లేనట్లు పెదవులు బిగించాడు మితూబిషీ. గుండెల నిండా గాలి పీల్చుకొని బలంగా క్రిందికి దించాడు చేతిలోని కత్తి ని.

మాటలతో అతన్ని ఆపగలననే నమ్మకం లేకపోయింది అప్పుడే అక్కడికి వచ్చిన షాడోకి.

అప్రయత్నంగా ముందుకు దూకి తోషీవాన్ విగ్రహం చేతుల్లో వున్న శూలాన్ని వూడపీకాడు.

"అర్థంలేని ఆవేశంతో అనవసరమైన హత్యాకాండను కొనసాగిస్తావా ? వయసు ముదిరినా నీ బుద్ధి ముదరలేదు బాబా...." అంటూ క్రిందికి దిగుతున్న కత్తి ఎగిరి అవతల పడి పోయేటట్లు కొట్టాడు మితూబిషీ చేతుల మీద.

పర్వత శిఖరం మీది నుంచి పడుతూ లేస్తూ పరిగెత్తుకు రావటం వల్ల ఎర్రటి జేగురుమట్టి అతని వంటినిండా అలుముకుని వుంది. పుచ్చ పువ్వు వంటి పండు వెన్నెల కండలు తిరిగిన అతని శరీరాన్ని మరింత మాగ్నిఫై చేసి చూపిస్తోంది. రాక్షసి ముఖం కల వెదురు బుట్ట తప్ప, తోషీవాన్ విగ్రహానికీ, అతనికి అట్టే తేడా కనిపించటం లేదు.

"మా ప్రార్థనల్ని ఆలకించి వచ్చేశావా తోషీవాన్! ఇంత కాలానికి మా మీద దయ కలిగిందా ?" పెద్ద పెట్టున అరుస్తూ అమాంతం అతని పాదాల మీద పడి పోయాడు మితూబిషీ.

అదిరిపడి వెనక్కి పరిగెత్తబోయాడు షాడో. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. చెవులు చిల్లులు పడేలా జయ జయ ధ్వానాలు చేస్తూ అతన్ని చుట్టు ముట్టారు గ్రామస్థులు.

వారి భ్రమను ఎలా తొలగించాలో అర్థం కాక నిస్సహాయంగా గంగారాం వైపు చూశాడు షాడో.

వెంటనే యాక్షన్‌లోకి దిగాడు గంగారాం. అటూ యిటూ చూసి, ఒక పెద్ద వెదురు కర్రను అందుకున్నాడు. "తప్పుకోండి.... తప్పుకోండి...." అని అరుస్తూ దానితో దొరికిన వాళ్ళని దొరికినట్లు బాది వదిలాడు.

"అయ్య బాబోయ్! సుజీటోయోటా కూడా వచ్చేశాడు.... అతని మాట వినక పోతే మనకు మంచినీళ్లు పుట్టవు...." అంటూ ఆదరా బాదరాగా షాడోని వదిలి దూరంగా పారిపోయారు గ్రామస్థులు.

"మైగాడ్! సుజీటోయోటానా ? వాడెవడు ? ?" ఆశ్చర్యంగా తనలో తను అనుకోబోయి పైకే అనేశాడు షాడో.

అతని పాదాల దగ్గిరే తిష్ట వేసుకొని వున్నారు మితూబిషీ ముద్దు బిడ్డలు నలుగురూ.

“ఆహా‹ తోషివాన్! మమ్మల్ని వెక్కిరించటానికి అలా అంటున్నావు గాని, సుజీటోయోటా ఎవరో నీకు తెలియదా ? తనకు సరయిన పూజలు చేయటం లేదని వర్షాలకు అధిదేవత నిషీ ఆగ్రహించి, నీటి బొట్టు కూడా నేలమీద లేకుండా చేస్తే ఫుజీ పర్వతాన్ని పగల గొట్టి సుజుకూ నదిని సృష్టించింది నీ స్నేహితుడైన సుజీటోయోటానే గదా! మాకు నీ కథలతోపాటు నీ స్నేహితుడి కథలు కూడా కంఠతా వచ్చు....” అన్నది ఒక బాలిక.

వాళ్ళని కూడా దూరంగా తరమటానికి వస్తున్న గంగారాం చెవికి చేరాయి ఆ మాటలు. అతనికి తెలియకుండానే చేతుల్లో నుంచి జారి క్రింద పడి పోయింది వెదురుకర్ర.

వెంటనే వచ్చి అతన్ని కూడా చుట్టుముట్టారు గ్రామస్థులు.

“ఇక ఎదురు తిరిగి లాభం లేదు గురూ.... వీళ్ళ గోల ఏమిటో కనుక్కొని ఎంత తొందరగా యిక్కడి నుంచి బయట పడగలిగితే అంత మంచిది....” షాడో చెవిలో గుసగుసలాడాడు గంగారాం.

గాఢంగా నిట్టూర్చి ఎడమ చేతిని పైకి ఎత్తాడు షాడో.

ఒక్కసారిగా అణిగి పోయింది అక్కడి గోల. గుండు సూది క్రింద పడినా వినిపించేటంత నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది.

“బందిపోట్లు మా గ్రామం మీదికి రాబోతున్నట్లు వార్త వచ్చింది తోషీవాన్.... ఆహార పదార్థాలు, అమితమైన ధనంతో పాటు అందమైన ఆడపిల్లల్ని కూడా సిద్ధం

చేసి వుంచమని కబురు వచ్చింది." అంటూ లేచి నిలబడ్డాడు మితూబిషీ. తన దుస్తుల్లోనే దాచివుంచిన ఒక వెదురు పలకను తీసి అందించాడు.

పదునైన కత్తి మొనతో ఆ పలక మీద చెక్కి వున్నాయి అతను చెప్పిన మాటలు. క్రింద సంతకానికి బదులు భీకరమైన కెండో ఖడ్గం గీయబడి వుంది.

"మరి ఈ విషయం మీ రక్షక భటులకు తెలియ పరచకుండా, ఎందుకు కూర్చున్నారు ? ఇటువంటి విషయాల్ని ముందుగా మిమ్మల్ని పరిపాలించే నాయకులకు తెలియపరచ వలసిన బాధ్యత మీకు లేదా ?" నొసలు ముడి వేస్తూ తీవ్రంగా అడిగాడు షాడో.

అడిగాడన్న మాటేగాని, అది అసాధ్యమైన పని అని అతనికి తెలుసు. అరణ్య ప్రాంతాల్లో వుండే ఆ గ్రామాలకు సరయిన రక్షణ కల్పించలేక పోతున్నది పోలీస్ డిపార్ట్‌మెంట్. ఎక్కడో వందమైళ్ళకు ఒకటి చొప్పున వుంటాయి పోలీస్ స్టేషన్లు. కబురు అంది వాళ్ళు వచ్చేసరికి తమ పనిని పూర్తి చేసుకుపోతూ వుంటారు బందిపోట్లు.

షాడో ప్రశ్నకు సమాధానంగా ఒక పెద్ద చెక్క పెట్టెను తెచ్చి అతని పాదాల ముందు వుంచారు గ్రామస్థులు. వణుకుతున్న చేతులతో మూత తీశాడు మితూబిషీ.

కత్తితో ముఖం మీద కొట్టినట్లు అయి చటుక్కున కనులు మూసుకున్నాడు షాడో.

పదునైన కత్తులతో పొడిచి పొడిచి ప్రాణాలు తీయబడ్డ ఒక యువకుడి శరీరం వుంది ఆ పెట్టెలో.... ప్రాణాలు పోయిన తర్వాత కూడా కొట్టి వచ్చినట్లు కనిపిస్తోంది అతని ముఖంలో చోటు చేసుకొని వున్న భయం.

"కబురు అందగానే నా కొడుకును రక్షక భటుల కోసం పంపించాను తోషీవాన్.... దారి మధ్యలో అతన్ని చంపి, నాకు బహుమతిగా పంపించారు బందిపోట్లు...." అంటూ బావురు మన్నాడు మితూబిషీ.

అతని భుజం మీద చేయి వేసి అనునయిస్తూ పైకి చూశాడు షాడో. ఆకాశం మధ్యలోకి వచ్చేస్తున్నాడు చంద్రుడు.... అర్ధరాత్రి కావస్తున్న దనటానికి చిహ్నం అది....

తెల్లవారే సమయంలో, అందరి కనుల మీదా నిద్రాదేవత తాండవించే అదనులో చడీ చప్పుడు లేకుండా వచ్చి పడతారు బందిపోట్లు.... వారిని ఎదుర్కోవాలంటే వెంటనే చేయాలి తగిన ఏర్పాట్లు.

శరవేగంతో ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేశాడతను.

"ఆల్‌రైట్.... మీరందరూ పోయి మీకు తోచిన ప్రదేశాల్లో తలదాచుకోండి. నేను సైగ చేసేవరకూ వీధుల్లోకి మాత్రం రాకండి.... మీలో సాహసం గల యువకులు పదిమంది, పొడుగాటి మోకుల్ని పట్టుకొని నాతోపాటు అబుటూ శిఖరం మీదికి రండి." అంటూ ఆజ్ఞలు జారీ చేసి వెనక్కి తిరిగాడు.

నిశబ్దంగా లేచారు గ్రామస్థులు. నిముషంలో తలా ఒక దిక్కుకు పోయి మాయం అయినారు. పొడుగాటి మోకుల్ని భుజాలకు వ్రేలాడ తీసుకొని శిఖరం ఎక్కుతున్న షాడో వెనుక పరుగులు తీశారు పదిమంది యువకులు.

"మీకు వీలయితే యితని గాయాలకు కట్లు కట్టి ఏవైనా మందులు వాడండి...." అంటూ భుజం మీద వున్న ఫాక్స్‌ని మితూబిషీ చేతుల్లోకి నెట్టి తను గూడా పరుగు తీయబోయాడు గంగారాం. పది అడుగులు వేసి ఏదో గుర్తుకు వచ్చినట్లు వెనక్కి తిరిగాడు.

విస్ఫారిత నేత్రాలతో అతనివైపే చూస్తున్నారు మితూబిషీ బిడ్డలు. సుజీటొయోటా వట్టి తిండిపోతని వారికి తెలిసిన కథలు చెపుతున్నాయి. మరి, అంత సేపు అక్కడ వుండి కూడా అతను తిండి విషయం ఎత్తడేమిటి ? ? ఆ మాట అనుకుంటుండగానే రివ్వున వారి దగ్గిరికి వచ్చేశాడు గంగారాం.

"మీలో పచ్చళ్ళు చేయటం ఎవరికి వచ్చు ?" అని అడుగుతూ.

"నాకు వచ్చు.... నేను బాగా చేస్తాను...." ఒకరితో ఒకరు పోటీ పడుతూ ఒకేసారి అన్నారు బాలికలు నలుగురూ.

"ఆల్‌రైట్.... నాకు మిరియాల పొడి అంటే మహా యిష్టం. చక్కగా ఎండిన మిరియపు గింజల్ని ఏరి, రోట్లో వేసి బాగా నూరండి. తెల్లటి నూనెలో ఆ పొడిని కలిపి ఈ విగ్రహం పాదాల దగ్గిర సిద్ధంగా వుండండి. నేను తిరిగి వచ్చేసరికి అంతా పూర్తి అయిపోవాలి." అంటూ వెనుతిరిగి పర్వతంవైపు పరుగుతీశాడతను.

నోరు వూరించే రకరకాల ఆహార పదార్థాలను అడగకుండా, వట్టి మిరియాల పొడిని అడిగినందుకు ఆశ్చర్యపోతూ, హడావుడిగా తమ యింటివైపు పరుగు తీశారు ఆ బాలికలు.

ఖచ్చితంగా రెండు గంటల తరువాత గాలికంటె వేగంగా గ్రామంలోకి దూసుకు వచ్చాయి వంద అశ్వాలు. భగభగలాడుతున్న కాగడాలను పట్టుకొని వాటి మీదినుంచి క్రిందికి దూకారు బందిపోట్లు.

"ఎక్కడ ? గ్రామపెద్ద మితూబిషీ ఎక్కడ ? ?" ఖంగుమంటున్న కంఠంతో వూరంతా వినిపించేటట్లు అరిచాడు అందరి కంటె ముందుగా వచ్చిన ఒక ముసుగు బందిపోటు.

తన యింటి ముందు అరుగు మీద కూర్చుని వున్నాడు మితూబిషీ. నిర్భయంగా లేచి అతని ముందుకు పోయాడు.

"ఏవి ? మేము అడిగిన వన్నీ ఎక్కడ వున్నాయి ?" కదం తొక్కుతున్న అశ్వాన్ని అతని మీదికి పోనిస్తూ ప్రశ్నించాడు ముసుగు మనిషి.

"మీకు కావల్సిన వేమిటో మీరే తీసుకోండి.... మా కంఠంలో ప్రాణం వుండగా మా అంతట మేము ఇవ్వం." జంకు గొంకు లేకుండా సమాధానం యిచ్చాడు మితూబిషీ.

పళ్ళు కొరుకుతూ కాలి మడమతో అశ్వాన్ని అదిలించాడు ముసుగు మనిషి. చెవులు చిల్లులు పడేటట్లు సకిలిస్తూ ముందు కాళ్ళను గాలిలోకి విసిరిందది.

ముఖమంతా రక్త సిక్తం అవుతుండగా తూలి క్రింద పడిపోయాడు మితూబిషీ.

"తగల బెట్టండి.... గ్రామాన్ని నిలువునా తగల బెట్టండి. పొండి...." అని ఆజ్ఞాపిస్తూ, అశ్వాన్ని మరోసారి మితూబిషీ మీదికి దూకించాడు ముసుగు మనిషి.

చేతిలో వున్న శూలాన్ని పైకి ఎత్తి గురి చూశాడు షాడో.

"గెట్ రెడీ గంగూ.... గెట్ రెడీ...." అని హెచ్చరిస్తూ ఒక అడుగు ముందుకు వేసి బలంకొద్దీ విసిరాడు.

రివ్వున గాలిలోకి లేచి సూటిగా వచ్చింది శూలం. మితూబిషీ గుండెల మీద అడుగులు వేయబోతున్న అశ్వం దారుణంగా సకిలిస్తూ విరుచుకు పడి పోయింది.

ఆఖరి క్షణంలో క్రిందికి దూకి నేర్పుగా ప్రాణాలు కాపాడుకున్నాడు ముసుగు మనిషి. అశ్వం మెడ మీద దిగబడిన శూలాన్ని చూసేసరికి చింత నిప్పుల్లా తయారయినాయి అతని నేత్రాలు.

"మన హెచ్చరికల్ని పెడ చెవిని బెట్టి ఆయుధాలు ధరించారు గ్రామస్థులు.... పట్టుకోండి వాళ్ళని.... ప్రాణాలు తీసి నా వద్దకు తీసుకురండి...." పిచ్చి పట్టినట్లు నేలను తంతూ తన అనుచరుల్ని పిలిచాడు.

ఇళ్ళ మీదికి పోతున్న బందిపోట్లు అందరూ వెనుతిరిగి అతని దగ్గిరికి రావటాన్ని గమనిస్తూ తోషీవాన్ విగ్రహం ముందు నేలను తడిమాడు గంగారాం. వెంటనే అతని చేతికి తగిలిందొక మట్టి పాత్ర. దాన్ని తీసుకొని వేగంగా షాడో దగ్గిరికి పరుగు తీశాడతను.

కాళ్ళకు చేతులకు కట్టి వున్న తాళ్ళను తెంచుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తున్నాయి, కొండ మీది గోతిలో నుంచి వాళ్లు జాగ్రత్త గా బంధించి తెచ్చిన హొకూకులు రెండూ.

మట్టి పాత్రలోని మిరియాల పొడిని వేళ్ళనిండా తీసుకొని చటుక్కున వాటి కళ్ళకు పులిమాడు గంగారాం.

భరించరాని బాధతో ఆ ప్రదేశం దద్దరిల్లి పోయేటట్లు అరిచి ఇంతెత్తున గాలిలోకి ఎగిరాయవి.

"వదిలేద్దాం తోషీవాన్.... వదిలేయటానికి ఇదే మంచి సమయం...." వాటి నడుములకు బిగించి వున్న తాళ్ళను పట్టుకొని వెనక్కి లాగుతూ అన్నారు షాడోతో కొండమీదికి పోయిన యువకులు.

తొందర పడలేదు షాడో. వారిని కొంచెం శాంతించమన్నట్లు చేయెత్తి సైగ చేశాడు.

హొకూకుల గోల బందిపోట్ల చెవులకు సోకింది. కాగడాలను వూపుతూ కట్ట కట్టుకొని అటువైపు వచ్చేశారు వాళ్ళు.

ఆఖరి క్షణం దాకా ఆగి, ప్రక్కకు దూకాడు షాడో. దుస్తుల్లో వున్న బాకుల్ని తీసి హొకూకుల బంధనాల్ని తెంచేశారు యువకులు. బందిపోట్ల కంటె బిగ్గరిగా అరుస్తూ వాటిని ముందుకు నెట్టారు.

పట్టరాని ఆవేశంతో గుండెలు బాదుకుంటూ బందిపోట్ల మీదికి ఎగబడ్డాయి హోకూకులు. భీకరంగా అరుస్తూ దొరికిన వాళ్ళను దొరికినట్లు నేల కేసి బాదటం మొదలు పెట్టాయి.

హాహాకారాలు చేస్తూ చెల్లా చెదరైనారు బందిపోట్లు. భయంతో వికృతంగా సకిలిస్తూ ఎగిరి గంతులు వేయసాగాయి వారి అశ్వాలు.

"మైగాడ్! ఎక్కడినుంచి వచ్చాయి యివి ? మన మీద తిరగబడే ధైర్యం వీటికి ఎలా వచ్చింది ?" అంటూ హోకూకుల ముందుకు పరుగు తీశాడు ముసుగు మనిషి. ఎవరికీ అర్థం కాని విచిత్ర ధ్వనులేవో వెలువరుస్తూ వాటి దారికి అడ్డం నిలబడబోయాడు.

మిరియాల పొడి కళ్ళల్లో పడితే పరిస్థితి ఎలా వుంటుందో అతనికి చూపించాయి హోకూకులు. గుడ్డిగా ముందుకు దూకి అతని ముఖం పగిలి పోయేటట్లు గుద్దింది ఒకటి. కాళ్ళతో నేలను తడుముతూ అతనికోసం వెతికింది రెండవది.

వేగంగా అవతలికి దొర్లి దాని పాదాలకు అందకుండా తప్పించుకున్నాడతను.

"రండిరా పిరికి సన్నాసుల్లారా.... వీటి చేతులకు అందకుండా బరిసెలతో కుమ్మండిరా!" అని అరుస్తూ లేచి నిలబడబోయాడు.

అలా అరవటమే అతని ప్రాణాలకు ముప్పును తెచ్చిపెట్టింది. నేలను తడుముతూ గిరికీలు కొడుతున్న హోకూకు రెండు అంగల్లో అతన్ని సమీపించి అమాంతం గాలిలోకి ఎత్తేసింది.

నిశ్చేష్టులై పోయారు దూరంగా నిలబడి వున్న బందిపోట్లు అందరూ. అశ్వాలను వదిలి, ఆయుధాలను రెడీగా పట్టుకుంటూ ముందుకు దూకబోయారు వారిలో కొందరు.

ఎగిరి గంతులు వేస్తూ, ముసుగు మనిషిని నేలకేసి బాదింది హోకూకు. ఒక పాదాన్ని అతని గుండెల మీద వేసి, చేతులతో మెడను పట్టుకొని పైకి లేపింది.

పచ్చి మామిడి కొమ్మ విరిగినట్లు ఫట్‌మని మ్రోత చేస్తూ విరిగిపోయింది ముసుగు మనిషి మెడ ఎముక.

కీచుగా అరిచి అలాగే వ్రేలాడబడిపోయా డతను. మెడ విరిగిన మరుక్షణం ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయాయి.

శరవేగంతో దిగజారిపోయింది బందిపోట్ల ధైర్యం. ఉన్నట్లుండి తమ అశ్వాలను వెనక్కి తిప్పి పలాయన మంత్రం పఠించారు.

"ఇదంతా తోషీవాన్ చలవే.... ఆ బంజాయ్ వీరుడి శక్తియుక్తుల ముందు బందిపోట్లు ఎందుకూ కొరగాకుండా పోయారు...." అని అరుస్తూ, షాడో నిలుచున్న ప్రదేశం వైపు పరిగెత్తుకు వచ్చాడు మితూబిషీ.

జయ జయ ధ్వానాలు చేస్తూ యిళ్ళ చాటునుంచి యివతలికి వచ్చారు గ్రామస్థులందరూ.... చేతుల్ని గాలిలోకి ఎత్తి తోషీవాన్‌కి అభివాదం చేస్తూ మిత్సూబిషీని అనుసరించారు.

"మైగాడ్! ఆగండి.... ముందుకు రాకండి!!" ఆందోళనగా వారిని హెచ్చరిస్తూ వీధిలోకి పరుగు తీశాడు షాడో.

బందిపోట్లు పారిపోవటాన్ని చూసిన సంతోషంలో ముందున్న ప్రమాదాన్ని మరిచిపోయారు వాళ్ళు.

పాదాలతో నేలను తంతూ, నేల మీది దుమ్మును ఎత్తి నలుదిశలకూ విరజిమ్ముతున్నాయి దిక్కుతోచని హొకూకులు. తమకు సమీపంలో అడుగుల శబ్దం వినరాగానే కలసి కట్టుగా ముందుకు దూకి చేతులు జాచాయి.

దిక్కులు దద్దరిల్లి పోయేటట్లు షౌట్ చేస్తూ గాలిలోకి ఎగిరాడు షాడో. సూటిగా పోయి ఒక జంతువు నడుము మీద లాగిపెట్టి తన్నాడు. గుండెలు చెదిరేలా గురక పెట్టి ముందుకు పడి పోయిందది.... నడుములు విరిగి పోవటంతో పడిన ప్రదేశంలోనే వుండిపోయింది గిలగిలా కొట్టుకుంటూ.

పాదాలు నేలకు ఆనిన మరుక్షణం రెండవ జంతువువైపు తిరిగాడు షాడో. అప్పటికే జరిగిపోయింది దారుణమైన అనర్థకం.

"తోషీవాన్ వర్ధిల్లాలి.... సుజీటొయోటా వర్ధిల్లాలి!!" అని అరుస్తూ వస్తున్న మిత్సూబిషీ నడుము పట్టుకొని మధ్యకు విరిచేసింది రెండవ హొకూకు.

గొల్లున అరిచారు గ్రామస్తులు. తమ నాయకుడికి పట్టిన దురవస్థ వారిని పిచ్చివాళ్ళుగా మార్చేసింది.

"చంపండి.... దాన్ని చంపి ముక్కలు ముక్కలు చేసేయండి." అని అరుస్తూ గట్టు తెగిన వరదలా ముందుకు దూకారు.

వారి కంఠాల్లో ప్రతిధ్వనించిన ఆవేశం భయాన్ని కలిగించింది కాబోలు, గుడ్డబొమ్మలా వ్రేలాడబడి పోయిన మితూబిషీని అవతలికి విసిరేసి వెను తిరిగింది హాొకూరు. చేతులతో తడుముకుంటూ అబుటూ శిఖరం మీదికి పరుగు తీసింది.

అడ్డం వచ్చిన షాడోని, ఆఖరికి గంగారాంని కూడా రఫ్‌గా అవతలికి నెట్టేసి దాని వెనుక పడ్డారు గ్రామస్థులు.

అడ్డ దిడ్డంగా నేల మీద పడి వున్న మితూబిషీని చేతుల్లో ఎత్తుకొని తోషీవాన్ విగ్రహం ముందు పడుకోబెట్టాడు షాడో.

"ఐ యామ్ సారీ మై ఫ్రండ్.... నేనే గనుక నిజమైన తోషీవాన్‌ని అయివుంటే నీకు ఈ గతి పట్టి వుండేది కాదు. నీ భ్రమను తొలగించకపోవటం నా పొరపాటు...." అంటూ గంగారాంకి సైగ చేసి బందిపోట్లు పారిపోయిన దిశలో పరుగులు తీశాడు.

తాము మితూబిషీకి అప్పగించిన ఫాక్స్ పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవాలన్న కోరిక మనస్సులో మెదులుతున్నా, బలవంతంగా ఆ కోరికను అణుచుకొని అతన్ని అనుసరించాడు గంగారాం.

తూర్పు దిక్కు తెల్లబడే సమయానికి గ్రామాన్ని వదిలి ఆరుమైళ్ళ దూరం పోయారు యిద్దరూ. గ్రామస్థులు ఎవరూ తమను అనుసరించి రావటం లేదని నిశ్చయం కాగానే, దారి ప్రక్క వున్న ఒక చెట్టు క్రింద విశ్రాంతి కోసం ఆగారు.

ఎత్తుగా, వత్తుగా పెరిగిన రకరకాల చెట్లతో, పెద్ద పెద్ద ముళ్ళ పొదలతో నిండి వుంది ఆ ప్రదేశమంతా. గాలి గట్టిగా వీచినప్పుడల్లా ఒక ప్రక్క నుంచి వినవస్తోంది ఎవరో మూలుగుతున్న శబ్దం.

ఉలిక్కి పడి లేచాడు చెట్టు క్రింద కూర్చోబోతున్న షాడో. గంగారాంకి సైగ చేసి ముళ్ళ పొదల్లోకి పరుగు తీశాడు.

వంద గజాల దూరం పోయిన తరువాత ఒక చెట్టు క్రింద వారికి కనిపించింది అందమైన పల్లెపడుచు.

చినిగి పేలికలైన దుస్తులతో, దుమ్ము కొట్టుకున్న ముఖంతో నిస్త్రాణగా పడివున్న దామె. ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ నీటికోసం కలవరిస్తోంది.

"ఇది ఆ బందిపోట్ల పనే అయివుంటుంది గురూ.... సందేహం లేదు. ఆ దొంగనాయాళ్ళని నిలబెట్టి నరికినా పాపం లేదు." అంటూ ముందుకు అడుగు వేయబోయిన గంగారాంని, చటుక్కున ఆపేశాడు షాడో.

"తొందర పడకు గంగూ.... వేళకాని వేళలో, చోటు కాని చోటులో ఇంత అందమైన పిల్ల యిలా పడి వుండటం నాకు అనుమానాల్ని కలిగిస్తోంది.... కొంచెం ఓపిక పట్టు" లోగొంతుకతో అంటూ చుట్టూ చూశాడు.

నిశబ్దంగా వున్నాయి పొదలు.... ఒక్క పిట్ట.... కనీసం ఒక చిన్న పక్షి కూడా చుట్టు పట్ల కనిపించటం లేదు.

"దాహం.... కాసిని మంచినీళ్ళు యిచ్చి నా దాహం తీర్చండి...." ఉన్నట్లుండి గట్టిగా కలవరించింది ఆ యువతి.

అప్రయత్నంగా ముందుకు అడుగు వేయబోయిన గంగారాం, నెత్తి మీద బలమైన దెబ్బవేసి, అతన్ని వెనక్కి లాగేశాడు షాడో. దగ్గర్లో కనిపించిన ఒక పెద్ద బండరాయిని ఎత్తి, యువతికి నాలుగు అడుగుల దూరంలో వత్తుగా పెరిగి వున్న పచ్చిగడ్డి మీద పడేశాడు.

బండరాయి క్రింద పడిన మరుక్షణం ఛట్ మని శబ్దం చేస్తూ గాలిలోకి లేచాయి, నేర్పుగా క్రిందికి వంచివున్న రెండు చెట్టుకొమ్మలు.

కంటికి కనిపించనంత సన్నపాటి తీగెలతో అల్లిన సాలెగూడు ఒకటి పైకి లేచింది ఆ కొమ్మలతోపాటు.

బండరాయి పడిన ప్రదేశంలో తాము అడుగు పెట్టి వుంటే ఏమయ్యేదో వూహించుకునే సరికి చెమటలు క్రమ్మింది గంగారాం శరీరం.

"ఈ పాపిష్టి ప్రదేశంలో ఇంకొక్క క్షణం కూడా వుండద్దు. పారిపోదాం పద గురూ." అంటూ వెనుతిరిగి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

అంత వరకూ నిశబ్దంగా, నిర్మానుష్యంగా కనిపించిన ముళ్ళపొదల మధ్యలోనుంచి పరుగు పరుగున వచ్చి వారిని చుట్టు ముట్టేశారు అనేకమంది దృఢకాయులు. వచ్చీ రావటంతోటే చేతుల్లో వున్న బాణాకర్రల్ని ఎత్తి వారి తలలమీద బలంగా మోదారు.

ఇద్దరు దృఢకాయుల్ని పడగొట్టాడు షాడో. మరో వ్యక్తి చేతుల్లోని కర్రను వూడలాక్కుని గిర్రున తిప్పుతూ ప్రక్కకు పరుగు తీయబోయాడు.

అప్పటి వరకూ అఘమేఘాల మీద నడుస్తున్న వారి అదృష్ట దేవత ముఖం చాటు చేసుకుంది ఒక్కసారిగా.

"పట్టుకోండి.... వాళ్ళని పారిపోనిచ్చారంటే మీ ప్రాణాలు మీకు దక్కవు." అని అరుస్తూ లేచి నిలబడింది నిస్త్రాణ నటించిన పల్లె యువతి. దుస్తుల చాటున దాచి వుంచిన ఒక పెద్ద వైరుచుట్టను తీసి బలంగా ముందుకు విసిరింది.

పాము మాదిరి మెలికలు తిరుగుతూ నేల బారున వచ్చి షాడో పాదాల్ని చుట్టేసిందా వైరు. దృష్టినంతా దృఢకాయుల మీద కేంద్రీకరించివున్న షాడో, తల్లక్రిందులుగా పల్టీ కొట్టి నేలమీద పడిపోయాడు.

ఆనందం పట్టలేక వెర్రిగా అరుస్తూ అతన్ని కమ్ముకున్నారు దృఢకాయులు. ఆ సందడిలో చల్లగా వెనక్కి జరిగి ఒక పొదచాటుకు పారిపోతున్న గంగారాంని గమనించలేక పోయారు వారందరూ.

"నా స్థావరాన్ని తగలబెట్టి నలుగురిలోను నన్ను అవమాన పరిచినందుకు తగిన శాస్తి చేస్తాను మిష్టర్ షాడో.... నీ కళ్ళు పీకి నాలుక కత్తి రించేస్తాను." అంటూ షాడో దగ్గిరికి వచ్చి, దుస్తుల్లో దాచి వున్న కైజారును బయటికి తీసింది పల్లెపడుచుగా నటించిన సుమీ ఇవాటో.

ఆమె ముఖంలో ప్రతిఫలిస్తున్న కక్షను చూడగానే చీమలు పాకినట్లు జలదరించింది షాడో శరీరం. అన్నంత పనీ చేస్తుందేమో అన్న అనుమానం అతని మనస్సులో అడుగు పెట్టింది.

సరిగ్గా అదే క్షణంలో గుండెలు జలదరించేటట్లు పొదల అవతలి ప్రక్కనుంచి వినవచ్చిందొక శబ్దం.

ఉలిక్కిపడి అటు వైపు తిరిగారు దృఢకాయులు అందరూ. కైజారును పట్టుకున్న హస్తం స్వల్పంగా కంపిస్తుండగా తను కూడా అటు తిరిగింది సుమీ ఇవాటో.

మరో సారి వినపడిందా శబ్దం! అరణ్య ప్రదేశాల్లో పెట్రోలింగ్‌కి వచ్చినప్పుడు జపాన్ సైన్యానికి చెందిన ఆశ్వికదళం వుపయోగించే కొమ్ముబూరా మ్రోత అది!!

"గన్నర్స్ గెట్ రెడీ - రైఫిల్స్‌ని ఎయిమ్ చేసి పొదల్ని చుట్టు ముట్టండి.... కమాన్! మార్చ్!!" ఖంగుమంటూ ప్రతిధ్వనించింది అశ్విక దళాన్ని కమాండ్ చేసే కాప్టెన్ కంఠం.

చెవులు చిల్లులు పడేటట్లు సకిలించాయి రెండు అశ్వాలు. పొదల్ని చూసి భయపడింది కాబోలు వేగంగా పరిగెత్తుకు వస్తోంది వాటిలో ఒకటి. నేల మీది రాళ్ళకు తగిలి రిధమిక్‌గా వినవస్తోంది గిట్టల చప్పుడు.

"మైగాడ్! సమయం కాని సమయంలో ఇక్కడికి ఎలా రాగలిగారు వీళ్ళు ?" ఆందోళనగా అన్నది సుమీ ఇవాటో.

"కమాన్! పేల్చండి... రైఫిల్స్‌ని పేల్చండి.... ఫైర్.... ఫైర్..." ఖంగు మంటూ వినవచ్చింది దూరంలో వున్న కాప్టెన్ కంఠం - మరోసారి.

చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల్లా చెల్లా చెదరైనారు దృఢకాయులందరూ. పొదలకు ఆవలి ప్రక్కన వున్న చెట్ల చాటుకు పోయి మాయం అయినారు.

అశ్వాల అలికిడి పొదల్లోకి వచ్చేస్తూ వుండటాన్ని గమనించి తెలివి తెచ్చుకుంది సుమీ ఇవాటో. కైజారును దుస్తుల్లో దాచేస్తూ వెనుతిరిగింది పారి పోవటానికి.

కంటికి కనిపించనంత వేగంతో కదిలాయి షాడో పాదాలు. బాణా కర్ర పెట్టి కొట్టినట్లు ఆమె మోకాళ్ళ మీద తగిలింది బలమైన దెబ్బ. బాధగా అరిచి బోర్లా పడిపోయింది.

“కమాన్ రైడర్స్! అరెస్ట్ దట్ అగ్లీ లేడీ.... కమాన్!” అని అరుస్తూ ఆమె ముందు ప్రత్యక్షం అయినాడు అంతవరకూ దూరంలో నిలబడి ఆర్డర్స్ పాస్ చేసిన కాప్టెన్.

అతన్ని చూడగానే రక్తం లేనట్లు పాలి పోయింది సుమీ ఇవాటో ముఖం. తన కనులను తనే నమ్మలేక తల తిప్పి చుట్టూ చూసింది. అశ్వాలు లేవు. గన్నర్స్ లేరు.... కొమ్ము బూరాను వూది అందర్నీ భయపెట్టే మిలటరీ గైడ్ ఎక్కడా కనిపించటం లేదు

“నీ కోసమే మిలటరీని పిలిపించాను మేడమ్.... నిన్ను పట్టుకోవటం కోసమే ఇంత కష్ట పడ్డాను.” అంటూ గుర్రం మీద కూర్చున్నట్లు ఫోజు పెట్టి నోటితో గిట్టల శబ్దాన్ని సృష్టిస్తూ, ఆమె చుట్టూ రెండుసార్లు రౌండ్స్ కొట్టాడు గంగారాం.

ఆశ్చర్యంతో మ్రాన్పడి పోయింది సుమీ ఇవాటో. రకరకాల శబ్దాలను నోటితో అనుకరించే వారుంటారని విని వున్నది గాని, అనుమానించటానికి ఆస్కారం యిసుమంత కూడా లేకుండా, పర్‌ఫెక్ట్‌గా ప్రొడ్యూస్ చేయగలిగిన వారిని ఆమె చూడటం అదే ప్రథమం.

“తెలివి తేటలు నీకు మాత్రమే కాదు అమ్మడూ.... మాకూ వున్నాయి. నీకు కోపం వస్తే కళ్ళు మాత్రమే పీకుతావు. మాకు కోపం వస్తే ఏం చేస్తామో యిక చూద్దువు గాని.” అంటూ ఆమె జుట్టు పట్టుకొని రఫ్‌గా పైకి లేపాడు గంగారాం.

అదిరి పడి నోరు తెరిచింది సుమీ ఇవాటో.

ఫెడీ మని పెదవుల మీద గుద్దాడు గంగారాం. తలను ముందుకు వంచి మెడ మీద వేశాడు మరో దెబ్బ.

కనుల ముందు మెరుపులు ప్రత్యక్షం అవుతుండగా స్పృహ తప్పి అతని చేతుల్లో వ్రేలాడబడి పోయింది. వెంటనే ఆమెను భుజం మీద వేసుకొని మట్టి రోడ్డు వైపు పరుగు తీశాడు గంగారాం.

కాళ్ళకు తగులుకున్న ఇనుప తీగెలను వదిలించుకొని పరుగు లాంటి నడకతో అతన్ని అనుసరించాడు షాడో.

## 18

బుగ్గల మీద చల్లటి చేయి పడే సరికి వులిక్కిపడి కనులు తెరిచింది సుమీ ఇవాటో.

అబుటూ పర్వతాలకు దూరంగా అక్కడక్కడా కనిపించే కొండ గుట్టల మధ్య పడి వున్నదామె. మట్టి కొట్టుకున్న శరీరంతో, మలినమైన ముఖంతో, రాక్షసుడిలా నవ్వుతూ, ఆమె దగ్గిర కూర్చుని వున్నాడు గంగారాం.

"మా వాడు మంచి ఆకలి మీద వున్నాడు. మీ బాస్ ఎక్కడ వుంటాడో చెప్పేయటం చాలా మంచిది. చెప్పక పోతే నిన్ను కొరుక్కు తినేస్తాడు." పది అడుగుల దూరంలో ఒక బండరాయిని ఆనుకు కూర్చున్న షాడో వెంటనే అన్నాడు.

పళ్ళన్నీ కనిపించేటట్లు నోరు తెరిచి భీకరమైన పోజు ఒకటి యిచ్చేశాడు గంగారాం. పెదవులు కొరుక్కుంటూ, ఆమె భుజాల్ని పట్టుకొని ముందుకు వంగాడు.

కెవ్వున అరిచింది సుమీ ఇవాటో. ముఖమంతా చెమటలు క్రమ్ముతుండగా స్పృహతప్పి పడి పోయింది మరోసారి.

"ఇదేమిటి గురూ ? ఇలా పడి పోయిందేమిటీ ?" అని ఆశ్చర్యంగా అడుగుతూ ఆమె బుగ్గల్ని తట్టబోతున్న గంగారాంని వెనక్కి పిలిచాడు షాడో.

"బలవంతం చేస్తామంటే భయపడి యిలా తెలివి తప్పి పడిపోతూనే వుంటుంది ఈమె.... మనకు కావాల్సిన ఇన్ఫర్మేషన్‌ని సంపాదించాలంటే భయపెట్టకుండా విపరీతమైన బాధకు గురి చేయాలి...." అంటూ అతని చెవిలో ఏదో చెప్పాడు.

పెట్రోమాక్స్ లైటులా వెలిగింది గంగారాం ముఖం.

"ఇప్పుడే వస్తాను గురూ.... ఇక్కడ వున్నట్లు క్షణాల మీద తిరిగి వచ్చేస్తాను...." అంటూ ఆ ప్రదేశాన్ని వదిలి గుట్టల క్రిందికి పరుగు తీశాడు.

అతను వెళ్ళిన పది నిముషాలకు తెలివి వచ్చి కనులు తెరిచింది సుమీ ఇవాటో. బెదురు చూపులతో గంగారాం కోసం వెతికింది. అరగంట తరువాత ఆయాసంతో వగరుస్తూ పరిగెత్తుకు వచ్చాడతను. అక్కడికి దగ్గర్లో వున్న గ్రామం నుంచి తస్కరించుకు వచ్చిన రెండు ఇత్తడి పళ్ళేలను షాడోకి అందించి నేల మీద చతికిల పడ్డాడు.

"ఆల్‌రైట్ మేడమ్.... మా ప్రశ్నకు సమాధానం చెపుతావా చెప్పవా ?" ఒక పళ్ళేన్ని అతని చేతుల్లోనే పెట్టి రెండో పళ్ళెంతో ముందుకు వస్తూ ఆమెను అడిగాడు షాడో.

అతను చేయబోతున్న దేమిటో సుమీ ఇవాటోకి అర్థం కాలేదు. అయినా సరే లెక్క చేయకుండా పెదవులు బిగించి తల వంచుకున్నది.

ఇత్తడి పళ్ళేన్ని ఆమె చెవి దగ్గిర పెట్టి పట్టుకున్నాడు షాడో. లావు పాటి పలుకు రాయితో రిధమిక్‌గా దరువు వేయటం మొదలు పెట్టాడు. రెండు నిముషాల తరువాత రెండో పళ్ళెంతో అతనికి వత్తాసు ఇచ్చాడు గంగారాం.

చెవులు బ్రద్దలై పోతున్నంత బాధ సుమీ ఇవాటోని ఆక్రమించుకుంది. తలలో బాంబర్ విమానాలు ఎగురుతున్న శబ్దం ప్రారంభం అయింది.

"చెప్పు.... సమాధానం చెప్పు.... చెప్పక పోతే నీ జన్మంతా చెవిటిదానివై పోతావు...." అంటూ మరింత వేగంగా దరువు కంటిన్యూ చేశాడు షాడో.

బంధితుల్ని చిత్రహింసలు పెట్టి సమాధానాలు రాబట్టటానికి చైనీయులు వుపయోగించే అతి పురాతనమైన పద్ధతి అది. ఎటువంటి విల్ పవర్ గలవారయినా ఎంతోసేపు ఆ బాధను ఓర్చుకోలేరు.

అరగంటపాటు ఓపిక పట్టింది సుమీ ఇవాటో. ఆ పైన బాధను భరించటం ఆమెకు చేత కాలేదు. చెవి రంధ్రాల నుంచి రక్తం వెలువడుతుండగా గిలగిలా కొట్టుకుంటూ వారి ప్రశ్నకు సమాధానాన్ని చెప్పేసింది.

# 19

"వాట్! అరి వీర భయంకరుడైన వాన్‌టాంగ్ మరణించాడా ? అందాల బొమ్మ సుమీ ఇవాటో బంధించబడిందా ? ఏం మాట్లాడుతున్నారో మీకు అర్థం అవుతోందా ?" నాలుగు మూరల కెండో ఖడ్గాన్ని క్రిందికి దించుతూ అన్నాడు హిరోషి.

"అవును బాస్.... బంజాయ్ వీరుడు తోషీవాన్ వేషంలో వచ్చి కొండ క్రింది గ్రామస్తుల్ని రెచ్చ గొట్టాడు ఆ షాడో.... అతనే సుమీ ఇవాటోని కూడా బంధించి తీసుకుపోయాడు." వినయంగా తలలు వంచుకొని కంపిత స్వరంతో వెల్లడించాడు అతని ముందు నిలబడిన వ్యక్తి.

బంజాయ్ అనే మాట వినపడగానే చింత నిప్పుల్లా ఎర్రబడ్డాయి హిరోషి కనులు. పళ్ళు కొరుకుతూ, ఆ ప్రదేశం దద్దరిల్లి పోయేటట్లు సింహనాదం చేశాడు. చేతిలో వున్న ఖడ్గాన్ని గిర్రున తిప్పుతూ, అమాంతం గాలిలోకి ఎగిరి, ఇరవై అడుగుల దూరంలో వున్న పెద్ద చితుకుల మంట ముందు వాలాడు.

"నా అభిమాన పాత్రుడైన వాన్‌టాంగ్ మృతికి ప్రతీకారం చేయాలి.... వెళ్ళండి.... మన వారందర్నీ తీసుకుని పోయి ఆ షాడో ఎక్కడ వున్నా వెతికి పట్టుకోండి.... వెళ్ళండి." అంటూ మంటల మీది నుంచి అవతలకి దూకి, భయంకరమైన కెండో నృత్యాన్ని ప్రారంభించాడు.

చితుకుల మంటకు పది అడుగుల దూరంలో గుంపుగా పెరిగి వున్నాయి సన్నపాటి సంజూ చెట్లు. రెండు గిరికీలతో వాటిని సమీపించి ఒకే ఒక వ్రేటుతో

అన్నిటినీ తెగ నరికాడు హిరోషీ. ఆరడుగుల ఎత్తున గాలిలోకి ఎగిరి, వాటి వెనుక వున్న పెద్ద కొయ్య దుంగను మధ్యకు విరిచేశాడు.

కంటికి కనిపించనంత వేగంగా తిరుగుతున్న కెండో ఖడ్గాన్ని చూస్తూ గుటకలు మ్రింగారు అప్పుడే అక్కడికి వచ్చిన నలుగురు దృఢకాయులు.

"టోక్యో నుంచి మన వాళ్ళు వచ్చారు బాస్.... మీతో అర్జంటుగా మాట్లాడాలని అంటున్నారు...." దూరదూరంగానే నిలబడి లోగొంతుకతో అన్నాడు ఒకతను.

పది నిముషాల తరువాత శాంతించింది హిరోషీ ఆగ్రహం. ఖడ్గాన్ని నేలలో గుచ్చి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అక్కడికి దగ్గర్లో వున్న ఒక కట్టడం వైపు బయలుదేరాడు.

## 20

"లాభం లేదు మిస్టర్ షాడో.... నీ తెలివి తేటలు యిక్కడ పనికి రావు. హిరోషీ స్థావరంలో అడుగు పెట్టడం నీ తరం కాదు." చిన్నగా నవ్వుతూ ఎత్తి పొడిచింది సుమీ ఇవాటో.

బ్రహ్మాండమైన అజుగాయ్ వృక్షం చాటున నిలబడి ముందు కనిపిస్తున్న దృశ్యాన్ని పట్టి పట్టి చూస్తున్నాడు షాడో.

ఎత్తయిన కొండల మధ్య ఒకే ఒక సన్నటి మార్గం వుంది. దాని ముందు కాపలా నిలబడి వున్నారు పది మంది హిరోషీ అనుచరులు. ఎటువంటి పరిస్థితి ఎదురయినా

తమ స్థానాన్ని వదిలి ఇవతలికి వచ్చేటట్లు కనిపించటం లేదు వారి వాలకం. వారి పొజిషన్‌ని మరికొంచెం క్లోజ్‌గా పరిశీలిద్దామనుకుంటూ నాలుగు అడుగులు ప్రక్కకు వేశాడతను. అదే అదనుగా "శత్రువులు.... శత్రువులు..." అని అరుస్తూ ముందుకు దూకింది సుమీ ఇవాటో.

మెరుపులా పాంటు జేబులో చేయి పెట్టి, తాళాలను తెరిచే సూదిని బయటికి తీశాడు. చూపుడు వేళ్ళమధ్య దాన్ని బిగించి, చిన్న పిల్లలు కాగితం రాకెట్లను వదిలినట్లు మణికట్లను విదిలించాడు.

వింటి నుంచి వెలువడిన బాణంలా వేగంగా పోయి సుమీ ఇవాటో మెడ మీద దిగబడింది అది. కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరి పడిందామె - సూదిని బయటికి తీయటానికి విఫల ప్రయత్నం చేస్తూ విరుచుకు పడి పోయింది.

ఎట్టి పరిస్థితుల్లోను తమ స్థానాన్ని వదిలి ముందుకు రాని హిరోషీ అనుచరులు ఆ దృశ్యాన్ని చూసేసరికి చలించి పోయారు. రూల్స్‌ని, రెగ్యులేషన్స్‌ని అన్నిటినీ మరిచి పోయి ఆదరా బాదరాగా ఆమె దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు.

"అరుగరుగో.... పారి పోతున్నారు. శత్రువులు పారిపోతున్నారు." బిగ్గరిగా అరిచాడు గంగారాం. పెద్ద బండ రాయిని ఎత్తి దూరంలో వున్న పొదలవైపు విసిరేశాడు.

సుమీ ఇవాటో చుట్టూ నిలబడబోతున్న హిరోషీ అనుచరులు శరవేగంగా రియాక్ట్ అయినారు. ఆయుధాల్ని బిగించి పట్టుకొని బండరాయి పడిన పొదల వైపు పరుగు తీశారు.

వాళ్ళు అటు పోగానే, చెట్టు చాటునుంచి యివతలికి దూకాడు షాడో. ఇద్దరే యిద్దరు పడిపోయిన సుమీ ఇవాటో దగ్గిర నిలబడి వున్నారు. పరుగు పరుగున వస్తున్న షాడోని అరక్షణం ఆలస్యంగా గమనించారు వాళ్ళు.

నిశబ్దంగా గాలిలోకి ఎగిరాడు షాడో. శరీరంలోని శక్తినంతా కుడి పాదంలోకి కేంద్రీకరించుకుంటూ ప్రయోగించాడు అత్యంత శక్తివంతమైన ఫ్రంట్ కిక్‌ని.

ముఖం పగిలి నెత్తురు వరదలౌతుండగా వెనక్కి పడిపోయాడు ఒక అనుచరుడు. పాదం నేలను తాకి తాకకముందే డెలివర్ చేశాడు షాడో మరింత ప్రమాదకరమైన డబుల్ కిక్‌ని.

ఎగిరి ఆరడుగుల దూరంలో పడి పోయాడు రెండో అనుచరుడు. అరిచి కేకలు పెట్టే అవకాశం లభించక ముందే అతనికి కూడా స్పృహ తప్పి పోయింది.

అతని పాదాలు పట్టుకొని సన్నగా వున్న మార్గంలో నుంచి స్థావరంలోకి లాక్కుపోయాడు షాడో. నీడలా అతన్ని అనుసరించాడు గంగారాం. రెండో అనుచరుడి చేతులు పట్టుకొని లోపలికి ఈడ్చుకుంటూ తీసుకుపోయాడు.

## 21

"మనం ఎదురు చూస్తున్న అవకాశం యిదే బాస్! సరిహద్దుల్లో పెట్రోలింగ్ డ్యూటీ చేసే సైనిక బృందాలన్నీ ప్రత్యేకమైన శిక్షణ కోసం టోక్యో కంటోన్మెంట్‌కి తిరిగి వచ్చాయి. ఎల్లుండి ఉదయం స్వయంగా ఆ శిక్షణా విన్యాసాలను

పరివేషించటానికి టోక్యో వస్తున్నాడు చక్రవర్తి." అన్నాడు ఎత్తుగా దృఢంగా కనిపిస్తున్న ఆ వ్యక్తి.

చేతులు వెనక్కి కట్టుకొని ఆ గదిలో పచార్లు చేస్తున్న హిరోషీ పెద్దగా నవ్వి అతని భుజం మీద చరిచాడు.

"గతించిపోయిన కెండో ప్రాభవాన్ని దిగంతాలకూ వ్యాపింపచేసే సమయం ఆసన్నమయింది మై ఫ్రెండ్. మన దగ్గిర వున్న టోటో భస్మాన్ని తీసుకుపోయి టోక్యో నగరానికి మంచినీరు సప్లయి చేసే రిజర్వాయర్‌లో కలపండి. ఆ నీటిని తాగి శిలా విగ్రహాల్లా స్తంభించి పోతారు పౌరులు. వారితో పాటు కంటోన్మెంట్‌లో వున్న సైనికదళాలన్నీ నిర్వీర్యమౌతాయి. చక్రవర్తి నగరంలోకి అడుగు పెట్టక ముందే దారికాచి బంధిస్తాం. జరిగింది ఏమిటో అందరూ తెలుసుకునే సరికి, చక్రవర్తి తో పాటు టోక్యో నగరం మన హస్త గత మౌతుంది." అన్నాడు ఆనందంగా.

అంతవరకే విన్నాడు ఆ గది వెనుక ప్రక్క వున్న కిటికీ దగ్గిర నిలుచున్న షాడో. ఆ తరువాత వినే సావకాశం అతనికి లేకుండా పోయింది. పొడుగాటి బరిశెతో నేలను తడుతూ అటుగా వచ్చాడు హిరోషీ అనుచరుడు ఒకతను. కిటికీ దగ్గిర క్రీనీడలో నిలబడి వున్న ఆకారాలను చూడగానే గొంతెత్తి బిగ్గిరిగా అరిచాడు. పళ్ళు కొరుకుతూ అతని వైపు జంప్ చేయబోయిన గంగారాం చేయి పట్టుకొని వెనక్కి పరుగు తీశాడు షాడో. అదే సమయంలో చెవులు చిల్లులు పడిపోయేటట్లు మ్రోగసాగిందొక పెద్ద గంట.

"శత్రువులు.... శత్రువులు.... స్థావరంలోకి వచ్చారు.... కాగడాలు వెలిగించి అన్ని మూలలూ గాలించండి...." అని అరుస్తూ స్థావర ద్వారం దగ్గర్నించి పరిగెత్తుకుంటూ వచ్చారు గార్డులు.

అంతవరకూ చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశబ్దంతో నిండి వున్న ఆ ప్రదేశం, గంట మ్రోగటం మొదలెట్టిన మరుక్షణం, అరుపులతో అల్లకల్లోలం కాసాగింది. భగభగలాడుతున్న కాగడాలను పట్టుకొని నాలుగు ప్రక్కల నుంచీ కమ్ముకు రాసాగారు హిరోషీ అనుచరులు.

కనుచివరల నుంచి వారందర్నీ గమనిస్తూ ఒక ప్రక్కకు పరుగు తీస్తున్న షాడో ముందు ప్రత్యక్షమైంది గోడవున్ వంటి కట్టడం ఒకటి.

గొళ్ళెం పెట్టి వున్న దాని తలుపుల్ని తెరిచి లోపలికి అడుగు పెట్టబోతూ, ఎగిరి వెనక్కు దూకేశాడు షాడో.

తలుపులు తెరుచుకున్న మరుక్షణం, పై నుంచి దబ్‌మని శబ్దం చేస్తూ, అంత వరకూ అతను నిలబడిన ప్రదేశంలో పడింది బరువైన కొండరాయి ఒకటి. వెనక్కు దూకటం ఒక్క అరక్షణం ఆలస్యం అయివుంటే తల పగిలి ప్రాణాలు కోల్పోవలసి వచ్చేది!

రెండు అడుగుల ఎత్తున్న చెక్క పెట్టెలు కొన్ని గోడల ప్రక్కగా నిలబెట్టి వున్నాయక్కడ. వెగటు కలిగించే వాసన ఏదో వాటి మీదినుంచి కట్టడమంతా వ్యాపిస్తోంది.

ముక్కును ఎగబీలుస్తూ గోడవున్‌లో అడుగు పెట్టి ఒక పెట్టె దగ్గరికి పోయి ఓపెన్ చేశాడు గంగరాం. ఎరుపురంగుతో మెరిసి పోతున్న మెత్తటి పౌడర్ ఆ పెట్టెల్లో నింపి వుంది.

ముందుకు అడుగు వేయబోతున్న షాడో, కనులు తిరిగినట్లు అనిపించి గోడను ఆసరాగా చేసుకొని నిలబడ్డాడు.

టోక్యో నగరానికి నీటిని సరఫరా చేసే రిజర్వాయర్‌లో హిరోషీ కలిపించబోతున్న టోటో భస్మం అదేనని గ్రహించేసరికి, తిమ్మిరి ఎక్కినట్లయింది అతని శరీరం.

"పెట్టెను మూసేయ్ గంగూ.... క్విక్." అని గంగారాంని హెచ్చరిస్తూ కట్టడమంతా గాలించాడు.

రకరకాల ఆకులతో, విచిత్రమైన మూలికలతో తయారు చేయ బడతాయి అటువంటి భస్మాలు. ప్రయోగించటం ఎలాగో తెలిస్తే ఆటంబాంబుల కంటె భయంకరమైన పరిణామాల్ని సృష్టిస్తాయి....

డిస్పరేట్‌గా తిరుగుతున్న షాడో కనులకు కనిపించాయి, ఒక మూలగా వున్న ఆయిల్ డ్రమ్ములు. స్థావరంలోని కాగడాలు వెలిగించటానికి, చితుకుల మంటలు ఏర్పాటు చేసుకోవటానికి సేకరింపబడిన క్రూడ్ ఆయిల్ అది.

చేతులతో తడిమి, ఒకటికి రెండు సార్లు జాగ్రత్త గా గమనించి ఆ విషయాన్ని నిర్ధారించుకున్నాడు షాడో. ఒక డ్రమ్ము ను పెట్టెల దగ్గిరికి దొర్లించుకుంటూ వచ్చి, అందులోని ఆయిల్ నంతా పెట్టెల్లో వున్న భస్మంలో కలిపేశాడు.

తెరలు తెరలుగా పైకి లేస్తున్న వెగటు వాసనలు ఒక్కసారిగా మాయం అయి పోయాయి. అపురూపమైన దినుసులతో తయారు కాబడిన ఆ భస్మం, ఆయిల్ కలిసే సరికి విరిగి పోయి శక్తి విహీనం అయింది.

"గురూ.... ఇటు చూడు.... ఈ పెట్టెలో ఏముందో చూడు." అంటూ గంగారాం కేక వేసే సరికి, ఆయిల్ డ్రమ్ము ను వదిలి అటుకేసి పరుగు తీశాడు షాడో.

గోడవున్‌లో వెలుగుతున్న చిన్న క్రూడ్ లాంప్ వెలుగులో, భస్మం నిండిన పెట్టెలకు అవతలగా వున్న మరో పెట్టెను తెరిచి వున్నాడు గంగారాం. రకరకాల మేప్‌లు, కాగితాలు, ఏవో మెస్సేజెస్ చెక్కిన వెదురు పలకలు వున్నాయి ఆ పెట్టెలో. ఆ సరంజామా మధ్యనుంచి టైట్‌గా చుట్టి వున్న చిన్న మైక్రోఫిలిం చుట్టను పైకి తీశాడతను.

అదేమిటో గ్రహించే సరికి, ఒక్క క్షణం పాటు అలాగే నిలబడి పోయాడు షాడో.

సీక్రెట్ ఏజెన్సీకి ఆనరరీ ఎడ్వయిజర్ లిన్‌ఫాంగ్ కోసం తాము అబాషిరీ పట్టణం నుంచి మోసుకు వచ్చిన ఫిలిం అది.... దాని కోసమే ప్రాణాలు పోగొట్టుకున్నాడు లిన్‌ఫాంగ్ అసిస్టెంట్ ఓవిన్ టాకా.... శత్రువులు హాొకూకుని పంపించి లిన్‌ఫాంగ్‌ని హతమార్చింది కూడా దాని కోసమే!

“వెల్‌డన్ గంగూ.... మనం వచ్చిన పని పూర్తి అయింది. హిరోషీ గమనించక ముందే దీన్ని అధికారులకు అప్పగిద్దాం. దీనిలోని వివరాల సహాయంతో హిరోషీని సమూలంగా నాశనం చేస్తారు వాళ్ళు. కమాన్.” అంటూ వెను తిరిగి గోడవున్ బయటికి పరిగెత్తాడతను.

కాగడాలు పట్టుకొని స్థావరమంతా కలియ తిరుగుతున్న హిరోషీ అనుచరులు, గోడవున్ సమీపంలోకి ఎందుకు రాలేదో అతనికి అప్పుడు అర్థం అయింది.

తళతళ మెరుస్తున్న కెండో ఖడ్గాన్ని పట్టుకొని, ఒక బండ మీద నిలబడి వున్నాడు హిరోషీ.

“లోపలికి వచ్చిన శత్రువుల్ని ఎలా మట్టు బెట్టాలో నాకు తెలుసు. కాగడాలను వదిలేసి మీరందరూ స్థావరం బయటికి పొండి... తిరిగి నేను ఆజ్ఞ యిచ్చేదాకా లోపలికి రావద్దు.” అంటున్నాడు.

చేతుల్లో వున్న కాగడాలను ఒక చోట గుట్టగా పడేసి పరుగు లాంటి నడకతో స్థావరం బయటికి వెళ్ళి పోయారు అనుచరులందరూ.

రెండు నిముషాల్లో మాయమై పోయింది సందడి. భయంకరమైన నిశ్శబ్దం మరోసారి ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది.

“నీకు ధైర్యం వుంటే నన్ను ఎదిరించి నిలబడు.... పిరికి పందలా పారిపోవాలని ప్రయత్నిస్తే దారుణమైన మరణానికి గురి అవుతావు. స్థావరం బయట

వున్న నా అనుచరుల్ని తప్పించుకొని నువ్వు పారి పోలేవు." ఖడ్గాన్ని గాలిలోకి ఎత్తి బండ మీది నుంచి క్రిందికి దూకుతూ బిగ్గరిగా అన్నాడు హిరోషీ.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో చుట్టూ చూశాడు షాడో. హిరోషీ మాటల్లో అసత్యం ఏమీ లేదు. లోపలికి రావాలన్నా, బయటికి పోవాలన్నా ఒక్కటే దారి....

"బయటికి రారా పిరికి పందా.... సింహం గుహలో అడుగుపెట్టి ప్రాణాలతో ఎలా పారి పోదామని అనుకుంటున్నావురా ?" ఖంగు మంటున్న కంఠంతో అంటూ మరో పది అడుగులు ముందుకు వేశాడు హిరోషీ.

సూటిగా వచ్చి ములుకుల్లా షాడో అంతరంగాన్ని తాకాయి ఆ పలుకులు. పిడికిళ్ళు బిగిస్తూ ఒక అడుగు ముందుకు వేశాడు.

అదిరిపడి అతని చేతిని పట్టుకున్నాడు గంగారాం.

"నీ కేమైనా మతిపోయిందా ? కత్తి యుద్ధంలో ఆ దుర్మార్గుడు అఖండుడని తెలిసి కూడా పోయి కలబడతావా ?" అంటూ ఆపటానికి ప్రయత్నించాడు.

అతని చేతిని విసిరి కొట్టి రెండు అంగల్లో హిరోషీ ముందుకు పోయాడు షాడో. క్రింద పడివున్న కాగడాను ఒక దాన్ని అందుకొని సిద్ధంగా నిలబడ్డాడు.

వికటంగా నవ్వుతూ ఖడ్గాన్ని గిర్రున తిప్పాడు హిరోషీ. ఇంతెత్తున గాలిలోకి ఎగిరి, బాణంలా అతని మీదికి వచ్చేశాడు.

తను నేర్చిన విద్యలనన్నిటిని గుర్తుకు తెచ్చుకొని, ఆ ఎటాక్‌ని తట్టుకోగలిగాడు షాడో. అప్పటికీ బాలెన్స్ నిలబెట్టుకోలేక పది అడుగుల దూరంలో పడి పోయాడు.

"సంవత్సరాల తరబడి నేను తయారు చేసిన పథకాలను నాశనం చేయటానికి వచ్చావా ? నా కుడి భుజమైన వాన్‌టాంగ్‌ని బలి తీసుకుంటావా ? అంగుళం అంగుళం చొప్పున నిన్ను హతమారుస్తాను...." అంటూ కత్తి ని విసిరాడు హిరోషీ. సన్నటి గాటు ప్రత్యక్షం అయింది షాడో గుండెల మీద. బ్లేడుతో గీరినట్లు సన్నగా అతిస్వల్పంగా వుంది అది.... ఉబికి ఉబికి రావటం లేదు రక్తం. బొట్లు బొట్లుగా చెమరుస్తున్నది.

బిగ్గరిగా నవ్వుతూ మరోసారి ఖడ్గాన్ని విసిరాడు హిరోషీ.

కాగడాతో దాన్ని అడ్డుకుంటూ అవతలికి దొర్లాడు షాడో. అప్పటికే అతని భుజాల మీద ప్రత్యక్షం అయినాయి మరో రెండు గాట్లు.

కందిరీగలు కుట్టినట్లు నెమ్మదిగా ప్రారంభమై షాడో నరాలను మెలిపెట్టడం ప్రారంభించింది భరించరాని బాధ. హిరోషీ ఉద్దేశ్యం ఏమిటో అవగతమయ్యేసరికి చెమటతో నిండిపోయింది అతని శరీరం.

అంగుళం అంగుళం చొప్పున గాట్లు పెడుతూ, మెడ ప్రక్కన వుండే రక్త నాళాలకు గురి చూస్తున్నాడతను. కత్తి మొన ఆ నాళానికి తగిలిన మరుక్షణం మెదడుకు రక్త ప్రసరణ ఆగి పోతుంది. రక్త ప్రసరణ ఆగి పోయిన మరుక్షణం బలహీనమై పోతుంది మెదడు. ఆలోచించే శక్తి ని కోల్పోతుంది.

పళ్ళు బిగించి ఒక్క ఉదటున లేచాడు షాడో. నేలను కాలితో తన్ని హిరోషీ మీదికి దూకాడు.

ఖడ్గాన్ని క్రింది నుంచి తిప్పి బలంగా కొట్టాడు హిరోషీ. రెండు అడుగులు వేసి పాదంతో లాగిపెట్టి తన్నాడు.

రెక్కలు వచ్చినట్లు ఎగిరి గోడవున్ ప్రక్కన పడ్డాడు షాడో. ఊపిరి ఆగి పోయినట్లు బాధ పడుతూ లేచి నిలబడబోయాడు. అందుకు అవయవాలు సహకరించక, నిస్సహాయంగా నేలకు వాలి పోయాడు.

"శక్తి లేని వృద్ధుడిగా పడిన ప్రదేశాన్నే కౌగలించుకుని వుండిపోతావేమిటిరా ? లేచి యువతలకు రా...." ఉరుములాంటి కంఠంతో వున్న చోటినుంచి కదలకుండా అరిచాడు హిరోషీ.

శరీరంలో వున్న శక్తినంతా కేంద్రీకరించుకున్నా లేచి నిలబడటం అసాధ్యం అయ్యేసరికి పట్టరాని బాధ షాడోని ఆవరించుకుంది. నిస్సహాయంగా పిడికిళ్ళు బిగిస్తున్న అతని కనుల ముందు ఉన్నట్లుండి ప్రత్యక్షం అయ్యాడు కాషాయ రంగు వస్త్రాలు ధరించిన ఒక శతవృద్ధుడు. తెల్లగా నెరిసిన గడ్డం గుండెల మీదికి వ్రేలాడుతోంది. పొడుగాటి జుట్టు భుజాల మీద పరుచుకొని వుంది.

"అబుటూ శిఖరం ఎక్కి బంజాయ్ వీరుడిగా పేరు పొందావు. కెండో వారియర్లను ఒక వూపు వూపిన ఆ బంజాయ్ లక్షణాలు మాత్రం నీలో కనిపించటం లేదు రాజూశాన్...." అంటూ ముడుతలు పడిన చేతిని జాచి అతని వీపు మీద బలంగా చరిచాడు.

బిగపట్టిన నరాలు ఒక్కసారిగా వదులై పోయినట్లు అనుభూతి చెందుతూ ఛెంగున లేచాడు షాడో.

"సమయానికి వచ్చి నా అజ్ఞానాన్ని తొలగించారు బాబా.... ఇప్పుడే వస్తాను." అంటూ హిరోషీ ముందుకు పరుగు తీశాడు.

ఖడ్గాన్ని గాలిలోకి ఎత్తి రెడీగా నిలబడి వున్నాడు అతను. షాడోని చూడగానే ఒక్కసారిగా గాలిలోకి ఎగిరాడు.

తను విన్న బంజాయ్ వీరుల కథలనన్నిటినీ మననం చేసుకున్నాడు షాడో. కెండో వారియర్స్‌ని వాళ్ళు ఎలా అడ్డుకున్నదీ గుర్తుకు తెచ్చుకుంటూ, తొడ విరిచి తను కూడా గాలిలోకి ఎగిరాడు.

కత్తిని ముందుకు దించబోతున్న హిరోషీ ఎదురు చూడని ఆ కదలికకు స్వల్పంగా కంగు తిన్నాడు. క్షణంలో పదోవంతు కాలం స్తంభించి పోయింది అతని హస్తం.

ఆ కాస్త వ్యవధిలోను కుడి కాలిని అతని భుజానికి చుట్టి తల్లక్రిందులుగా నేలను తాకాడు షాడో. చేతులతో ఖడ్గాన్ని గట్టిగా పట్టుకొని బలంగా వెనక్కి వంచాడు.

బాధగా నొసలు విరుస్తూ ఖడ్గాన్ని వదిలేశాడు హిరోషీ. ఎడమపాదంతో దాన్ని దూరంగా తన్ని, అతన్ని అమాంతం గాలిలోకి లేపేశాడు షాడో. గుండెల నిండా గాలి పీల్చుకొని దూరంగా విశిరేశాడు.

భరించరాని బాధతో, విపరీతమైన అవమానంతో నల్లగా కమిలిపోయింది హిరోషీ వదనం. స్థావరం దద్దరిల్లి పోయేటట్లు అరుస్తూ క్రింది నుంచి లేచి, దూరంగా పడిన ఖడ్గం దగ్గిరికి పరుగు తీశాడు.

పిడికిళ్ళు బిగించి ఎటాక్ చేయటానికి సిద్ధ పడుతున్న షాడోని వెనుక నుంచి పట్టుకున్నాడు అక్కడ ప్రత్యక్షం అయిన వృద్ధుడు.

"ఆవేశం తప్ప నీకు ఆలోచన లేదు రాజూశాన్.... స్థావరం బయట వున్న వారందరూ లోపలికి వచ్చేస్తున్నారు చూడు" అంటూ అతన్ని చిన్న పిల్లాడిలా భుజం మీద వేసుకొని స్థావరం వెనుక భాగంలో వున్న కొండల దగ్గిరికి పరుగు తీశాడు.

అడుగు పెట్టటానికి వీలుకానట్లు ఎత్తుగా కనిపిస్తున్న ఆ కొండల మధ్యలో వర్షపునీరు పోవటానికి సన్న నిగాడి ఒకటి కనిపిస్తోంది. దాని మధ్యలో పొడుగాటి మోకు వ్రేలాడుతోంది.

ముఖ ద్వారంలోనుంచి తప్ప లోనికి రావటానికి వీలులేని ఆ స్థావరం లోకి వృద్ధుడు ఎలా వచ్చాడో షాడోకి అప్పుడు అవగతం అయింది.

తిమ్మిరెక్కిన చేతిని సవరించుకుంటూ, క్రింద పడిపోయిన ఖడ్గాన్ని అందుకొని పరుగు పరుగున అక్కడికి వచ్చేశాడు హిరోషీ. కేకలు పెడుతూ అతని వెనుకే ప్రత్యక్షం అయినారు అతని అనుచరులు.

మోకును పట్టుకొని ఉడతలా కొండ మీదికి ఎగబ్రాకాడు వృద్ధుడు. తనను అనుసరించి వచ్చిన గంగారాంని కూడా పైకి లాగి మోకును క్రిందికి విశిరేశాడు.

పట్టరాని ఆగ్రహంతో పరుగులు తీస్తూ, స్థావరం బయటికి పోయి, చుట్టు దారిన ఆ కొండల దగ్గరికి వచ్చాడు హిరోషీ. కాగడాలు పట్టుకొని ఆ ప్రదేశమంతా వెతికారు అతని అనుచరులు. ఎంత వెతికినా వారికి కనిపించలేదా వృద్ధుడు. షాడోని భుజం మీదినుంచి దించకుండానే, చీకట్లలో కలిసి మాయం అయిపోయాడు.

## 22

"అబుటూ శిఖరం మీది నుంచి బంజాయ్ వీరుడు తోషీవాన్ క్రిందికి దిగాడని వినగానే అనుమానం వచ్చి యిటుగా బయలు దేరాను రాజూశాన్. నా వూహ యదార్థం అయింది. నిన్ను కుంగ్‌ఫూ విద్యాపీఠానికి చేర్చటమే నా కర్తవ్యం" పెదవుల మీద సన్నటి చిరునవ్వు ప్రత్యక్షం అవుతుండగా అన్నాడు శత వృద్ధుడు అయిన కుంగ్‌ఫూ వస్తాదు టకమారా.

వినయంగా ముందుకు వంగి అతని పాదాలకు నమస్కరించాడు షాడో. గంగారాం దగ్గర వున్న మైక్రో ఫిలింని ఆయన చేతిలో పెట్టి జరిగినదంతా వివరించాడు.

"నీ సాహసం నన్ను ముగ్ధుడిని చేస్తోంది రాజూశాన్. దీన్ని వెంటనే ప్రభుత్వానికి అందించి హిరోషీ ఆగడాలను శాశ్వతంగా అడ్డుకునే ఏర్పాట్లు చేయిస్తాను. ఇక అనవసరమైన ఆలోచనలు చేయకుండా విద్యా పీఠానికి ప్రయాణం కావటం చాలా మంచిది." మైక్రో ఫిలింని దుస్తుల్లో భద్రపరుస్తూ అన్నాడు టకమారా.

"సుమీ ఇవాటో స్థావరం నుంచి తప్పించిన ఫాక్స్ ఎలా వున్నాడో తెలుసుకోకుండా ఎలా రాగలను బాబా ?" వినయంగా అడిగాడు షాడో.

మృదువుగా నవ్వుతు చేయి తిప్పి ఒక దిశకు చూపించాడు టకమారా.

ఒక చెట్టుక్రింద కూర్చుని వున్నాడు ఫాక్స్. షాడో తన వైపు చూడగానే నీరసంగా నవ్వుతూ చేయి వూపాడు.

తన జాడలు అంత ఖచ్చితంగా టకమారాకు ఎలా తెలిసిపోయాయో అర్థం చేసికొని, మరింత వినయంగా తల వంచి నమస్కరించాడు షాడో.

"మీరు పెద్దలు. ఎటువంటి పరిస్థితుల్లో నేను పారిపోయి వచ్చానో వివరంగా విని కూడా, నన్ను బంధించి తీసుకుపోతానని అనటం భావ్యంగా లేదు. చేయని నేరానికి శిక్షను అనుభవించే ఓపిక నాకు లేదు. గుడ్‌బై బాబా.... గుడ్‌బై...." అంటూ వెనుతిరిగి వేగంగా అవతలికి పరుగు తీశాడు.

ఉలిక్కి పడి లేచాడు టకమారా. "ఆగు రాజూశాన్.... ఆగు." అంటూ అతన్ని పట్టుకోవటానికి ప్రయత్నించాడు.

వింటినుంచి వెలువడిన బాణంలా వేగంగా పోయి, ఆ కొండ గుట్ట ప్రక్కనే ప్రవహిస్తున్న నదిలోకి దూకేశాడు షాడో.

పరుగు పరుగున వచ్చిన టకమారా కనులకు షాడోతో పాటు నదిలోకి దూకేస్తున్న గంగారాం మాత్రమే కనిపించాడు. రెండు క్షణాల తరువాత అతను కూడా దృష్టి పథం నుంచి దూరమై పోయాడు.

- శుభం -

# ఆఖరి మాట!

కుంగ్‌ఫూ విద్యా పీఠంలో తన మీద పడిన అపనిందను తొలగించు కోవటం కష్టమని తెలిసే టకమూరా చేతుల్లో నుంచి జారి పోయాడు షాడో. నిజం నిలకడ మీదగాని తెలియదని అతని నమ్మకం.

తన మీది అపనిందను అతను ఎలా తొలగించుకున్నాడో, ఈ లోపల గాలిపటం వంటి అతని జీవితం ఏ ఏ మలుపులకు గురి అయిందో మరో నవలలో[1] వివరించాను.

అభినందనలతో

మధుబాబు

హనుమాన్ జంక్షన్

1. 9. 1982

[1] మధుబాబు "బాబ్", ఇతర షాడో థ్రిల్లర్స్ కినిగె లో... త్వరలో....


BANZAAY
MADHUBAABU